ఆంధ్రవాఙ్మయ చరిత్ర

కాశీనాథుని
నాగేశ్వరరావు

ప్రకాశకులు :
ఆంధ్రగ్రంథమాల,
తపాలాపెట్టె 212,
మద్రాసు 1.

వెల రూ
2-0-0

నాగేశ్వరరాయు గ్రంథావళి

౧

Printed at the Andhra Patrika Press, Madras.
Under Q. H. M. S. No. 204. 15-5-'47. 2000 Copies.

మనవి

విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు తమ దేశోద్ధారకకృషిజీవితములో తమ సంస్కృతిని నిర్దిష్ట గ్రంథ రూపములలో రచించి ప్రకటించ బూనుకొనలేదు. భగవద్గీతా తాత్పర్యము వినా, ఆయన, గ్రంథములేవియు రచించి ప్రకటించ లేదు. ఆయనజీవితానుభవములు అపారములు. ఆయనహృదయ మనేక-లోతులను మునిగి చూచినది. తత్ఫలితమైన విజ్ఞానఫలములను స్వీయచరిత్ర రూపమున వెలువరించి లోకమున కందజేసి యుపకృతి కావింపవలెనని సహృదయ మిత్రబృందము లాయన నెంతో ప్రోత్స హించిరి. సద్విద్యాసాధకునికి సహజమైన సంయమనముతో అట్టిరచన నేదియు చేయక ఆయన సంక్షేపించిరి. జీవిత సుఖదుఃఖానుభవ ఫలములు, తత్తన్మనస్థితులు, ఆచరణసాధ్యాసాధ్య గుణదోష ములు, ఆయా విషమసమయములలో ఒక మహానుభావు డెట్లు తన మనోవాక్కర్మలను నడిపించుకొనెనో మనకు లభించకపోవుట మన అభాగ్యము.

కాని పంతులుగారి విజ్ఞానసంస్కృతి, చిత్తవృత్తులు మనకు పూర్తిగా లభించకపోలేదు. ఒక్కొక్కటియూ గ్రంథరూపములలో ఆయన కావ్యసృష్టికి బూనుకొనకున్నను, అనేక వ్యాసములుగా, ఇతర కవికృత కావ్యముల కుపోద్ఘాతములుగా, ఆయా సభా వేదికల ఉపన్యాసములుగా ఆయన సాహిత్యసేవ కొంత కొంత మనకు మిగిలినది. ఆంధ్రభాషా వర్ణాక్షరముల సంజ్ఞాప్రాముఖ్యము మొదలుకొని మంత్రయోగాది నిగూఢవిద్యా విషయములవరకు, విస్తృత ధీశక్తితో ఆయన చర్చించని విషయము లేదు.

పంతులుగా రచ్చుటచ్చుట రచించిన వ్యాసములను, ఇచ్చిన ఉపన్యాసములను, ఆయా గ్రంథములకై పలికిన తొలిపలుకులను విషయవిభాగముగా క్రోడీకరించి "నాగేశ్వరరాయ గ్రంథావళి" రూపమున ప్రకటించుట కెన్నాళ్లనుండియో సంకల్పించుకొనియు మేము నేటివరకు సఫలారంభులము కాలేకపోతిమి.

ఆంధ్రవాఙ్మయసూచిక కాయన రచించిన ఉపోద్ఘాతమగు "ఆంధ్రవాఙ్మయచరిత్ర" మును విడిగ్రంథముగా ప్రచురించవలసిన దని సహృదయులగు పండితులు చాలకాలముగా కోరుచుండుటచే ఇప్పుడు ఈ గ్రంథావళిముఖమున ఈ ఆంధ్రవాఙ్మయచరిత్రను ప్రకటించు చుంటిమి.

ఆంధ్రదేశ మీ గ్రంథములను సాదరాభిమానములతో స్వీకరించగలదని ఆశించుచున్నాము.

ప్రకాశకులు.



శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు

సాంకేతనామము

న-5

ఆంధ్రవాఙ్మయచరిత్ర

౧

పరిణామ, వికాసములు

ఆంధ్రవాఙ్మయము చిరకాలసంవర్ధితమై యవిచ్ఛిన్నముగ వర్ధిలుచున్నది. వాఙ్మయవికాసపరిణామములకుఁ బ్రజాజీవన వికాసపరిణామము లాధారములుగ నున్నవి. ప్రజాజీవనమునందు గోచర మగు వృద్ధిక్షయములు వాఙ్మయచరిత్రమునందు గోచరించు చుండును. రాజకీయవిజయములు, సాంఘిక పరివర్తనములు, మత మీమాంసలు, ప్రకృతిసంపదలు వాఙ్మయ స్వరూపములందుఁ బ్రత్యక్ష మగుచుండును. అనేక శతాబ్దములందు వృద్ధిక్షయములకు లోనగుచు వచ్చి నేఁటికిని జీవకళలతో విలసిల్లుచున్న ఆంధ్రవాఙ్మయ పరిణామము ప్రజాహృదయక్షేత్రములందును, వాఙ్మయస్వరూపము లందును బ్రత్యక్షముగ గోచరమగుచున్నది. ప్రత్యక్షముగఁ గను పడుచున్న వాఙ్మయపరిశీలనము వాఙ్మయ హృదయ గ్రహణము నకును, భావి వికాసమునకును సాధనము గాఁగలదు.

ఆంధ్రులు ద్రవిడశాఖకుఁ జెందినవా రను సిద్ధాంతము సామాన్యముగ నంగీకరింపఁ బడుచున్నది. బ్రాహ్మణులందు ఆంధ్రులు, తమిళులు, కర్ణాటకులు, ఘూర్జరులు, మహారాష్ట్రులు పంచ ద్రావిడ బ్రాహ్మణులు. వింధ్యాద్రికి దక్షిణభాగములు వీరికి నివాసస్థలములు. ద్రవిడు లార్యులకుఁ బూర్వము పశ్చిమోత్తరమార్గమున భరత ఖండమునందుఁ బ్రవేశించిన పరదేశీయు లను సిద్ధాంతమును బండితులు ప్రతిపాదించుచున్నారు. దక్షిణదేశప్రాంతవాసులు - ముఖ్యముగఁ దమిళులు - ఆర్యులు రాకపూర్వము దక్షిణదేశము నందు స్థిరవాసముల నేర్పఱచుకొని శాస్త్రకళాకోవిదులై వర్ధిలుచుం

డిరి. పి. టి. శ్రీనివాసయ్యంగారు ద్రవిడు లాదిమవాసులని సిద్ధాంతమును జేసినారు. ద్రావిడు లాదిమనివాసులైన యారణ్యకజాతుల వలె ననాగరికులుగారని వారి ప్రాచీన సభ్యత విశదము చేయుచున్నది. బెలూచిస్థానమునందుఁగల బ్రాహూయీభాషకును, ద్రవిడ భాషలకును గల పోలికనుబట్టి ద్రవిడులకును, బ్రాహూయీలకును సంబంధముగలదని కాని, ద్రవిడులు వాయవ్యదిశనుండి వచ్చినవారని కాని నిర్ణయించుట యసమంజసము. రామాయణము లంకయందు నాగరకత ప్రబలియున్నటులు తెలుపుచున్నది. లంకాపుర వర్ణన మీ కాలపు నగరవర్ణనలను స్మరింపఁజేయుచున్నది. రామాయణ కాలమునందు దక్షిణ దేశము నాగరకతను గలిగియున్న విధమును రామాయణము తెలుపుచున్నది. ఆర్యశాఖకుఁ జెందినవారు ప్రపంచమునం దంతటను గనుపడుచున్నారు. ద్రవిడశాఖకుఁ జెందిన వా రితరప్రాంతములందు గనుపించుటలేదు. ద్రవిడు లార్యులు రాకపూర్వమే దక్షిణభాగమునందుఁ బ్రబలమైన నాగరకతను గలిగియుండిరి. లంకకును, దక్షిణదేశమునకును సంబంధ ముండియుండుట సహజము. సంబంధము లేనియెడల లంకస్థితియే వారికి తెలిసియుండదు. లంకాద్వీపవాసులును, ద్రవిడులును మహాప్రళయమునందు మునిఁగిపోయిన సుమేరియా ఖండవాసులై యుందురేమో విమర్శింపఁదగిన విషయముగ నున్నది. ద్రవిడులకు, ద్రూయిడులకు సంబంధ మేమైనను గలదేమో పరిశీలింపఁ దగిన విషయము. అస్సీరియనులకును, ద్రవిడులకును సంబంధము గలదని ద్రవిడపండితులు కొందఱు ప్రతిపాదించుచున్నారు. హిందూ పత్రికయందు రామస్వామి అయ్యరు గారు బైబిలునందలి హీబ్రూపదములకును, తమిళ పదములకును జూపిన పోలికలు విచారయోగ్యములుగ నున్నవి. ఆర్యుల సంపర్కమువలన గాలక్రమమున ద్రావిడసభ్యతయందు మార్పులు గలిగినను ద్రవిడుల ప్రాచీనత, సభ్యత నిర్వివాదాంశములు. పండితులు విషయవిమర్శనమును ద్రావిడార్యాభిమాన దృష్టితోఁ గాక సత్యాన్వేషణాభిలాషతోఁ జేయుట సమంజసము.

ఆంధ్రులు

తెలుఁగు, తెనుఁగు, ఆంధ్రశబ్దములు సమానార్థకములుగ నిపుడు వాడుకయందున్నవి. ఈపదములందాంధ్రపదమే ప్రాచీనము. ఈపదములు దేశమునకును, ప్రజలకును, భాషకును సమానార్థకములుగ వాడుకయందున్నవి. ఈపదముల వ్యుత్పత్తిని నిర్ణయించుటకుఁ బండితు లింతవఱకును జేసిన ప్రయత్నములు సంతృప్తికరముగఁ గనుపడవు. ఆంధ్రు లార్యులా, ఆర్యేతరులా యనువిషయమై వాదప్రతివాదములు జరుగుచున్నవి. ఆంధ్రుల చరిత్రను వ్రాసిన శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారు మొదలగువా రాంధ్రులార్యులని నిర్ణయించియున్నారు. ప్రజలవలన దేశభాషార్థము రూఢిమైనదియు, దేశమువలన ప్రజాభాషార్థము రూఢిమైనదియు నిర్ణయించుట దుష్కరముగ నున్నది. ఆంగ్లప్రజలవలన నాంగ్లదేశభాషార్థములు రూఢిమైనవి. మహారాష్ట్రఘూర్జర ప్రజలవలనను దేశభాషార్థములు రూఢిమైనవి. పాంచాలదేశనామము ప్రజార్థమును రూఢిచేసినది. ఆంధ్రపదమునందును, తెలుఁగుపదమునందును నీ రెండుభావములును నిమిడియున్నటు లూహింపఁదగియున్నది. తెలుఁగుపదము త్రిలింగపదజన్యమైనను, త్రికళింగపదజన్యమైనను నాదిని దేశపదార్థ ప్రతిపాదకమై కాలక్రమమునఁ బ్రజాభాషాపరమైనటు లూహింపఁ దగియున్నది. తెనుఁగుపదమునకును, మాధుర్యమును సూచించెడి తేనెపదమునకును, తేట, తిను, తెలుపు, తెలియు, తేలిక పదములకును గల సంబంధ మెట్టిదో విచారయోగ్యము. ఆంధ్రనామ మాదిని బ్రజాపరమై కాలక్రమమున రాజప్రాబల్యమువలన దేశభాషాపరమైనటులు తోఁచుచున్నది. ఆంధ్రరాజుల ప్రాభవ మాంధ్రపదార్థమును స్ఫుటముచేసినది. ఆంధ్ర, తెలుఁగుపదముల వ్యుత్పత్త్యర్థమును, చరిత్రార్థమును దురవగాహములుగ నున్నవి. ఆంధ్రశబ్దమును, తెలుఁగుపదమును సంస్కృత ప్రాకృత ద్రవిడసంస్కారములందే సంస్కారప్రాభవమును సూచించినను వర్తమానకాలమునందు సమానార్థమును దెలుపుచున్నవి.

సమానార్థమును దెలిపెడి పదప్రయోగములందు విపరీతాభిమానమును వహించుట ధీమంతుల కనుచితము.

ఆంధ్రు లుత్తరదేశమునుండి వచ్చిన యార్యులని సంస్కృత గ్రంథములవలనఁ దెలియుచున్నది. ఆంధ్రులు కృష్ణాతీరమునందుఁ గల శ్రీకాకుళమునుండి గోదావరీతీరమునందుఁ గల నాసికవఱకును వ్యాపించినటులు గాథలు గలవు. ఈగాథలను సమర్థించుటకుఁ దగిన యాధారములు గనుపడవు. ఆంధ్రరాజులకు ప్రారంభమునందు ప్రతిష్ఠానపురము చిరకాలము రాజధానిగ నుండినటులు శాసనాదులు తెలుపుచున్నవి. అనంతరము ధాన్యకటకము రాజధానిగ వెలసినది.

ఆంధ్రరాజుల ప్రాభవమువలన దేశమునకును, భాషకును, ప్రజలకును ఆంధ్రనామము రూఢిమైనది. ఆంధ్రప్రాభవము స్థిరపడని ఘూర్జర మహారాష్ట్ర కర్ణాటకాది దేశములందు సహజములైన ప్రజా భాషాబలములు స్థిరపడినవి. పడుమటికనుమలం దాంధ్రులోయ యున్నను మహారాష్ట్ర వాసస్థానముగ నున్నది. నాసికాప్రాంతము నందలి గుహ లాంధ్రవైభవమునకు స్మరణచిహ్నములుగ నున్నను మహారాష్ట్రస్థానములుగ నున్నవి. ఆంధ్రరాజుల ప్రాభవమును శిల్పములు, రాజ్యవిజయములు, దానధర్మములు, మతాభినివేశము చాటుచున్నను వారి ప్రతిభానురూపమైన వాఙ్మయస్వరూపములు గోచరముగాకున్నవి. ఆ కాలమునందు సంస్కృతప్రాకృతభాషలకుఁ గల ప్రముఖతయే ఇందులకుఁ గారణమని యూహింపఁదగియున్నది. బౌద్ధయుగమువఱకును సంస్కృతవాఙ్మయము ప్రముఖతను బడసినది. ఆయుగమునందుఁ బ్రాకృతభాషలకుఁ గొంత ప్రముఖత యేర్పడినను సంస్కృతభాషాప్రాబల్యమునకుఁ బదచ్యుతి గలుగలేదు.

ఆంధ్రరాజులు, వాఙ్మయము

ఆంధ్రరాజు లప్రతిహతముగ నాలుగువందలయేండ్లు భరతఖండమునందు విశేషభాగమును బాలించిరి. వారు నాసికనుండి మచిలీపట్టణమువఱకును, పాటలీపురమునుండి కాంచీపురమువఱకును గల

దేశమును బాలించిరి; దిగ్విజయములను బడసిరి; కళలను బోషించిరి; పండితులను సన్మానించిరి; విహారములను, స్తూపములను, ధర్మశాలలను గట్టించిరి; బ్రాహ్మణులను, సన్న్యాసులను, బౌద్ధులను నాదరించి వారికి వసతులను గల్పించిరి; వాఙ్మయమును బోషించిరి. ఇప్పటికి ౧౮౭౮ సంవత్సరములక్రిందటఁ బ్రారంభమై యవిచ్ఛిన్నముగ సాగుచున్న శాలివాహనశక మాంధ్రరాజుల ప్రతిభను వేయినోళ్లను జాటుచున్నది. *

ఆంధ్రరాజుల ప్రతిభ ప్రజాహృదయక్షేత్రములం దాంధ్రవాఙ్మయమున కంకురారోపణములను జేసినను వారి కాలమునం దాయంకురములు పల్లవించియుండలేదు. పాలకుల భాషలు సంస్కృత ప్రాకృతములు. ప్రజల భాష దేశభాష. బౌద్ధసన్న్యాసులు దేశభాషలందు బౌద్ధధర్మములను బ్రజలకు బోధించినను, ప్రాకృతభాషలే విశేషమైన వ్యాపకమును గలిగియుండినవి. అమరావతిస్తూపమునందును, నాసిక, కార్లిగుహాలందును, ఇతరప్రాంతములందును లభ్యములగు శాసనములు ప్రాకృతభాషయందుఁ గలవు. హాలుఁడు రచియించిన శాలివాహన సప్తశతియును, గుణాఢ్యుఁడు రచియించిన బృహత్కథయును ప్రాకృతపైశాచీభాషలందుఁ గలవు. శాసనములశోకలిపియందుఁ గలవు. రాజావలంబనముగల భాషకుఁ గల ప్రముఖత ప్రజాసామాన్యమునందు వాడుకయందున్న దేశభాషకుఁ గలుగలేదు. అశోకలిపి ఆంధ్రాక్షరముల స్వరూపమును దాల్చుటకును, దేశభాషకు వాఙ్మయస్వరూప మేర్పడుటకును జిరకాలము పట్టినది. ఆంధ్రరాజుల కాలమునందైనను తమిళదేశమునకుఁ గలిగిన శాంతి తెలుఁగుదేశమునకుఁ గలుగలేదు. ఉత్తరదేశాగతులైన శత్రువుల నెదిరింపవలసిన భారము నంతయు నాంధ్రరాజులు వహించు

---

* అయినను ఫ్లీటు మొదలగువారీశకమును స్థాపించినవారు ఆంధ్రరాజులైన శాతవాహనులు కారని శంకించుచున్నారు. కొన్నికొన్ని ప్రాచీనశాసనములలో 'శకరాజ్యాభిషేక సంవత్సరములు' అనియు, 'శకనృపకాలాతీత సంవత్సరములు' అనియు నుండుటయే యట్టి శంకకుఁ గారణము.

చుండిరి. దేశీయవాఙ్మయాభివృద్ధి కీ సంగ్రామపరంపరలును బ్రతికూలమై యుండియుండును. తమిళవాఙ్మయమునకుఁ గల ప్రాచీనత యాంధ్రవాఙ్మయమునకు లేకుండుట కీ పరదేశీయ సంస్కారప్రాబల్యము ముఖ్యకారణమై యుండియుండును.

పల్లవులు - ఆంధ్రవాఙ్మయము

పల్లవులును ఆంధ్రరాజులవలె సంస్కృత ప్రాకృత భాషలను బోషించుచుండిరి. ప్రాచీనపల్లవరాజులు బౌద్ధమతాభిమానులు. ఆంధ్రదేశస్థములైన వేంగిపురము, కాంచీపురమును వీరికి రాజధానులుగ నుండినవి. వేంగిశాసనములును సామాన్యముగ సంస్కృత భాషయందుఁ గనుపడుచున్నవి. వారికాలపు శాసనములును ఆరంభమునందు ప్రాకృతమునందున్నను దరువాతివి సంస్కృతభాషయందుఁ గలవు. పల్లవరాజులు దాల్చిన ముక్కంటి మొదలగు నామములనుబట్టి వారికాలమున దేశభాషలయెడ నాదరణము ప్రబలినటులూహింపఁ దగియున్నది. వీ రాంధ్రదేశగ్రామస్థులైన బ్రాహ్మణులకు వృత్తుల నొసఁగి పోషించుట కూడ వారి ఆంధ్రాభిమానమునకు నిదర్శనము.

చాళుక్యులు - ఆంధ్రవాఙ్మయము

రాజరాజనరేంద్రుని కాలమునందు నన్నయభట్టారకుఁడు మహాభారతమును దెనిఁగించినను ఆ కాలమునకుఁ బూర్వమే యాంధ్రవాఙ్మయము వృద్ధిని బొందియుండవలయునని యందఱును నంగీకరించుచున్నారు. అప్పటిగ్రంథము లేవియును గనుపడకపోయినను నన్నయభట్టారక విరచిత మహాభారతమే ఆంధ్రవాఙ్మయము గలదని చాటుచున్నది. వాఙ్మయము లేనిది సలక్షణమైన మహాభారతమువంటి కావ్య మాకసమునుండి యుట్టిపడదు. తగిన యాధారములు దొరకువఱకును నాకాలపు వాఙ్మయస్వరూపమునకు సంబంధించిన యూహాపోహాలు నిరర్థకములు. పల్లవులకాలమునందు పల్లవించుట కారంభించిన యాంధ్రవాఙ్మయము రాజనరేంద్రుని కాలమునందు వికసించుట కుపక్రమించినది. గద్యరూపమునఁ గల

యాంధ్రశాసనము లాంధ్రవాఙ్మయాంకురముల స్వరూపస్వభావము లను విశదముచేయుచున్నవి. గుత్తి విప్పర్ల్లులలో దొరికినట్టి చాళుక్య శాసనములును, కడపచోళుల శాసనములును ఆంధ్ర వాఙ్మయమున నింతవఱకుఁ గానవచ్చు మొదటి గద్యశాసనములు. అద్దంకి ధర్మవరములలోని పాండురంగని శాసనములును, విజయవాడయందలి యుద్ధమల్లుని శాసనమును ప్రాచీనాంధ్ర పద్యవాఙ్మయమునకు నిదర్శనములుగ నున్నవి. ఆపద్యములు సూత్రాగణబద్ధములై తరువోజాక్కరల రూపమున నున్నటులు పండితుల నిర్ణయము. ఇట్టి గద్య పద్యశాసనముల నేర్పరిచి ఆంధ్రవాఙ్మయారంభములను నిర్ణయించుట వాఙ్మయపరిశోధన కవసరము. వేంగీపుర జీర్ణములను, నితర జీర్ణములను, ప్రాచీనాంధ్ర శాసనములను బరిశీలించుటవలన నాంధ్ర వాఙ్మయారంభములను నిరూపించుట కవకాశములు గలుగఁగలవు. భాషాపరిశోధకులును, శాసన పరిశోధకులును జేసెడి పరిశోధన లిట్టి ఫలసిద్ధికిఁ దోడ్పడఁగలవు. బర్మాదేశమునందుఁ గల తలైంగు (తెలుంగు) రాజుల ప్రాచీనశాసనములును ఆంధ్రవాఙ్మయారంభములను నిరూపించుటకుఁ దోడ్పడవచ్చును. ఈ రాజులు క్రీస్తుశకమునకు పూర్వమే తెలుఁగుదేశమునుండి వలసపోయి బర్మాయందు రాజ్యములను స్థాపించిరి. వారి శాసనముల లిపి వేంగిచాళుక్య లిపిని బోలి యున్నటులు పండితుల మతము.

ఆంధ్రవాఙ్మయ వికాసము

సకల పదార్థముల వికాసమునకువలె వాఙ్మయవికాసమునకును సమాజసత్త్వమును, పరిసరములును సాధనములు. ప్రజాసత్త్వము ప్రకృతిపరిసరముల కనురూపముగ భాషాముఖమున సువ్యక్తమగుచుండును. అనుకూలపరిస్థితులు వృద్ధికిని, ప్రతికూల పరిస్థితులు క్షయమునకును గారణము లగుచుండును. వృద్ధిక్షయావస్థలందు సైతము మూల స్వరూపము గోచరమగుచుండును. ఆంధ్ర భాషావాఙ్మయవికాసమునకు సంస్కృత ప్రాకృత ద్రావిడభాషా వాఙ్మయములు దోడ్పడినను ఆంధ్రప్రజా సత్త్వానురూపముగ

భాషావాఙ్మయములు వికసించినవిధమును భాషాచరిత్రమును, వాఙ్మయచరిత్రమును విశదము చేయుచున్నవి. ఆంధ్రభాష ద్రవిడభాష యని కొందఱును, ప్రాకృతభాష యని కొందఱును సిద్ధాంతమును జేయుచున్నారు. ఆంధ్రభాషకు ద్రావిడజననముగాని, ప్రాకృత బాంధవ్యముగాని గౌరవాగౌరవములకుఁ గారణము గాఁజాలదు. తెలుఁగు తమిళ కర్ణాటకభాష లొకజాతిభాషలగుటవలనఁ దెలుఁగు భాషకుఁ గల గౌరవమునకు లోపము గలుగదు. తెలుఁగునకు సంస్కృతప్రాకృతభాషల బాంధవ్యమును బ్రతిపాదించుటవలన దాని గౌరవము హెచ్చదు. ఆంధ్రభాషావాఙ్మయముల యౌన్నత్యమునకు స్వకీయప్రతిభ సాధనముగాని పరకీయసంబంధము కారణము గాఁజాలదు.

దక్షిణ పీఠభూములందు ద్రవిడు లార్యులు రాక పూర్వము నివసించుచుండిరి. ద్రవిడులకుఁబూర్వము ముండ, కోయ, చెంచు మొదలగు నారణ్యకజాతులు నివసించుచుండిరి. ఆదిమాంధ్రులును, ఏనాదులును అనాదివాసులుగ పరిగణింపఁబడుచున్నారు. అనంతరము నాగు లీ పీఠభూముల నాక్రమించిరి. నాగులును దక్షిణపీఠభూముల కాదిమవాసులై యుందురని కొందఱు తలఁచుచున్నారు. చిలుకూరి వీరభద్రరావుగా రాంధ్రదేశమునందును నాగులు నివసించినటుల చరిత్రయందు వ్రాసియుండిరి. నాగుల యనంతరము ద్రవిడులును, ఆర్యులును దక్షిణపీఠభూముల నాక్రమించిరి.

తెలుఁగు తమిళ కన్నడములు ద్రవిడభాషలు. ఈభాష లొక కుటుంబమునకుఁ జెందిన భాషలు. ఈభాషలకు సహాజమైన సంబంధము గలదు. ఆంధ్రభాష ద్రవిడభాషాకుటుంబమునందు ప్రత్యేక కుటుంబముగ సర్ జార్జి గ్రీర్సనుగారు నిర్ణయించిరి. తెలుఁగునుండి అఱవము పుట్టినదనుటగాని, యఱవమునుండి తెలుఁగు పుట్టినదనుట గాని యసంగతము. ఏకమాతృభాషాజన్యములైన తెలుఁగు తమిళ భాషావాఙ్మయములు స్వీయతత్త్వమునకును, పరిసరములకును ననురూపముగ వర్ధిల్లి వ్యక్తిత్వమును బడసినవి.

దక్షిణపీఠభూమి ఆదికాలమునుండియును ఆంధ్రభాషకు నిలయము. కృష్ణాగోదావరీనదుల నడుమ నుండెడి తెలుఁగు బాసకుఁ 'దమిళ' భాషాసంపర్కము బొత్తిగ లేదు. తెలుఁగునకు సంస్కృత ప్రాకృతభాషల ప్రాభవము తమిళమునకంటె నధికతరముగ సంక్రమించినది. సంస్కృతభాషాసంక్రమణము తెలుఁగునకు సంస్కృతసంస్కారము నొడఁగూర్చినను భాషాసాంప్రదాయమునకు భంగము గలుగలేదు. తెలుఁగుపదములు, పదవాక్యముల రీతులు, వ్యాకరణము, దేశిఛందస్సు ఆంధ్రభాషాస్వరూపమును ప్రతిపాదించుచున్నవి.

సంస్కృతభాషా ప్రాభవము

వేదసూత్రయుగములందే దక్షిణ పీఠభూములం దార్యులు వాసస్థానములను గల్పించుకొనినటులు భారతీయేతిహాసములు తెలుపుచున్నవి. ఆంధ్రరాజు లార్యులు. అత్రి, అగస్త్యుఁడు, భరద్వాజుఁడు, గౌతముఁడు మొదలగు మహర్షులును, వారి శిష్యులును ప్రాచీనకాలమునందే దక్షిణదేశమున నాశ్రమములను గల్పించుకొని యార్యసంస్కారమును వ్యాపింపఁజేయుచుండిరి. ఆర్యమహర్షులు విజ్ఞానవ్యాసనమున కనవరతము పాటుపడిరి. ఆంధ్రదేశమున కొక కేంద్రస్థానమైన శ్రీశైల మార్యులకు దక్షిణాపథమునందు నొక కేంద్రముగ నేర్పడినది. నిత్యసంకల్పమునందు స్థలనిర్దేశమునకు శ్రీశైలము నేఁటికిని పేర్కొనఁబడుచున్నది. సూత్రయుగమునకుఁ బూర్వమే బ్రాహ్మణసంస్కారములును, సంస్కృతవిజ్ఞానమును నాంధ్రదేశమునందుఁ బ్రతిష్ఠను బడసినవి. సంస్కృతభాషా, వాఙ్మయము లాకాలమునుండి నేఁటివఱకును నాంధ్రభాషా, వాఙ్మయముల వికాసమునకుఁ దోడ్పడినవిధమును భాషావాఙ్మయములు తెలుపుచున్నవి. ఆంధ్రభాష తద్భవతత్సమపదములతో నిండియున్నది. ఆంధ్రవాఙ్మయము సంస్కృతగ్రంథముల యనువాదగ్రంథములతో నిండియున్నది. ఆంధ్రవాఙ్మయమునందు సంస్కృతవాఙ్మయప్రాబల్య మధికముగ నున్నను ఆంధ్రవాఙ్మయము తన వ్యక్తిత్వమును గలిగియే యున్నది.

ఆంధ్రు లార్యుల యక్షరామ్నాయమును, విజ్ఞానమును నిరభ్యంతర ముగ స్వీకరించిరి.

ప్రాకృతభాషా ప్రాబల్యము

బౌద్ధయుగమునందు బ్రాహ్మణ ప్రాబల్యమునకుఁ బ్రతిఘటనము బయలుదేరినది. విజ్ఞానమంతయు బ్రాహ్మణాధీనమై సంస్కృతభాషయం దుండుటంజేసి జనసామాన్యమునకు దుర్లభముగ నుండెను. బుద్ధభగవానుఁడు ప్రజల యజ్ఞానమును బాపి వారి నుద్ధరించుటకు ధర్మబోధలను బ్రాకృతభాషాముఖమునఁ జేయుట కుపక్రమించెను. ఆ మార్గమునే యశోకుఁడును, ఇతరులును నవలంబించిరి. బౌద్ధజైనమతములు ప్రాకృతభాషలకును, దేశభాషలకును నుత్తేజమును గలుగఁజేసినవి. బుద్ధభగవానుఁడు, మహావీరుఁడు, వారి శిష్యులు బౌద్ధజైన మతబోధలను బ్రాకృతభాషలందును, దేశభాషలందును జేయుట కుపక్రమించిరి. ఆంధ్రదేశమునందు బౌద్ధజైనమతములు విశేషముగ వ్యాపించినవి. శాసనములు ప్రాకృతభాషయందు లిఖింపఁబడినవి. గ్రంథములు ప్రాకృతభాషలందు వ్రాయఁబడినవి.

ఆంధ్రభాషకుఁ బ్రాకృతభాషా సాహచర్యము గలిగినది. పాళి పైశాచి మాగధి మహారాష్ట్రము మొదలగు ప్రాకృత భాషాపదములును, వాఙ్మయములును నాంధ్రభాషా వాఙ్మయములను బెంపొందించినవి. ప్రాచీన బౌద్ధజైనమతగ్రంథముల పరిశోధనమును, ఆంధ్రదేశస్థములైన బౌద్ధస్తూపముల పరిశోధనలును నాంధ్రభాషా వాఙ్మయముల పరిణామ నిర్ణయముల కుపచరింప వలసియున్నవి. పరిశోధకు లీమహాకార్యమునకుఁ బూనుకొని భాషావాఙ్మయముల తత్త్వనిరూపణమునకుఁ దోడ్పడుదురు గాత !

తమిళ కర్ణాటకభాషల సాహచర్యము

అల్లూరు, జగ్గయ్యపేట, అమరావతి శాసనములలోని బ్రాహ్మిలిపి యాంధ్రాక్షరామ్నాయమునకు మూలాధారమైనది. ఒక కుటుంబమునకుఁ జెందినట్టివియును, ఇరుగుపొరుగున నుండునట్టివియును

నగు తమిళ కర్ణాటభాషా వాఙ్మయముల సాహచర్యము తెలుఁగు భాషకు సహజముగఁ గలిగినది. ఆంధ్రభాషావాఙ్మయములకు సంస్కృత ప్రాకృతములవలనఁ గలిగిన యుపకృతి తమిళ కర్ణాటకభాషల వలన నారంభమునందుఁ గలుగలేదు. ఆరంభమునందుఁ దెలుఁగుతమిళ కర్ణాటకభాషావాఙ్మయముల వికసనమున కార్యుల విజ్ఞానమును, నార్యభాషావాఙ్మయముల సంబంధమును నవసరముగ నుండినవి. ఈ భాషలయందు వాఙ్మయారంభములకు సంస్కృతకావ్యము లాధారభూతములుగ నుండినవి. జైనులాంధ్రకర్ణాటక తమిళవాఙ్మయ వికాసమునకుఁ దోడ్పడుచు ద్రావిడవాఙ్మయముల సాహచర్య మును వృద్ధిచేయుచుండిరి. గోదావరీ కావేరీనదుల నడుమనున్న దేశమంతయు కర్ణాటకదేశమని కవిరాజమార్గమునందు దెలుపఁ బడినది. జైనులు హనుమకొండనుండి హళేబీడు వఱకును వ్యాపించి యుండిరి. తెలుఁగుదేశమునంగు జైనులప్రాబల్యము తగ్గినను గన్నడ దేశమునందుఁ జిరకాలము నిలిచియున్నవిధమును కన్నడ వాఙ్మ యము తెలుపుచున్నది. కన్నడవాఙ్మయమునం దాదికవులైన పంప యును, పొన్నయును వేంగిదేశబ్రాహ్మణులు. సుప్రసిద్ధమైన శ్రావణ బెళగొళ ఆంధ్రజైనుల నాకర్షించినది. వీరశైవ మతవ్యాపనకాలము నం దాంధ్రకవులు కర్ణాటకభాషయందుఁ గావ్యములను వ్రాసిరి. పాల్కురికి సోమనాథుఁడు కర్ణాటకాంధ్ర భాషలందుఁ గావ్యము లను రచియించెను. సోమనాథుని వృషాధిపశతకమునందుఁ బలు భాషల పద్యములు గలవు. ఆకాలమునందుఁ గన్నడ తెలుఁగు వాఙ్మయములకు వినిమయము గలుగుచుండెను.

విజయనగరరాజుల కాలమునందు—ముఖ్యముగ శ్రీకృష్ణదేవ రాయల కాలమునందు — ఉభయభాషలకును సాహచర్య మతిశ యిల్లినది. ఆంధ్రకర్ణాటకభాషల సాహచర్యము పరస్పర వికాస మున కుపచరించినది.

తమిళాంధ్రభాషా వాఙ్మయములు

తెలుఁగు తమిళ వాఙ్మయములకుఁ దెలుఁగు కర్ణాటకభాషల కువలె విశేషమైన సంబంధ మేర్పడలేదు. కులోత్తుంగ చోళుఁడు(రాజ రాజనరేంద్రుని పుత్రుఁడు) చోళదేశాభిషిక్తుఁడైనతరువాత నుభయ భాషలకు సంబంధము హెచ్చినది. తమిళులు ద్రావిడాభిమానమును సంపూర్ణముగఁ గలిగియున్న విధమును దమిళభాషావాఙ్మయములు విశదము చేయుచున్నవి. ఆ యభిమానమే వర్తమాన యుగమునం దును ద్రావిడపరిశోధకుల నావహించుచున్నది. కనకసభాపతిపిళ్ల, కృష్ణస్వామి అయ్యంగారు, శ్రీనివాస అయ్యంగారు, సూర్యనారా యణ, దామోదరంపిళ్లగార్లు మొదలగువారు చేసిన పరిశోధన లీ యభిమానమును విశదముచేయుచున్నవి. దామోదరంపిళ్లగారి మాతృ భాషాభిమాన మవ్యక్త సిద్ధాంతములకుఁ గారణమైనది. దామోద రంపిళ్లగారు తమిళవాఙ్మయారంభమును౧౨,౦౦౦ఏండ్లకుఁ బూర్వము నిర్ణయించుచున్నారు. వీరి నిర్ణయ మతిశయోక్తి దోషమునకుఁ బాలైనను క్రీస్తుశకము తరువాతను ౩౦౦ ఏండ్లకే తమిళవాఙ్మయ మునందు స్వర్ణయుగ మేర్పడినదని పండితులు నిర్ణయించుచున్నారు. ఆంగ్లపండితులు తమిళవాఙ్మయము ఏడవశతాబ్దముతో నారంభించి నటులు సిద్ధాంతీకరించినను తమిళ పండితులు క్రీస్తుశకమునకు బూర్వము మూఁడవ శతాబ్దముతో నారంభించుచున్నారు. మాలవి కాగ్ని మిత్రమునందు "పురాణ మిత్యేవ నసాధు సర్వం, నచాపి కావ్యం నవమి త్యవద్యమ్; సంతః పరీక్ష్యాన్యతర ద్భజంతే, మూఢః పరప్రత్యయనేయ బుద్ధిః" అని కాళిదాసు తెలిపిన భావము ప్రాచీనవిషయములందుఁగల గౌరవమును విశదము చేయుచున్నది. ద్రవిడశబ్దమునకు వ్యుత్పత్తిని బరిశోధకులు పలువిధముల వ్రాయు చున్నారు. ద్రవిడపదము ద్రుధాతువునుండి పుట్టినటులు కొందఱును, తమిళపదమునకు రూపాంతరమని కొందఱును దలఁచుచున్నారు. ఆంధ్రతెలుఁగుపదముల వ్యుత్పత్తివలె ద్రవిడతమిళపదముల వ్యుత్పత్తియు దుర్గ్రాహ్యముగ నున్నది.

ద్రవిడదేశమునం దాదిమవాసులు, నాగులు, తమిళులు, ఆర్యులు నను నాలుగుతెగల ప్రజ లొకరితరువాత నొకరు చేరినటులు శ్రీనివాసయ్యంగారు మొదలగువా రభిప్రాయపడినారు. తోడాలు, వెల్లాలు శుద్ధద్రవిడులని వీరిమతము. కాలక్రమమున భిన్నజాతుల సంయోగమువలనఁ బ్రత్యేకలక్షణములను నిర్ణయించుట దుస్తరముగ నున్నది. ఆంధ్రబ్రాహ్మణులు తమిళబ్రాహ్మణులలో నైక్యమును బొందక వ్యక్తిత్వమును గలిగియుండిరి. ఆంధ్రదేశమునందు తమిళబ్రాహ్మణులును, ద్రావిడ బ్రాహ్మణులును ప్రత్యేకాచార వ్యవహారములను గలిగి నివసించుచున్న విధమును వర్తమానకాలము సయితము విశదముచేయుచున్నది. సంఘుజీవనమునందుఁగలుగని సాహచర్యము భాషావాఙ్మయములందును గలుగలేదు.

తమిళభాషా వాఙ్మయములు

ద్రవిడభాషయందు తొల్కాప్యము క్రీ. పూ. మూఁడవశతాబ్దమునందును, కురళ్ క్రీ. శ. మొదటి శతాబ్దమునందును, 'సిలప్పదికారము', 'మణిమేకలై' మూఁడవ శతాబ్దమునందును వ్రాయఁబడినటులు తమిళపండితులు నమ్ముచున్నారు. ఆంధ్రవాఙ్మయమునం దట్టి ప్రాచీన వాఙ్మయము గనుపడదు. ఈ ప్రాచీన వాఙ్మయ నిర్మాణమునకుఁ దమిళదేశమునందును జైన బౌద్ధ మత బోధకులు గారణభూతులని యూహింపఁ దగియున్నది. బ్రాహ్మణ శైవమతవ్యాపనము జైన బౌద్ధమత విజ్ఞానవ్యాపనమును స్తంభింపఁ జేసినది. మూఁడవయుగమునందు శంకర రామానుజాది మతాచార్యులు తమిళవాఙ్మయవికాసమునకుఁ దోడ్పడినటులు మొదటి యుగమునందును ఆర్యవిజ్ఞానము తమిళవాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడినది. ఆర్యవిజ్ఞానప్రాబల్య మాంధ్రద్రావిడవాఙ్మయవికాసములకుఁ దోడ్పడినను నుభయవాఙ్మయములును భిన్నమార్గములను వికసించినవి. ఆంధ్రులు సంస్కృతాక్షరామ్నాయమును, సంస్కృత విజ్ఞానమును స్వీకరించిరి. తమిళులు వట్టెళుత్తు అక్షరామ్నాయమును జిరకాలము వాడుచుండిరి. గ్రంథాక్షరములు కాలాంతర

మున 'వట్టెఱుత్తు' అక్షరామ్నాయము నాక్రమించినవి. సంస్కృత విజ్ఞానము నారంభమునుండియును తమిళులు సంశయభావముతోఁ బరిగ్రహించుచుండిరి. ద్రవిడవాఙ్మయప్రాబల్య మాంధ్రవాఙ్మయము మీఁద గోచరము గాకుండుట కిదియే కారణమై యుండును. ఆంధ్రులార్య విజ్ఞానమున కొసఁగిన స్వాగతము ద్రావిడవిజ్ఞానమున కొసఁగి యుండలేదు. తెలుఁగు తమిళభాషలకుఁ గల సామాన్యబాంధవ్యము నిలిచియున్నను తమిళవాఙ్మయప్రాబల్య మాంధ్రభాషయందు విశేషముగఁ గనుపడదు. వర్తమానకాలమునందును ఆంధ్రవాఙ్మయము మీఁద దూరస్థమైన వంగీయవాఙ్మయమునకుఁగల ప్రాబల్యము సమీపస్థమైన ద్రవిడ వాఙ్మయమునకు లేదు. శైవ వైష్ణవ మతములు వ్యాపించినకాలమునందుఁ దమిళవాఙ్మయప్రాబల్య మాంధ్రవాఙ్మయమునకుఁ గొంతగలిగినది. నాయనారుల చరితములును, నాళ్వారుల వాఙ్మయమును నీవిషయమును విశదము చేయుచున్నవి.

దేశము-వాఙ్మయము

దేశస్థితి శిల్పాభ్యుదయమునకుఁ బరమ ప్రయోజనకరముగ నుండఁగలదు. దేశసౌందర్యము, దేశసౌభాగ్యము, దేశవైశాల్యము, దేశసంపదలు శిల్పవాఙ్మయకళావికాసమున కనుకూలపరిస్థితులను సమకూర్పఁగలవు. గౌతమీ కృష్ణవేణీ తుంగభద్రాది పావన ప్రవంతులు, శ్రీగిరి భద్రగిరి సింహాద్రి శేషాద్రి వేదాద్రి మొదలగు పుణ్యగిరులు, సాగర సంగమములు, జలధారలు, ప్రకృతివైభవ భాసమానములైన వనారామములు ప్రజాహృదయములను భక్త్యుత్సాహసమన్వితములను జేయుట కుపకరించినవి. దేశపరిమితియందు భిన్నకాలములందు హెచ్చుతగ్గు లేర్పడినను కేంద్రస్థాన మాదికాలమునుండియు ఆంధ్రసీమనైు యాంధ్రవ్యక్తిత్వమును గాపాడుచున్నది. ఆంధ్రరాజుల కాలమునందుఁ బడుమటి కనుమలనుండి తూర్పుతీరము వఱకును కృష్ణాగోదావరుల నడుమ నాంధ్రావని వ్యాపించినది. శ్రీకృష్ణదేవరాయలకాలమునందుఁ గటకమునుండి మధుర

వఱకును ఆంధ్రరాజ్యము వ్యాపించినది. రాజ్యవ్యాపనముతో భాషావాఙ్మయముల వ్యాపనమును నేర్పడినది. బ్రిటీషుయుగమునం దాంధ్రావని భిన్నరాష్ట్రములందుఁ జీలికలై సహజబలమును గోల్పోయినను ఆంధ్రాభ్యుదయ మవిచ్ఛిన్నముగ జరుగుచున్నది. రాష్ట్రభేదము లున్నను మాతృభాషాభిమానమును, వాఙ్మయాభిరుచియును సకలప్రదేశములందును నభివృద్ధిని బొందుచున్నది. మహారాష్ట్రదేశస్థము లైన బొంబయి, నాగపురములందును, తమిళదేశస్థములైన దక్షిణస్థానములందును, నిజాము రాష్ట్రాంతర్గతమైన యాంధ్రభాగమునందును, బర్మాయందును ఆంధ్రభాషాభిమానము వర్ధిలుచున్నది.

ప్రజలు-వాఙ్మయము

వాఙ్మయవికాసమునకుఁ బ్రజాభ్యుదయములు సుక్షేత్రములు. ప్రజల వృద్ధిక్షయములందు వాఙ్మయముల వృద్ధిక్షయములు ప్రతిబింబించుచుండును. ప్రజల విజయములు, ప్రజాభివృద్ధి, ప్రజావ్యాపనము వాఙ్మయాభివృద్ధికిని, ప్రజాక్షయము, ప్రజాదౌర్బల్యము వాఙ్మయస్తంభనమునకును గారణము లగుచుండును. ప్రజల విజయములు, సాహసపరాక్రమములు, మతావేశములు, శిల్పకళాకౌశలములు, విద్యావివేకములు, విజ్ఞానసంపదలు, వ్యవసాయపరిశ్రమల వికాసము, ప్రశాంతవాతావరణము వాఙ్మయవ్యాపనమున కనుకూలముగ నుండఁగలవు. పరరాజాక్రమణములు, మతకలహములు, దేశసంక్షోభము, నిస్సహాయస్థితి, అజ్ఞానావరణము, నిర్వ్యాపారత్వము వాఙ్మయవికాసమునకుఁ బ్రతికూలములుగ నుండఁగలవు. ఆంధ్రదేశచరిత్రమును నితరదేశచరిత్రములవలె నీ విషయమును సువ్యక్తము చేయుచున్నది. ఆదిని బ్రాహ్మణమతమును, అనంతరము బౌద్ధజైనమతములును, తదనంతరము బ్రాహ్మణ శైవ వైష్ణవ మతములును, పిమ్మట మహమ్మదీయ క్రైస్తవమతములును వాఙ్మయమున కుత్తేజనావనమనములను గలుగఁజేసినవి. మతములవలె రాజవంశములును వాఙ్మయాభ్యుదయమునకుఁ దోడ్పడినవి. చాళుక్యరాజుల కాలమునందుఁ బల్లవించిన యాంధ్రభాషావాఙ్మయములు చోళ కాకతీయ రెడ్డి

విజయనగర రాజుల కాలమునందుఁ బుష్పించి ఫలించినవి. ఆ రాజ్యముల నిర్గమన మాంధ్రవాఙ్మయవికాసమును స్తంభింపఁజేసినది. ఆంగ్ల విద్యాభ్యాసము, క్రైస్తవమతము వాఙ్మయమునకు నవీనవికాసము నొసఁగుచున్నను నాంధ్రసంస్కారము క్షీణించుచున్నది. వాఙ్మయ వికాసమునకు సర్వతోముఖమైన ప్రజాహృదయ వికాసమే మూలాధారమని వాఙ్మయచరిత్రము విశదము చేయుచున్నది. వాఙ్మయాభివృద్ధికిఁ బ్రజాభివృద్ధి, విద్యాభివృద్ధి నిదర్శనములుగ నుండఁగలవు

ఆంధ్రమండలములం దాంధ్రభాష మిశ్రమము లేక వ్యాపించి యున్నది. విశాఖపట్టణము, గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు మండలములందు ౧౦౦-కి ౯౦ మంది తెలుఁగుభాషను మాటలాడుచున్నారు. పశ్చిమాంధ్రమండలములైన కడప, కర్నూలు, అనంతపురము జిల్లాలయందును, బనగానపల్లియందును ౧౦౦-కి ౮౦ మందికిఁ దెలుఁగుభాష మాతృభాష. ఈ మండలములందుఁ దమిళుల సంఖ్య స్వల్పముగ నున్నది. అఱవమండలములందు సేలము, కోయంబత్తూరు, మధుర, తిరుచినాపల్లి, రామనాథము, ఉత్తరఆర్కాడు, చెంగల్పట్టు, తిరునల్వేలి మండలములం దాంధ్రభాషకు వ్యాపకము గలదు. చెన్నరాష్ట్రమునకు రాజధానియై ఆంధ్రదేశమునకు దూరస్థముగనున్న మద్రాసునందును ఆంధ్రమునకు వ్యాపక మతిశయిల్లుచున్న విధమును జనాభాలెక్కలు తెల్లముచేయుచున్నవి.

నిజాము రాష్ట్రము-ఆంధ్రులు

ఆదికాలమునుండియును నిజామురాష్ట్రప్రాంత మాంధ్రభాషకు నిలయము. కాకతీయప్రభువుల కాలమునం దోరుగల్లు తెలుఁగు భాషకు ముఖ్యస్థానముగ నుండెడిది. ప్రతాపరుద్రుఁడు, విద్యానాథుఁడు, పండితారాధ్యుఁడు, శివదేవయ్య సుప్రసిద్ధులైన భాషాపోషకులు; పండితులు. పాల్కురికి సోమనాథుఁడు, పోతనామాత్యుఁడు కాకతీయరాజ్యవాసులు. నిజామురాష్ట్రమునం దాంధ్రభాషాభిమానము, వాఙ్మయాభిమానము వ్యాప్తిని గాంచుచున్న విధమును గ్రంథాలయములు, గ్రంథప్రచురణములు, పత్రికలు

విశదముచేయుచున్నవి. ఆంధ్రప్రజ లధికముగఁగల నిజామురాష్ట్రము నందు ఉస్మానియావిశ్వవిద్యాలయము వలె ఆంధ్రవిశ్వ విద్యాలయ మును గూడ స్థాపించుట ఆంధ్ర భాషాభివృద్ధికిని, వాఙ్మయాభి వృద్ధికిని, విద్యాభివృద్ధికిని, విజ్ఞాన వ్యాపనమునకును నవసరము.

ఆంధ్రుల ప్రాభవము

ఆంధ్రుల ప్రాభవము భరతఖండమునందు జిరకాలమునుండి యు ప్రతిష్ఠను గలిగియున్నది. ఒక కాలమునం దాంధ్రులు మగధ రాజ్యసింహాసనము నధిష్ఠించి పాటలీపుత్రమునుండి కాంచీపురము వఱకును, నాసికనుండి శ్రీకాకుళమువఱకును బాలించిరి. విజయ నగరరాజులు కటకమునుండి మధురవఱకును బాలించిరి. ఆంధ్రులు జావా, బర్మా మొదలగు విదేశములందును నివాసముల నేర్పఱచు కొని వృద్ధిని బొందుచున్నారు. వర్తమాన కాలమున భరతఖండ మునందు వివిధ ప్రాంతములందును ఆంధ్రులు గలరు.

భరతఖండమునందు భిన్నభాషలను మాటలాడెడివారి సం ఖ్యయం దాంధ్రులు మూఁడవ స్థానము నలంకరించుచున్నారు.

ప్రాచీనసభ్యత్వము, దేశవైశాల్యము, ప్రజా బాహుళ్యమును నాంధ్రవ్యక్తిత్వమును బరిస్ఫుటము చేయుచున్నను కేంద్రస్థాన మును, ప్రజల సంయోగమును, ప్రభుత్వావలంబనమును, వ్యాపార సౌకర్యములును, ధనసమృద్ధియును, సహజావకాశములును గలుగక దేశవికాసము, భాషావికాసమును యథావిధిగ సంభవము గాకు న్నవి. ఆంధ్రోద్యమముతో నారంభమైన మహాసంచలనము ఫలో న్ముఖ మగుచున్నది.

ఆంధ్రభాష - వాఙ్మయము

భగవద్దత్తములైన సృష్టివిశేషములందు మానవుని యౌన్న త్యమునకు భాష మూలాధారముగ నున్నది. భాషా మూలమున విజ్ఞానసంరక్షణము, విజ్ఞానవ్యాపనము మానవులకు సాధ్యముగ నున్నది. చిరకాలముక్రితము మహర్షిప్రోక్తమైన విజ్ఞానము సంస్కృత

భాషామూలమున మనుజులకు లభ్యమై బ్రహ్మానందమును గలుగఁ జేయుచున్నది. వివిధభాషలందు సంచితమైన విజ్ఞానము మానవ జాతికి లభ్యమై ప్రకృతియందు పరమార్థతత్త్వము నుపదేశించు చున్నది. పశుపక్షిమృగాదు లవ్యక్తధ్వనులను గుర్తించినను సువ్యక్త శబ్దములు భాషారూపమున మనుజులకుమాత్రము గ్రాహ్యము లగుచున్నవి. అవ్యక్తమున కాదిమ వ్యక్తస్వరూపము శబ్దము. నాద బిందుకళాస్వరూపమైన ఓంకార మవ్యక్తమును సూక్ష్మరూపమున వ్యక్తము చేయుచున్నది. ఓంకారము అక్షరామ్నాయమునకును, అక్షరామ్నాయము పదములకును, పదములు పదార్థములకును మూలాధారములు. ప్రజల సంస్కారమున కనురూపముగ అక్షరామ్నాయమును, పదములును, భాషామ్నాయమును నేర్పడి మానవాభ్యుదయము గలుగుచున్నది.

అక్షరామ్నాయమునందు వివిధభాషలకు భేదము గలదు. ఆంగ్లభాషకు ౨౬ అక్షరములు. అఱవమునకు ౩౧ అక్షరములు. ఉర్దూభాషకు ౩౨ అక్షరములు. సంస్కృతభాషకు ౫౦ వర్ణములు. ఆంధ్రభాషకు ౩౬ వర్ణములైనను వాడుకయందు ౫౨ వర్ణములు గలవు. పరిమితములైన వర్ణములుగలభాష కధికమైన ధ్వనులను దెలుపుటయందు ద్విరుక్తి పునరుక్త్యాది దోషములు గలుగుచున్నవి. ఆంధ్రభాషయందలి అక్షరామ్నాయమున కట్టిలోపములు లేవు. ప్రత్యేక ధ్వనిని దెలుపుటకుఁ బ్రత్యేకాక్షరములు గలవు. కొన్నిధ్వనులను దెలుపుట కక్షరములు లేకపోయినను నవి స్వల్పములు. సంస్కృతభాషాసంయోగ మాంధ్రభాష కిట్టి యమూల్యమైన ప్రయోజనమును సమకూర్చినది. అక్షరామ్నాయమునకు వలె శబ్దామ్నాయమునకును సంస్కృత మమూల్యప్రయోజనము నాంధ్రభాషకుఁ గలుగఁజేసినది.

సంస్కృతభాషాపదము లనంతము లాంధ్రభాషయందుఁ దత్సమ తద్భవరూపములఁ బ్రవేశమును గాంచినవి. సంస్కృతపద

జాల మాంధ్రభాషకు బలవీర్యముల నొసఁగినది. ఆంధ్రభాషయందలి సంస్కృత పదజాలము నిరసనామోదములకుఁ గారణమైనది. సంస్కృతపదజాల మాంధ్రభాషకు సంస్కృతస్వరూపము నాపాదించినది. సంస్కృత సంస్కారము సహజమైన యాంధ్రభాషా వికాసమున కాటంకముగఁ బరిణమించినను సంస్కృతభాషాసాహచర్య మాంధ్రాభ్యుదయమునకు మహోపకార మొనర్చినది. ప్రజలకు, భాషకు, వాఙ్మయమునకు సంస్కృతము పరమోపకారము నొడగూర్చినది. భారత జాతీయసంయోగమున కిట్టి సంస్కృతసంస్కారము సకలవిధములను వినియోగపడుచున్నది. ఉత్తరదక్షిణదేశముల సంయోగ సాహచర్యములకు సంస్కృతము వినియోగపడుచున్నది. ఆంధ్రభాషకు సంస్కృతసంస్కారము గలిగినను భాషాహృదయ మాంధ్రస్వరూపమును సంరక్షించుచు నాంధ్రభాషా వ్యక్తిత్వమును విశదము చేయుచున్నది.

ప్రాకృతభాషల సాహచర్య మాంధ్రభాష కనిర్వచనీయమైన మాధుర్యమును గలుగఁజేసినది. ఆంధ్రభాషకు 'దేశభాషలందుఁ దెనుఁగు లెస్స' యను ప్రతీతి గలిగినది. ప్రాచ్యభాషలందుఁ దెలుఁగు బాస మాధుర్యమునకుఁ బేరొందినది. ఆంధ్రభాషయందు తమిళ భాషాధ్వనులకుఁ గల పారుష్యమును, సంస్కృతభాషాధ్వనులకుఁ గల కాఠిన్యమును బోయి సరళధ్వను లేర్పడినవి. తత్సమపదములందు వర్ణలోప వర్ణాగమ వర్ణవ్యత్యయములు గలిగి పరుషధ్వనులు సరళధ్వనులుగ మాఱి యాంధ్రభాషకు సహజ మాధుర్య మలవడినది. 'యజ్ఞము-జన్నము, లక్ష్మి-లచ్చి, ఠావు-తావు, ముఖము-మోము, అగ్ని - అగ్గి, మృగము - మెకము, భాష - బాస' మొదలగు పదములు తెలుఁగుబాసయొక్క సరళస్వరూపమును విశదము చేయుచున్నవి. వ్యాకరణవేత్తలు ఆంధ్రభాష వికృతి యనుట కిట్టి తత్సమరూపములు గారణములైయుండును. ఆంధ్రమునందుఁ దత్సమతద్భవపదము లసంఖ్యాకములు చేరినను మూలప్రకృతి దేశ్యమై వెలయుచున్నది. తద్భవతత్సమపదములు దేశ్యభాషా

సంస్కారమును బొంది ఆంధ్రభాషార్ణవమునందు సంగమించినవి. ఆంధ్రభాషకు పరిపాటియైన తత్సమతద్భవపదములకు సమానాదరణమును జూపుట భావ్యముగాని ప్రత్యేక భాషాపదములకు మాత్రము పక్షపాతమును బూనుట ప్రయోజనకరము గాదు.

భాషకు ప్రయోజనము భావప్రకాశనముగాని శబ్దనిర్ణయము గాదు. ప్రజలకు సులభగ్రాహ్యమైన భాషను వాడుటయే విజ్ఞాన వ్యాపనమునకు సాధనము. సులభగ్రాహ్యములైన పదములు తత్సమములైనను దేశ్యములైనను నన్యభాషాపదములైనను సమానాదరణమును బొందఁదగియున్నవి. ఆంధ్రభాషా సాహచర్య మన్యభాషా పదములకును నాంధ్రసంస్కారమును గల్పించి యాంధ్రభాషాస్వరూపము నొడగూర్చుచున్నది. ప్రాచీనకాలమునందు సంస్కృతభాషాభిమానమును, వర్తమానకాలమునం దాంగ్లభాషాభిమానమును నాంధ్ర భాషాభ్యుదయమునకుఁ బ్రతిబంధకములుగ నేర్పడినవి. సంస్కృతాంగ్ల భాష లాంధ్రభాషాభివృద్ధికిఁ గొంత ప్రతిబంధకములైనను నాంధ్ర భాషా వికాసమునకుఁ దోడ్పడినవి. వర్తమానకాలమునందుఁ బ్రజాహృదయమునందు వర్ధిలుచున్న గాఢమైన మాతృభాషాభిమాన మాంధ్రభాషాభ్యుదయమునకు శుభసూచకముగ నున్నది.

ఆంధ్రభాష కొక విశిష్టలక్షణము గలదు. ఆ విశిష్టలక్షణ మాంధ్రభాషకు దేశభాషలందుఁ బ్రతిష్ఠను గడించినది. ఆంధ్రభాష అజంతభాష. ప్రతిపదమును అచ్చుతో నంతము నొందుచున్నది. సంస్కృతాంగ్ల తమిళభాషలందు హలంతపదములుగూడ గలవు. ఈ భాషలు హలంతములు. హలంతపదముల నుచ్చరించుటయందుఁ గల శ్రమ యజంతపదముల నుచ్చరించుటయందుఁ గలుగదు. అచ్చులు ప్రాణములు; హల్లులు ప్రాణులు. అచ్చు లన్యభాషాపదములకుఁ బ్రాణము నొసఁగి వాని నాంధ్రభాషయందుఁ గలుపుచున్నవి. స్వరాంతమైన ఆంధ్రభాష యుచ్చరించుటకు సుకరమై, సుశ్రావ్యమై, సరళమై, ప్రాణయుతమై వెలయుచున్నది. అన్యభాషా

పదము లజంతసంస్కారమును బొంది సులభముగ నాంధ్రభాషాస్వరూపమును దాల్చుచున్నవి. ఆంధ్రభాష సంస్కృత ప్రాకృత ద్రవిడ భాషల సహవాసమును గలిగియున్నను అన్యభాషాపదములకు స్వజాతీయసంస్కారమును గల్పించి స్వరాంతమై, శ్రావ్యమై, స్వయంవ్యక్తిత్వమును గలిగి వాఙ్మయనిర్మాణావసరముల కనురూపముగ వర్ధిల్లి యపారమైన వాఙ్మయస్వరూపములను దాల్చి యాంధ్రాభ్యుదయమునకుఁ దోడ్పడుచున్నది. ఆంగ్లభాషయందు లాటిను, గ్రీకు, ఫ్రెంచిపదము లనేకములు చేరినవి. పారసీక సంస్కృతాద్యన్యభాషాపదములును జేరి యాంగ్లభాషా మహత్త్వమునకుఁ దోడ్పడినవి. అన్యభాషల సంయోగ మాంగ్లభాషాతత్త్వమునకును, మహత్త్వమునకును భంగమును గలుగఁజేయలేదు. ఆంధ్ర భాషకును సంస్కృత ప్రాకృత తమిళ కర్ణాటాంగ్లాదిభాషల సాహచర్యము భాషాతత్త్వమునకు భంగమును గలుగఁజేయక మహత్త్వమును గల్పించినది. ఆంధ్రభాష మాధుర్యమును, గాంభీర్యమును, చైతన్యమును గలిగి బహువిధములైన వాఙ్మయరచనలకు సాధనమైన విధమును వాఙ్మయపరిశీలనము విశదము చేయుచున్నది.

ఆంధ్రవాఙ్మయము

ఆంధ్రవాఙ్మయనిర్మాణమునకు దేశము, భాష, ప్రజలు, పరిసరములు దోడ్పడినవిధము సంక్షేపముగ దెలుపఁబడినది. ఆంధ్ర వాఙ్మయచరిత్ర, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రభాషాచరిత్ర విషయాన్వేషణమును జేయుటకు సాధనములుగనున్నవి.

ఆంధ్రవాఙ్మయము కాలమునుబట్టి ౧. అజ్ఞాతయుగము, ౨. ఆదియుగము, ౩. మధ్యయుగము, ౪. ఆధునికయుగము అని నాలుగు విభాగములుగ నేర్పఱుపఁబడుచున్నది. నన్నయకుఁ బూర్వమునందలి వాఙ్మయ మజ్ఞాతయుగమునకుఁ జెందియున్నది. అజ్ఞాతయుగ వాఙ్మయమును దెలుపుటకుఁ గొన్ని శాసనములు మాత్రము గనుపడుచున్నవి. ఈ యుగ మాంధ్రరాజుల కాలమునుండి ౧౦౫౦ వఱకును

వ్యాపించియున్నది. ఆదికాలమునం దాంధ్రపండితులు గ్రంథములను సంస్కృతభాషయందు రచియించిరి. ప్రభువులకును, పండితులకును ప్రజల భాషమీఁద నన్నయకాలమునందుఁ గలిగిన యాదరణ మాకాలమునందుఁ గలుగలేదు. ప్రభువులును, బండితులును నార్యులు; ఆర్యవిజ్ఞాన సంపన్నులు. వారికి దేశభాషలు దూష్యములు, సారరహితములు నైన పరభాషలు. ప్రజలు విద్యాసంపదలులేని పరాధీనులు. ఆంధ్రపండితులు వారి గ్రంథములను వారి కభిమానముగల సంస్కృతప్రాకృతభాషలందు రచియించిరి.

ఆంధ్రులు రచియించిన కొన్ని సంస్కృత ప్రాకృతగ్రంథములు

ప్రాకృతకవులు :

సాతవాహనుని సభలో పలువురు కవులుండిరి. వారి ప్రాకృత రచనములనుండి యుద్ధృతములైన గాథ లతని సప్తశతిలోనున్నవి.

సంస్కృతకవులు-గ్రంథములు :

సిద్ధనాగార్జునుఁడు—బౌద్ధ, తర్క, నీతి వైద్యగ్రంథములనేకములు.

భవభూతి—ఉత్తరరామచరితాదులు

కుమారిలభట్టు—పూర్వమీమాంసా గ్రంథములు

మల్లికార్జున పండితారాధ్యుఁడు—శైవస్తోత్రములు

అగస్త్యుఁడు—బాలభారతాదు లగు డెబ్బదినాల్గు గ్రంథములు

శాకల్యమల్లకవి—ఉదారరాఘవము

విద్యానాథుఁడు—ప్రతాపరుద్రీయాదులు

పాల్కురికి సోమన—సోమనాథభాష్యాదులు

నరసింహకవి—కాదంబరీనాటకము

గంగాధరకవి—భారతనాటకము

చౌండపాచార్యుఁడు—శ్రౌతభాష్యము

కపర్ది—శ్రౌతభాష్యము

అమృతానందయోగి—అలంకారశాస్త్రము

కవిరాక్షసుఁడు—కవిరాక్షసీయము

కవిభల్లటుఁడు—భల్లటశతకము

చెన్నుభట్టు—చెన్నుభట్టీయము (తర్కశాస్త్రము)

పశుపతినాగనాథుఁడు—మదనవిలాసభాణము

సింగభూపతి—రసార్ణవసుధాకరము

విశ్వేశ్వరకవి—చమత్కారచంద్రిక

మల్లినాథుఁడు (కొలచెలమ)—కావ్యనాటకవ్యాఖ్యానాదులు

కుమారస్వామి సోమపీథి (మల్లినాథుని కొడుకు)—ప్రతాపరుద్రీయవ్యాఖ్య

గౌరన—లక్షణదీపిక

పెదకోమటి వేమారెడ్డి—సాహిత్య,సంగీతచింతామణ్యాదులు

వామనభట్టబాణుఁడు—వేమభూపాలచరితము

కాటయవేముఁడు—శాకుంతలాదులకు వ్యాఖ్యలు

భాస్కరుఁడు—ఉన్మత్తరాఘవనాటకము

ఓరుగంటి సీతారామకవి—సీతారామ విహారకావ్యము

అనంతకవి—భారతచంపు

లొల్లవారు, లక్ష్మీధరుఁడు మొదలయినవారు — సరస్వతీవిలాసాదులు

హరిహరకవి—రతిరహస్యము

అన్నంభట్టు—తర్కసంగ్రహాదులు

బండారు లక్ష్మీనారాయణకవి—సంగీత సూర్యోదయము

చెఱుకూరివారు, లక్ష్మణసూరి, కొండుభట్టు మొదలయినవారు—షడ్భాషాచంద్రికాదులు

కంచం ఎల్లయార్యుఁడు—దైవజ్ఞవిలాసాదులు (జ్యోతిషము)
లింగమగుంట రామకవి—భాణము
వారణాశి ధర్మాభట్టు—సాహిత్యరత్నాకరము
నరసమంత్రి—అభినవభారతము
లక్ష్మణకవి—చంపూరామాయణము
అహోబలకవి—సంగీతపారిజాతము
కృష్ణాధ్వరి—రఘునాథ భూపాలీయాదులు
శేషవంశమువారు, కృష్ణకవ్యాదులు — పారిజాతాపహరణ కావ్యాదులు
శ్రీధర వేంకటేశార్యుఁడు—ఆఖ్యాసప్తిప్రబంధము
నారాయణతీర్థులు—కృష్ణలీలాతరంగిణి
తంజావూరి రఘునాథరాయలు—సంగీతసుధ మొదలయినవి
మధురవాణి—రామాయణము
జగన్నాథ పండితరాయలు—రసగంగాధరాదులు
రామామాత్యుఁడు—స్వరమేళకళానిధి
వెలిదిండ్ల అయ్యన్నశాస్త్రి—వ్యాసతాత్పర్యనిర్ణయము
రామభద్రాంబ—రఘునాథభూపాలీయము
తిరుమలాంబ—వరదాంబికాపరిణయము
ఆణివిళ్ల వేంకటశాస్త్రి—వేంకటాద్రి గుణరత్నావళి మొదలగునవి
సుసర్ల బ్రహ్మన్నశాస్త్రి—స్తోత్రకదంబము
నడిమింటి మంగళేశ్వరశాస్త్రి—సమాసకుసుమావళ్యాదులు
పట్టాభిరామపండితుఁడు—పట్టాభిరామపండితీయము
శిష్టు కృష్ణమూర్తిశాస్త్రి—యక్షోల్లాసాదులు
పరవస్తు రంగాచార్యులు—మంజుళనైషధాదులు

ఈ గ్రంథము లాంధ్రుల ప్రతిభకు నిదర్శనములైనను సంస్కృతప్రాకృతవాఙ్మయములకు సంబంధించినవి. ఆంధ్రవాఙ్మయ విమర్శనమునందు వాని విచారణ నిరుపయోగము.

వర్తమానకాలమున నాంగ్ల పరిపాలనమునం దీవిషయము మనకు నిత్యానుభవమునందుఁ గలదు. ఆంగ్లేయులకు వారి భాషావాఙ్మయముల పట్లఁగల యభిమానము పూర్ణవికాసమునుబొందిన సంస్కృతభాషావాఙ్మయముల మీఁదఁగాని, దేశభాషలమీఁదఁగాని లేదు. విద్యా ప్రవృత్తియందును, నిత్యవ్యవహారములయందును పాలకుల భాషకుఁగల యాదరణము పాలితుల భాషలకు లేదు. మహానుభావుఁడు మెకాలే ప్రభువు భారత విద్యాప్రవృత్తియందు భారతీయ భాషలకు ప్రతిషేధమును గల్పించి తిలోదకములను జల్లెను. ఆ నిర్ణయము దేశభాషావాఙ్మయముల వికాసమునకును, ప్రజలయందు విజ్ఞానవ్యాపనమునకును మహోపకారమును గావించినది. ఆకాలమునందు మన పండితుల నావహించిన సంస్కృతభాషాభిమాన స్వభావము నిపుడు మన యాంగ్లవిద్యావంతుల నావహించిన పరభాషాభిమానము సంస్మరింపఁ జేయఁగలదు. పిల్లలను - పెద్దలను, స్త్రీలను-పురుషులను, పండితులను-పామరులను పరభాషావ్యామోహ మావహించుటచేత మాతృభాషాభిమాన మడుగంటినది. ఆంగ్లాక్షరములతో డొక్కశుద్ధియైనఁగాని పవిత్రత గలుగకున్నది. ప్రభుత్వమునకును, విద్యావంతులకును నపరిచితమైన విజాతీయసంస్కారముపట్లఁగల గౌరవాభిమానములు సుపరిచితమైన స్వజాతీయ సంస్కారమునెడఁ గలుగకున్నవి. ఇది యిరువదవశతాబ్దమునందలి నాగరకాగ్రణుల కథ. అజ్ఞాతమైన శాలివాహనశకారంభకథను వితర్కించుట యనవసరము. ఆ కాలమునందు దేశభాషలు బీజరూపమున నున్నవి; ఈ కాలమున దేశభాషలు వికసించియున్నవి. ఆ కాలమునందు జనసామాన్యమునకుఁ దేజోబలములు లేవు; ఈ కాలమునందు జనసామాన్యమునకుఁ దేజోబలములుగలవు. ఆకాలమునందు భాషా వాఙ్మయ వికాసములకుఁ గల యవకాశము లతి స్వల్పములు; ఈ కాలము

సందు భాషావాఙ్మయములకుఁ గల యవకాశము లనేకములు. ఇట్టి పరిస్థితులందు సంస్కృతప్రాకృత భాషావాఙ్మయములు ప్రబలుటయును, దేశభాషావాఙ్మయములు ప్రబలకుండుటయును సహజము. ఆదియుగమున జైన బౌద్ధమతములు దేశభాషలందు వాఙ్మయాభ్యుదయమునకు సాధనభూతములైనవి.

బుద్ధభగవానునకుఁ బ్రజోద్ధరణముపట్లఁ గల గాఢానుతాపమునకు గాంధిమహాత్ముఁడు ప్రత్యక్షప్రమాణముగ నున్నాఁడు. బుద్ధభగవానుఁడు సంసారమును బరిత్యజించి, సన్న్యాసమును స్వీకరించి ప్రేమాస్త్రమును సాధించి ప్రజోద్ధరణమునకుఁ బూనుకొనెను. ప్రజలకు వారికిఁ బరిచితమైన భాషలందు ధర్మోపదేశములను జేయుట కుపక్రమించెను. బౌద్ధభిక్షువులును, జైనశ్రమణులును జిరకాలము ప్రజలకు ధర్మోపదేశములను జేయుటకై పాటుపడినవిధమును బౌద్ధజైన మతచరిత్రములు విశదము చేయుచున్నవి. ఆంధ్రదేశమున కీయుపకృతి సహజముగ దక్షిణాపథమునందలి దేశములలో మొదటఁ గలిగినది. బీజరూపముననున్న యాంధ్రభాషకు బౌద్ధజైన యుగములందే వాఙ్మయాంకురము లేర్పడినవి.

వర్తమానయుగమునందుఁ గ్రైస్తవమతబోధకు లవలంబించుచున్న మార్గము ప్రత్యక్షానుభవమును గలుగఁజేయుచున్నది. క్రైస్తవమత ప్రచారకులైన స్త్రీలును, పురుషులును తెలిసి తెలియని దేశభాషలందుఁ జేయుచున్న మతబోధలు మనకు నిత్యానుభవమునందుఁ గలవు. క్రైస్తవుల బోధలు సామాన్య ప్రజలయందు విజ్ఞానాంకురములను నాటుచున్న విధమును క్రైస్తవమతవ్యాపనము విశదము చేయుచున్నది. క్రైస్తవమత వ్యాపనము క్రైస్తవమతవాఙ్మయమునకుఁ గారణమైనది. ఆంధ్రవాఙ్మయమునం దిపుడు వందలకొలఁది క్రైస్తవమతగ్రంథములును, మతబోధకులు రచియించిన యితర గ్రంథములును గలవు. ఈ గ్రంథ జాల మాంధ్రవాఙ్మయాభ్యుదయమునకు విశేషోపకారమును జేయకపోయినను త్యాగమూర్తులైన మతాచార్యులు భాషావాఙ్మయములకును, దన్మూలమున ప్రజల

కును జేయఁగల మహోపకారము విశదమగుచున్నది. ఆరణ్యక జాతులం దీకాలమునఁ గ్రైస్తవ మతబోధకులు చేయుచున్న ప్రబోధ మాకాలమునందు బౌద్ధజైనమతబోధకులు గలుగఁజేసిన ప్రబోధ మున కనురూపముగనున్నది. భిన్నసంస్కారముగల క్రైస్తవ మత బోధలు దేశీయసంస్కారముతో నైక్యమును బొందఁజాలకున్నవి. ప్రాచీనభారత సంస్కారజన్యములైన జైనబౌద్ధధర్మబోధలు ప్రత్యేక రూపమును దాల్చినను దేశీయ సంస్కారముతో నైక్యమును బొందు టచే విజ్ఞానసంవర్ధనమునకు సంస్కారపారంపర్యము సాధ్యమయినది. అజ్ఞాతయుగమునందలి ఆంధ్రవాఙ్మయస్వరూపము లగోచరములైనను ఆర్యజైనబౌద్ధమతబోధకులు నాటిన వాఙ్మయాంకురములు తరువాతి వాఙ్మయమున కాధారభూతములైనవని విశ్వసింపఁదగి యున్నది.

ఆ కాలపు శాసనములు సంస్కృత ప్రాకృతభాషలందుఁ గలవు. తెలుఁగు శాసనములు కొన్ని క్రీ. శ. ౭౦౦-౧౦౦౦ కాలము నందుఁ గనుపడుచున్నవి.) ఈ శాసనములు కొన్ని మాత్రాగణ బద్ధములైన మధ్యాక్కరలందున్నటులు పండితులు నిర్ణయించు చున్నారు. ఈ కాలపుశాసనముల సమగ్ర పరిశోధనము విషయ నిర్ణయమునకుఁ దోడ్పడఁగలదు.

ఆదియుగము నన్నయకాలమునుండి తిక్కనాదుల కాలము వఱకు వ్యాపించి యున్నది. ఈయుగము క్రీ. శ. ౧౦౫౦-౧౪౫౦ ప్రాంతమువఱకును గలదు. ఈ యుగము పురాణయుగము. భారత రామాయణ భాగవతాది గ్రంథము లీ యుగమునం దాంధ్రీకరింపఁ బడినవి. తిక్కన, పాల్కురికి సోమనాథుఁడు, ఎఱ్ఱాప్రెగడ, మంత్రి భాస్కరుఁడు, నన్నిచోడఁడు, నాచనసోముఁడు, శ్రీనాథుఁడు, పోతరాజు మొదలగు మహాకవులు పురాణాదుల నాంధ్రీకరించినను నాంధ్రవాఙ్మయమునకు జీవకళల నుపపాదించి వ్యక్తిత్వమును గల్పించిరి.

మధ్యయుగము కృష్ణదేవరాయలకాలమునుండి కాకునూరి అప్పకవికాలమువఱకుఁ గలదు. ఈ యుగము క్రీ. శ. ౧౫౦౦-౧౮౫౦ ప్రాంతమువఱకు వ్యాపించినది. ఈ యుగము ప్రబంధ యుగము. ఈ యుగమునం దాంధ్రకవులు స్వతంత్ర కావ్యములను రచించి ఆంధ్రవాఙ్మయమునకుఁ గళాన్యాసముచేసి ప్రతిష్ఠను జేసిరి. పెద్దన్న, శ్రీ కృష్ణదేవరాయలు, రామరాజభూషణుఁడు, ముక్కు తిమ్మన్న, పింగళి సూరన్న, చేమకూర వెంకటకవి మొదలగు కవి శేఖరు లసదృశవైభవముతోఁ బ్రబంధయుగమును నిర్మించిరి. ఆంధ్ర వాఙ్మయయుగములం దీయుగ ముత్తమయుగముగ నెన్నఁబడు చున్నది. విజయనగరసామ్రాజ్య విధ్వంసనము, మహమ్మదీయరాజ్య ముల స్థాపనము వాఙ్మయవికాసమునకు భంగమును గలుగఁజేసినవి. కవులు పోషణము లేక కృశించిరి. కావ్యములు రసజ్ఞులు లేక రసహీ నములైనవి. స్వతంత్రరచనలతో నారంభమైన ప్రబంధయుగము నిర్జీవయుగమై యనుకరణయుగముగఁ బరిణమించినది.

ఆధునికయుగ మాంగ్లవిద్యా వ్యాపనముతో నారంభించినది. విద్యావ్యాపనము, నీసాక్షరములు, ముద్రాశాలలు, ప్రజాదరణము వర్తమానయుగమునందు వాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడుచున్నవి. ఈ యుగము క్రీ. శ. ౧౮౫౦ తరువాత నారంభమైనది. ఇది మిశ్ర యుగము. బహువిషయకవాఙ్మయరచన లీ యుగమందుఁ బుట్టినవి. ఆధునికయుగమునందు వాఙ్నిర్మాతలలో (కీ. శే.) రావుబహాదరు శ్రీ వీరేశలింగము పంతులుగారు సుప్రసిద్ధులు. ఆంధ్రవాఙ్మయ యుగ మునం దాధునికయుగము వచనయుగము. వీరేశలింగము పంతులు గారు వచనరచనకు జనకులు. ఆధునికయుగమునందు నాటకములు, నవలలు, శాస్త్రములు, చరిత్రములు, విమర్శనలు, భావగీతములు, పాటలు, పదములు వాఙ్మయమును సారవంతము చేయుచున్నవి.

వాఙ్మయమునందు యుగవిభాగము విషయగ్రహణమునకు సాధనమైనను గాలపరిమితియందు ముందువెనుకలు గలుగుచుం డును. పురాణయుగమునందుఁ బ్రబంధయుగారంభములు గోచరించు

చుండును. ప్రబంధయుగమునందును, వర్తమానయుగమునందును బురాణ ప్రబంధరచనలు గనుపడుచుండును. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు భారతమును, (కీ. శే.) వావిలికొలను సుబ్బారావుగారు రామాయణమును, జనమంచి శేషాద్రిశర్మగారు బ్రహ్మాండపురాణమును, రామాయణమును నాంధ్రీకరించిరి. ప్రబంధకావ్యములు వర్తమానకాలమునందును బుట్టుచునేయున్నవి. విషయ విభాగమును, గాలనిర్ణయమును యుగసామాన్యలక్షణమును గనుఁగొనుటకు మాత్రము సాధనములుగ నుండఁగలవు.

వాఙ్మయపరిణామమును భావవికాసము ననుసరించి పరిశీలించుట వాఙ్మయహృదయమును గ్రహించుటకు సాధనమగును. భారత విజ్ఞానమంతయు మానవలక్ష్యము నాధ్యాత్మికసంపదయందు లగ్నముచేసినది. ఆదిమ గ్రంథమైన వేదమునం దీలక్ష్యమే సర్వత్ర ప్రత్యక్షమగుచున్నది. ప్రకృతిసంపదలు సమకూర్చిన యానంద సౌఖ్యములకు భూతాధిదేవత లభివాదనములను బడయుచున్నారు. వేదయుగమునం దారంభమైన యాధ్యాత్మిక ప్రవృత్తియే ఉపనిషత్తులందును, దర్శనములందును, పురాణములందును, స్మృతులందును, కావ్యములందును, శాస్త్రములందును, స్తోత్రములందును బ్రత్యక్షమగుచున్నది. ఆర్యులు వారి వాఙ్మయ రచనలను దైవప్రార్థనలతో నారంభించుచుండిరి. ఆర్యవిజ్ఞానసంజాతమైన జైనబౌద్ధవిజ్ఞానములును మానవలక్ష్యము నైహికమునందే కాక యాముష్మికమునందును లగ్నముచేయుట కుపచరించినవి. శంకరవిజయము జైనబౌద్ధయుగమునందు సంకలితమైన యాధ్యాత్మిక ధర్మమునకు సర్వవ్యాపకత్వమును గలుగఁజేసినది. ఆంధ్రవిజ్ఞానలక్ష్యమును నాధ్యాత్మికపరముగఁ బరిణతి నొందినది. ఆంధ్రహృదయము పరమార్థమునందు లగ్నమైన విధమును హిందూబౌద్ధజైన శిల్పములు విశదము చేయుచున్నవి. అమరావతి, సాంచి, కార్లి మున్నగు స్తూపములందలి శిల్పనైపుణ్యములు, అజంతా ఎల్లోరా విహారములందలి చిత్రవైభవములు శిల్పమునం దాంధ్రహృదయలక్ష్యమును సువ్యక్తము చేయుచున్నవి. రాజ

రాజ నరేంద్రుఁడు భారతము నాంధ్రీకరించుటకుఁ దెలిపిన కారణము లును- బరమార్థలక్ష్యమును విశదము చేయుచున్నవి.

మ. ఇవి యేనుఁ బ్రతతంబు నాయెడఁ గరం బిష్టంబులై యుండుఁ బా
యవు భూదేవకులాభితర్పణమహీయఃప్రీతియుఁ భారత
శ్రవణాసక్తియుఁ బార్వతీపతిపదాబ్జ ధ్యానపూజా మహో
త్సవముఁ సంతతదానశీలతయు శశ్వత్సాధుసాంగత్యమున్.

చంద్రవంశజుఁడైన రాజరాజు భారతమునకుఁ గృతిపతి. బ్రహ్మజ్ఞుఁడైన నన్నయభట్టు కృతికర్త. ఆర్యవిజ్ఞానాభిమాన ముభయులకును గాఢము. తిక్కన భారతమునం దాధ్యాత్మిక విజ్ఞానమును గురిపించి యాంధ్రహృదయస్వరూపమును బ్రత్యక్షముచేసెను. పోతనామాత్యుఁడు భాగవతమునందు భక్తిరసమును గురిపించి జ్ఞానయోగమునకు, భక్తియోగమునకు నిరుపమానమైన సంయోగమును గలుగఁజేసెను. శంకర, రామానుజ, మధ్వాచార్యుల భాష్యములు, పండితారాధ్య బసవేశ్వరాదుల మతసంస్కరణములు ప్రజాహృదమునం దాధ్యాత్మికలక్ష్యమును నెలకొల్పినవి. ప్రబంధరాజమైన పెద్దన మనుచరిత్రమునందు శ్రోత్రియబ్రాహ్మణుఁడు నాయకుఁడు. ఆంధ్రదేశవ్యాప్తములైన పాటలు, పద్యములు, శతకములు భక్తిజ్ఞానవైరాగ్యసమ్మిళితమైన యాంధ్రహృదయమును విశదము చేయుచున్నవి. వర్తమానయుగమునందుఁ దెలుఁగు దేశమున బ్రహ్మసమాజార్యసమాజదివ్యజ్ఞాన సమాజముల వ్యాపనమును నాంధ్రుల భక్తిహృదయమును విశదము చేయుచున్నది.

పురాణ యుగమునందు వర్ధిల్లిన భక్తిహృదయము ప్రబంధయుగమునందు శృంగార హృదయముగఁ బరిణమించినది. విజయనగరరాజుల విజయములు, సామ్రాజ్య సంపదలు, యోధుల సాహసపరాక్రమములు, ప్రభువుల భోగపరాయణత్వము, ప్రజల విషయవాంఛలు, కవుల రాజసప్రవృత్తి శృంగారరసవికాసమును గలుగఁజేసినవి. పెద్దన మనుచరిత్రయందు సూచించిన శృంగారవిలాసములు కాలక్రమమునఁ దారాశశాంకవిజయాదులందు శృంగార వికార

మును బొందిది వాఙ్మయలక్ష్యము కామ పరాయణమైనది. కవు లస్వతంత్రులై రాజాశ్రయజీవులై స్వీయప్రతిభను గోల్పోయిరి. శ్రీనాథుఁడు ధనార్జనమునకై కావ్యవిక్రయమును జేసినవిధము నాతని కావ్యములు తెలుపుచున్నవి. ఆ మహాకవిస్థితియే యిటులుండ సామాన్యకవులవిషయమై యోచింపవలసిన పనిలేదు. ధూర్జటికవి కాళహస్తీశ్వరశతకమునందును, రామభద్రుఁడు రఘువీరశతకమునందును, తిమ్మకవి కుక్కుటేశ్వరశతకమునందును, అడిదము సూరకవి రామలింగేశ శతకమునందును రాజాశ్రయవిషయమునఁ దెలిపిన భావములు సార్థకములు. కాళహస్తీశ్వరశతకమునందలి "రాజాధమశ్రేణీద్వారము", "రాజుల్ మత్తులు వారిసేవ నరకప్రాయంబు", "భూభృచ్చండాలురు", "లోకకంటకులు" మొదలగు ప్రయోగములు రాజాశ్రయనిరసనమును దెలుపుచున్నవి. రఘువీరశతకమునందలి "అడిగే విద్యకు లోనుజేసితివి నన్నావంతయావంతలే కడియాసల్ గొనుచుం దురాత్మకుల నే నర్థించుచున్నాఁడ"నను ప్రయోగములును రాజాశ్రయనిరసనమును దెలుపుచున్నవి. భాగవతకృతియందుఁ బోతనామాత్యుఁడు కృతిసమర్పణమువిషయమై వ్రాసిన

ఉ. కాటుకకంటి నీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాఁదిలికోడల! యోమదంబ! యో
హాటకగర్భురాణి! నిను నాఁకటికిం గొనిపోయి యల్ల క
ర్ణాటకిరాటకీచకుల కమ్మఁ ద్రిశుద్ధిగ నమ్ము భారతీ!

అను పద్యార్థము సార్థకమైనది. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి మహానుభావుఁడు; రాజ్యచ్యుతుఁడైన మనుమసిద్ధికి రాజ్యమును గడించిన మహాధీరుఁడు. ఆ మహానుభావుఁడు సర్వస్వతంత్రుఁడై భారతమును రచియించి యా కృతిని హరిహరనాథునకు సమర్పించిన ధర్మజ్ఞుఁడు. పోతన భాగవతోత్తముఁడు; భాగవతమును శ్రీరామార్పణముచేసిన భక్తాగ్రేసరుఁడును. పెద్దన రాజాశ్రయముగలిగినను ధర్మజ్ఞుఁడై స్వాతంత్ర్యమార్గము నవలంబింపఁ గలిగెను. కాలక్రమమున రసజ్ఞులైన రాజు లంతరించిరి.

స్వతంత్రులైన కవులు నిరాశ్రయులై కృశించిరి. నిర్జీవమైన యనుకరణము కావ్యరచనకు లక్ష్యమై ఆంధ్రవాఙ్మయము భావార్థశూన్యమై కృశించినది. ద్వ్యర్థి, త్ర్యర్థి, గర్భకవిత్వాదికావ్యములు, శబ్దాలంకారములు కావ్యములప్రయోజనమును సంకుచితముచేసినవి.

ఆధునికయుగవాఙ్మయమునందు నవభావోదయము గలుగుచున్నది. ఆంగ్లవిద్యావ్యాపనము, పాశ్చాత్య సంస్కారము వాఙ్మయమునకు సంచలనమును గలుగఁజేసినవి. ఆంగ్లవిద్యావంతులు గ్రంథరచనలకుఁ బూనుకొనిరి. వారి రచనలం దాంగ్ల వాఙ్మయానుకరణములు, నూతన నిర్మాణములు గోచరమగుచున్నవి. నాటకములు, నవలలు, కథలు, భావగీతములు, విమర్శనగ్రంథములు, శాస్త్రగ్రంథములు వర్తమానయుగనిర్మాణములు. ఆంగ్లవిద్యాలయములం దాంగ్లసాహిత్యాభ్యాసమునకుఁగల యవకాశము లాంధ్రసాహిత్యాభ్యాసమునకు లేవు. నిత్యజీవనమునం దాంధ్రసాహిత్యమునకుఁ బోషణములేదు. పండితకులము క్షీణించుచున్నది. ఆంగ్లసంస్కారము వర్ధిల్లినది. మాతృభాషాపరిచయములేని గ్రంథకర్తల రచన లాంధ్రవాఙ్మయమునందు నూతన యుగనిర్మాణమునకుఁ దోడ్పడుచున్నవి. ఈరచనల భావములు, భాష, రీతులు క్రొత్త మార్గము నవలంబించుచున్నవి. వాడుకభాషకు, లోకవ్యవహారమునకుఁ బ్రాబల్యము గలుగుచున్నది. ఈ ప్రాబల్యము సార్థకమగుటకు మాతృభాషాముఖమున విద్యాభ్యాస మవసరమగుచున్నది. మత వేదాంత గ్రంథము లాంధ్రహృదయమునకు సహజమైన యాధ్యాత్మికసంస్కారమును దెలుపుచున్నవి. వర్తమాన యుగమునందుఁ బ్రజలు వాఙ్మయపోషకులు. ప్రజలయందు విజ్ఞాన వ్యాపనమునకు సాధనమైన వాఙ్మయ మవసరమగుచున్నది. గ్రంథకర్త లాంధ్రహృదయమునకు సహజమైన యాధ్యాత్మిక లక్ష్యమును వారిరచనలందుఁ బోషించి యాంధ్రవాఙ్మయ హృదయమును గాపాడుట ధర్మము.

ఆంధ్రహృదయమునకు శ్రీరాముఁడు కులదేవత. ఆంధ్రవాఙ్మయమునందు రామాయణగాథకు సంబంధించిన గ్రంథము లనేక

ములుగలవు. వాఙ్మయమునందు శ్రీరామవాఙ్మయము విశేషము గలదు. రామకీర్తనలు, రామశతకములు వాఙ్మయమునందు వ్యాప్తిని గాంచియున్నవి. రామభజనలు, రామాలయములు భక్తహృదయము శ్రీరామపరమని విశదము చేయుచున్నవి. ఆంధ్రవాఙ్మయ నిర్మాణములందుఁ గృతికర్తల భావములు మాఱుచున్నను ప్రజాహృదయమునందు భక్తిజ్ఞాన వైరాగ్యములు సుప్రతిష్ఠితములైయున్న విధమును శ్రీరామోత్సవములు, రామకీర్తనలు, రామభజనలు, రామాలయములు చాటుచున్నవి.

భావవ్యాప్తి ననుసరించి వాఙ్మయమునందు నాలుగుయుగములను గ్రహించుట కవకాశములు గలవు: ౧. జ్ఞానయుగము, ౨. భక్తియుగము, ౩. శృంగారయుగము, ౪. సంకరయుగము. ఈ విభాగములు సామాన్య లక్షణములను గ్రహించుట కుపయోగపడఁ గలవు; కాని, విశిష్టలక్షణములను గ్రహించుట కుపయోగపడవు.

వాఙ్మయములు పద్యకావ్యములతో నారంభమగుట ప్రకృతి స్వభావము. మానవులకు వారి యానందమును, మహోత్సవమును నృత్యగానములతోఁ దెలుపుట సహజము. పాటలతోను, కీర్తనలతోను నారంభమైన వాఙ్మయ మితివృత్తరూపములను దాల్చుచు వీర సంకీర్తనమును జేయుట కుపయోగపడుచున్నది. ఇలియడు, ఏయినియడు, రామాయణము, భారతము వీరసంకీర్తనమును జేయుచు జాతీయజీవనాభ్యుదయమునకు వినియోగపడినవి. ఆంధ్ర వాఙ్మయము నందలి వీరచరితములును నీమార్గము నవలంబించినవి. ఆదియుగము నందలి వాఙ్మయము గేయములైన మధ్యాక్కర, రగడ, గీత, ద్విపద, పాటల రూపమును దాల్చినది. సోమనాథుఁడు పేర్కొన్న భ్రమరగేయాదులు మాత్రాగణబద్ధములు. కాలక్రమమున వాని నుండి అక్షరగణబద్ధములైన రచనలు వెలువడి మాత్రాగణ బద్ధములగు రచనలను వెనుకకుఁ ద్రోక్కినవి. కాల క్రమమున సంస్కృత వృత్తములు చేరి దేశీయవృత్తముల వ్యాప్తి కభ్యంతరమును గలుగఁ

జేసినవి. దేశీయవృత్తస్వరూపమునే సంస్కృత ప్రాబల్యము మాటు పఱచినది. ఆర్యవిజ్ఞానమునకు మూలాధారములైన వేదములు లోకోత్తరమార్గము నవలంబించినవి. వేదములందు వీరసంకీర్తన సూచనలున్నను దైవసంకీర్తన లక్ష్యము ప్రబలియున్నది. ఆ లక్ష్యమే సంస్కృతాంధ్ర వాఙ్మయములం దవిచ్ఛిన్నముగఁ బరిణతి నొందినది. ఆంధ్రవాఙ్మయము నీలక్ష్యముతోఁ బరిశీలించినపుడు వాఙ్మయ హృదయము గ్రాహ్యము గాఁగలదు. సకల వాఙ్మయములందును బద్యకావ్యానంతరము గద్యకావ్యములు పుట్టుచున్నవి. ఆంధ్రవాఙ్మయమునందుఁ జిరకాలము పద్యయుగము ప్రబలినది. నేఁటికిని దేట తెలుఁగున గద్యములందుఁ బ్రజాహితమునకై వ్రాయఁదగిన విషయములు పద్యములందు వ్రాయుట యాచారముగ నున్నది. ఆంధ్రుల సంభావనా ప్రవృత్తియు, నాంధ్రభాషా వైభవము నిందులకుఁ గారణములై యుండును. ఆంధ్రవాఙ్మయమున నవ యుగమునందు గద్యకావ్యము లనంతములు పుట్టుచున్నవి. ప్రజలయందు విజ్ఞాన వ్యాపనమునకు సర్వతోముఖమైన వచనవాఙ్మయ నిర్మాణము, వ్యాపనమును నత్యంతావసరములుగ నున్నవి.

ఆంధ్రవాఙ్మయమునం దనేకగ్రంథములు నశించినవి. గ్రంథములు నశించుటకు మతకలహములు, మతాభిమానము, ప్రజల యజ్ఞానము, రాజ్యవిప్లవములు కారణములై యుండును. వేంగీపురము, రాజమహేంద్రవరము, ఓరుగల్లు, విజయనగరము మొదలగు పట్టణములకు సంప్రాప్తమైన విప్లవములం దెన్నియో గ్రంథములు నశించియుండును. పల్లెటూళ్ళయందుఁ బండితులు భద్రపఱచిన గ్రంథములు వారి వంశజుల హస్తములందు శిథిలములైనవి. బ్రాహ్మణశైవ వైష్ణవమతాభిమానము బౌద్ధజైనగ్రంథముల విలయమునకుఁ దోడ్పడినది. ప్రబంధరత్నావళియందును,లక్షణగ్రంథములందును, చాటుపద్య మణిమంజరియందును బేర్కొనఁబడిన గ్రంథములనేకము లిపు డలభ్యముగ నున్నవి. నశించిన గ్రంథసముదాయమును నిర్ణయించుటకు సాధనములు గనఁబడవు. నన్నయకుఁ బూర్వమును, నన్నయానంతర

మును గల వాఙ్మయము కొంతవఱకు నశించినదని స్పష్టముగఁ దేలుచున్నది. ఆ గ్రంథముల నాశన మాంధ్రవాఙ్మయమున కపారమైన నష్టమును గలుగఁజేసినది. శేషించిన గ్రంథములనైనను జక్కని యక్కరములతోఁ దాటాకులమీఁద వ్రాసి గ్రంథములను రక్షించిన లేఖకులు ప్రశంసార్హులు. ఈ గ్రంథసముదాయమును విశేషవ్యయ ప్రయాసముల కోర్చి సేకరించి సురక్షితము గావించిన బ్రౌనుదొరగా రాంధ్రప్రపంచముయొక్క కృతజ్ఞతకుఁ బాత్రులు.

ఆంధ్రగ్రంథముల ముద్రణము సీసాక్షర నిర్మాణముతో నారంభమైనది. మొదట మిషనరీలు వారి బైబిలు ప్రచారమునకై సీసాక్షర నిర్మాణమునకును, గ్రంథముద్రణమునకును బూనుకొనిరి. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వమునందు అక్షరామ్నాయమునం దీవిషయమును కొ. వెం. లక్ష్మణరావుగారు వ్యక్తముచేసిరి. ఆంధ్ర గ్రంథముల ముద్రణ మారంభమై నూటేండ్లయినవి. క్రీ. శ. ౧౮౨౭-వ సంవత్సరమున 'శబ్దమంజరి' యను సంస్కృతబాలబోధ వ్యావహారి కాంధ్రవివరణముతోఁ జెన్నపురియం దప్పుడుండిన కాలేజీ ముద్రాలయమున ముద్రిత మయినది. ఆ పుస్తకమునందలి ముఖపత్ర * మీ విషయమును దెలుపుచున్నది. ఇంతకన్నఁ బూర్వము ముద్రితములైన యాంధ్రగ్రంథము లిప్పుడు లభించుటలేదు. తరువాత, పరవస్తు చిన్నయ సూరిగారు నీతిచంద్రికను, బాలవ్యాకరణమును క్రీ.శ.౧౮౬౦ యందు ముద్రించిరి. క్రైస్తుజీవితమును టి. బి. సొసైటీ క్రీ. శ. ౧౮౭౩ నందు ముద్రించినది. ఆంధ్రగ్రంథముల ముద్రణమునకుఁ బ్రథమమునఁ దోడ్పడినవారిలోఁ బరవస్తు రంగాచార్యులుగారు, బహుజనపల్లి సీతారామాచార్యులుగారు మొదలయినవారు పేర్కొనఁదగియున్నారు. ఇప్పుడు దేశమునందంతటను ముద్రాశాలలు వెలసినవి. గ్రంథముద్రణము సుకరమయినది. ఆంధ్రదేశమునం దనేకగ్రంథమండలులు ప్రాచీన నవీన గ్రంథములను ముద్రించి వాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడుచున్నవి. విజ్ఞాన చంద్రికాగ్రంథమండలి నారంభించి లక్ష్మణరావుపంతులుగా

* ఆ ముఖపత్రచిత్రము ప్రక్కపుటలో ముద్రితమైయున్నది.

కాశీసి శైవ క్షేత్రమైన మహారాజరాజశ్రీ

వైంకటగిరి · హోకీ వెన్ను దొరగారి సముఖమునకు

కాశీపట్నములో కార్యదర్శి - సంస్కృత ప్రధానపండితులైన అహోబలాచార్యులున్ను - యోగ్యతాపత్రికను పొందిన - ముద్దురామశాస్త్రులున్ను - భీమసేనాచార్యులున్ను - ఆంధ్ర - ప్రధానపండితులైన - గురుమూర్తి శాస్త్రులున్ను - వ్రాసియిచ్చిన దేమంటే.

తమరు - అబద్ధములు లేకుండా శోధించుమని మావద్ద యిచ్చిన - శబ్దమంజరి యొక్క ప్రథమ ద్వితీయ భాగములయిన - అక్షరగుచ్ఛము సంధి వృంతము - ఈ రెంటినిన్ని - మేము నల్గురమున్ను - బాగా శోధించితిమి - ఇందులో మాకు చూడగా అబద్ధములు లేవనిన్ని యిది బాలులకు చదువను ఉపయోగించుననిన్ని తోచుచున్నది ఈ ప్రకారముగా

౧౮౭౨ - సంవత్సరం ఆగష్టు నెల ౨౨ తేది

అహోబలాచార్యులు,
ముద్దురామశాస్త్రి.
భీమసేనాచార్యులు.
గురుమూర్తి శాస్త్రి

ఇతరులకు మార్గదర్శకులైరి. ఆంధ్రభాషయందు గ్రంథముద్రణమునకును, ప్రచురణమునకును ఇతర దేశభాషలయందువలె విశేషమైన వ్యాప్తి కనఁబడదు. శ్రీమంతుల సహాయమును, ప్రజల యాదరణమును గ్రంథప్రచురణమున కత్యంతావశ్యకములు. రాజులును, మహారాజులును, శ్రీమంతులును వాఙ్మయాభివృద్ధికి సహాయము

చేయుట ధర్మము. శ్రీమంతుల సహాయముకంటెను వర్తమాన యుగమునందు ప్రజాదరణము వాఙ్మయాభివృద్ధికి సాధనముగ నున్నది. గ్రంథకర్తలు ప్రజాపోషణములేక కృశించుచున్నారు. ప్రజాపోషణము వలన వాఙ్మయాభివృద్ధి కవకాశములు గలుగఁగలవు. పఠనీయ గ్రంథములను నిర్ణయించుటయందుఁ బ్రభుత్వమును, తాబేదారులును, నిర్ణయసంఘమును నవలంబించుచున్న మార్గము గర్హ్యముగ నున్నది. ఉత్తమ గ్రంథముల నాదరించుటకు బదులు పక్షపాతమును జూపుటయు, కారణాంతరములను గల్పించి పుస్తకములను నిరాకరించుటయు నన్యాయముగనున్నది. వర్తమాన యుగమునందుఁ గల ముద్రణసౌకర్యములు గ్రంథరచనలకు గ్రంథకర్తలను బురికొల్పుచున్నవి. గ్రంథకర్తలు జనాదరణమునకును, విజ్ఞానవ్యాపనమునకును సాధనములైన గ్రంథములను రచియించుట సంభావ్యము.

ఆంధ్రగ్రంథములందు భారత భాగవత రామాయణము లతివ్యాప్తిగల గ్రంథములుగ నున్నవి. భారత మెన్నియో ముద్రణములను బొంది లక్షలకొలఁది ప్రతులు గ్రామగ్రామమునందును వ్యాపించియున్నవి.

గ్రంథకర్తలు

శ్రీయుతులు గురజాడ శ్రీరామమూర్తి పంతులుగారు, రావుబహద్దరు వీరేశలింగము పంతులుగారు కవులచరిత్రములందుఁ బ్రఖ్యాత కవుల చరిత్రలను వ్రాసిరి. ప్రఖ్యాత కవులైన నన్నయ, తిక్కన, పోతన, శ్రీనాథుఁడు, సూరన్న మొదలగు మహాకవుల విషయమై పండితులు ప్రత్యేక గ్రంథములను వ్రాసిరి. ప్రఖ్యాత గ్రంథముల పీఠికలయందుఁ గావ్య-కవివిమర్శనలు చేయఁబడినవి. ఆవిషయములనే తిరిగి తెలుపుట పాఠకులకు ప్రయోజనకరము గాదు. కొన్ని విశేషాంశములు మాత్ర మిచటఁ బొందుపఱుపఁబడును.

ఆదియుగగ్రంథకర్తలు రచియించిన గ్రంథములు వర్తమాన యుగగ్రంథకర్తలు రచించిన గ్రంథములవలె బహుళములుగావు. నన్నయభట్టారకకృత గ్రంథము భారతము మాత్రము గలదు.

తిక్కన సోమయాజి విరచిత గ్రంథములు భారతము, నిర్వచనోత్తర రామాయణము మాత్రము గలవు. పోతనామాత్యకృతములు భాగవతము, భోగినీదండకము, వీరభద్రవిజయము గలవు. పెద్దన్న కొక మనుచరిత్రము శాశ్వతమైన కీర్తిని గడించినది. పింగళి సూరన్నకు రాఘవపాండవీయము, ప్రభావతీ ప్రద్యుమ్నము, కళాపూర్ణోదయము నఖండకీర్తిని గడించినవి. పాల్కుర్కి సోమనాథునకు ద్విపదకావ్యములైన బసవపురాణము, పండితారాధ్య చరిత్రము ప్రతిభను గడించినవి. నాచనసోముని సత్కీర్తికి ఉత్తర హరివంశము చాలినది. శ్రీనాథుఁడు శివరాత్రి మాహాత్మ్యము, శృంగార నైషధము, కాశీఖండము, పల్నాటి వీరచరిత్రము, భీమేశ్వర పురాణము, వీథినాటకము, హరవిలాసము నను గ్రంథములను రచియించెను. గ్రంథకర్తల ప్రతిభకును, గ్రంథ ప్రచారమునకును గ్రంథౌన్నత్యము సాధనముగాని గ్రంథసముదాయము సాధనము గాదు. గ్రంథకర్తలు రచియించెడి గ్రంథములు వారి మనోభావములను వ్యక్తముచేయుటకు వ్రాయఁబడుచుండును. ఆగ్రంథములు విజ్ఞాన వ్యాపనమునకుఁ బ్రజాదరణ మెంతవఱకుఁ బడయఁగలవో కాలము నిర్ణయించఁగలదు. గ్రంథమహత్త్వమునకుఁ జిరంజీవిత్వము ప్రమాణము. గ్రంథరచనలందు నూటి కొకదానికైనను మహత్వముగలదని నిర్ణయించుట సాధ్యముగాదు. యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకమును, కంచర్ల గోపన్న దాశరథీశతకమును వ్రాయునపుడు వ్రాసిన ప్రతిపద్యమును నదీప్రవాహములందుఁ బడవేసిరనియు, ఎదురీఁదివచ్చిన పద్యములను మాత్రము వారు గ్రహించిరనియు ఒక గాథకలదు. ఈగాథవలన గ్రంథరచనలందు గ్రంథకర్తల యున్నత లక్ష్యము తెల్లమగుచున్నది. భవభూతి మాలతీమాధవ రచనయందుఁ జెప్పిన భావము యథార్థమును దెలుపుచున్నది.

శ్లో. యేనామ కేచి దిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానంతి తే కిమపి తాన్ ప్రతి నైష యత్నః,
ఉత్పత్స్యతేఽస్తి మమ కోఽపి సమానధర్మా
కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ.

విశాలమైన విశ్వమునందు దేశకాల పాత్రల పరిస్థితుల ననుసరించి గ్రంథరచన లేర్పడుచున్నవి. ఆ గ్రంథములను జదువుటకుం బాఠకు లేర్పడుచునేయుందురు. సృష్టిరచనయందలి పదార్థములవలె వాఙ్మయ ప్రపంచమునందలి గ్రంథములును నేదో కొంత ప్రయోజనము నొడగూర్చుట నిశ్చయము. స్వల్ప ప్రయోజనములను సమకూర్చెడి గ్రంథములు చిరంజీవిత్వము లేక యంతరించుటయు, మహా ప్రయోజనము నొడగూర్చెడి గ్రంథములు చిరంజీవిత్వము కలిగి మనుటయుం బ్రకృతిధర్మము. లాక్షణికులు కావ్యముల కున్నత ఫలమును నిర్ణయించిరి.

కావ్యలక్ష్యము

"విశ్వః శ్రేయః కావ్యమ్"-విశ్వమునకు శ్రేయస్సు నొడగూర్చెడి గ్రంథములు మాత్రము కావ్యనామమున కర్హములై చిరంజీవితమునకుం దగియున్న వని లాక్షణికుల మతము. "వాక్యం రసాత్మకం కావ్యం" అను భావ మిపుడు వ్యాప్తిని బొందుచున్నది. సకల వాఙ్మయములందును జిరంజీవితముగల గ్రంథములు స్వల్పముగ నున్నవి. విశ్వముయొక్క శ్రేయస్సునకు సాధనములైన గ్రంథములు దేశకాలపాత్రానవచ్ఛిన్నములై లోకమునం దంతటను పూజ్యతను బడయుచున్నవి. కాళిదాసుని కావ్యములు దిగంతవ్యాప్తములై చిరంజీవులైయున్నవి. సంస్కృత కావ్యములవలె లేటిను, గ్రీకు భాషా కావ్యములును, ఆంగ్ల, ఫ్రెంచి, జర్మనీ, జపాను మొదలగు భాషల యందలి యుత్తమ కావ్యములును జిరంజీవులై ప్రజాదరణమును బడయుచున్నవి. ఆంధ్ర వాఙ్మయమునందును భారత భాగవత రామాయణములు, మనుచరిత్ర కళాపూర్ణోదయాది ప్రబంధములు, పురాణములు, శతకములు మొదలగు నితర గ్రంథములు చిరంజీవులై ప్రజాదరణమును గలిగియున్నవి. రసహృదయము, భావౌన్నత్యము, భాషామాధుర్యము కావ్యములను జిరంజీవులను జేయుచున్నవి. సుమతి వేమన భాస్కరాదిశతకములు చిన్నవయినను చిరంజీవులై ప్రజాదరణమును గలిగియున్నవి. పెద్ద గ్రంథములు పెక్కులు ప్రజా

దరణము లేక పేటికలయందు నిద్రించుచున్నవి. వర్తమానకాలమున విద్యావ్యాపనము, ముద్రణాదిసౌకర్యములు గ్రంథరచనను సుకరము చేసినవి. అనుదినము క్రొత్తగ్రంథము లెన్నియో పుట్టుచున్నవి. ఆ గ్రంథములం దెన్నియో ప్రజాదరణము లేక కృశించుచున్నవి.

పూర్వకాలమునందు రాజాదరణము వాఙ్మయాభివృద్ధికిఁ దోడ్పడిన విధమున వర్తమాన యుగమునందుఁ బ్రజాదరణము వాఙ్మయ వికాసమునకు సాధనముగ నున్నది. రావుబహద్దరు వీరేశలింగము పంతులుగారు రచించిన ౧౨౦ గ్రంథములు ప్రజాదరణమునకుఁ బాత్రములై వాఙ్మయవికాసమునకుఁ దోడ్పడినవి. ముద్రాక్షరశాలల పుణ్యమున వర్తమాన కాలమునందుఁ గృతికర్తలును, కృతిభర్తలును నగుట సులభసాధ్యమైనది. నిత్యమును వెలువడుచున్న గ్రంథము లీవిషయమును విశదము చేయుచున్నవి.

ఆంధ్రవాఙ్మయ వికాసమును యుగముల ననుసరించియు, ఛందస్సు ననుసరించియు, విషయవిభాగము ననుసరించియు, కావ్యవిభాగము ననుసరించియు నిర్ణయించుట కవకాశములుగలవు. కాని ఈ విభాగములు యుగభావ విభాగము వలె వాఙ్మయాభ్యుదయమును నిర్ణయించుటకుఁ బ్రయోజనకరములు గావు. భిన్నయుగములందు భావవికాసము, భాషావికాసమును ప్రజావికాసమునకును, దేశవికాసమునకును, ధర్మవికాసమునకును, రసోదయమునకును వినియోగపడిన విధమును వాఙ్మయములు విశదముచేయుచున్నవి. భిన్నయుగములం దాంధ్రాభ్యుదయము సంప్రాప్తమైన విధమును భావరూపమున ఆంధ్రవాఙ్మయము వ్యక్తముచేయు చున్నది. అవిచ్ఛిన్నముగ ౨౨౦౦ ఏండ్ల నుండియు చైతన్యము గలిగి వెలయుచున్న ఆంధ్ర సత్త్వస్వభావస్వరూపములను గనుఁగొనుట కాంధ్రవాఙ్మయము పరమసాధనముగనున్నది.

వాఙ్మయవికాసము

వాఙ్మయములు దేశకాలపాత్రల తత్త్వముల కనురూపముగఁ బ్రత్యేకభావలందుఁ బ్రత్యేక భావరూపములను భిన్నయుగములందు

వికసించుచున్నవి. సకల సాహిత్యములకును విశ్వకల్యాణము ప్రయో జనము. విశ్వకల్యాణలక్ష్యము వివిధవాఙ్మయములందును ప్రజా భాషాతత్త్వముల కనురూపముగ వివిధములైన భావరూపములను విశద మగుచున్నది. వీరలక్ష్యము, శృంగారలక్ష్యము, శాంతిలక్ష్యము, ధర్మ లక్ష్యము మున్నగు లక్ష్యములు వాఙ్మయములకు భిన్నములైన స్వరూప స్వభావములను గలుగఁజేయుచున్నవి. వీర శాంతి శృంగా రాదిలక్ష్యములును దేశకాలపాత్రావరణములందు నానావిధములైన వాఙ్మయములకు భిన్నరూపములను వ్యక్తిత్వమును గలుగఁ జేయుచు న్నవి. గ్రీకు, లేటిను వాఙ్మయములు సన్నిహితసాహచర్యమును గలిగియున్నను ప్రత్యేకలక్షణములను గలిగి వృద్ధిపొందినవి. గ్రీకు సాహిత్యమునకు రూప సౌందర్యమును, లేటిను సాహిత్యమునకు శాసనసంధానమును హృదయములుగ నున్నవి. గ్రీకులేటిను వాఙ్మ యములందలి కళాసౌందర్యము, శాసన సంధానము పాశ్చాత్య విజ్ఞా నమునందు భిన్నములైన భావరూపములందు గోచరమగుచున్నవి.

ఆంధ్ర గీర్వాణవాఙ్మయములకును, ఆంధ్రద్రావిడ వాఙ్మయ ములకును సన్నిహితమైన సాహచర్య సంబంధము లున్నను ఆంధ్ర వాఙ్మయము వ్యక్తిత్వము గలిగి వికసించినది. ఆంధ్ర భారతభాగ వతములును, ప్రబంధాదిరచనలును నిందులకు నిదర్శనములుగనున్నవి. ఆంధ్ర వాఙ్మయ వికాసమును బరిశీలించునపుడు సహజమైన తత్త్వా ధారమున విమర్శించుట ప్రయోజనకరముగాని యన్యవాఙ్మయ తత్త్వాధారమున విమర్శించుట ప్రయోజనకరముకాదు. వర్తమాన సమయమునందుఁ బాశ్చాత్యసంస్కార మితర సంస్కారములకువలె వాఙ్మయసంస్కారమునకును బ్రమాణముగ నాంగ్లవిద్యావంతులచేతఁ బరిగణింపఁబడుచున్నది. ఆంధ్ర వాఙ్మయతత్త్వమునకు భిన్నమైన ప్రమాణము ననుసరించి ఆ వాఙ్మయమును బరిశీలించుట వాఙ్మయ తత్త్వమును గ్రహించుటకుఁ బ్రయోజనకరము గాఁజాలదు.

సంస్కృత వాఙ్మయాధారముల ననుసరించి వికసించిన యాంధ్ర వాఙ్మయమును సంస్కృత లక్ష్యలక్షణప్రమాణముల ననుసరించి పరి

శీలించుట ప్రయోజనకరము. ఆంగ్లవాఙ్మయ ప్రమాణముల ననుస రించి విమర్శించుట విషయావగాహనమునకు సాధనముగాదు. సంస్కృత సాహిత్యమునకు లక్ష్య మాధ్యాత్మికము. ఆంగ్ల సాహిత్యమునకు లక్ష్య మాధిభౌతికము.విమర్శకులకు భారతీయ సాహిత్యలక్ష్యము భావమునందును, ఆంగ్లసాహిత్యలక్ష్యము రూపమునందును లగ్నమగుచున్నవి. ఆరూఢమైన భారతీయ సాహిత్యసంస్కారముగల పండితులు భారతీయ సాహిత్యములను విమర్శించుట కర్హులుగ నున్నారు. అట్టి యధికారులుగాని స్వదేశ విదేశ పండితుల విమర్శనలు భారతీయ సాహిత్య హృదయమును గ్రహించుటకు సాధనములు గాఁజాలవు. ఆంధ్రవాఙ్మయవికాస మీ లక్ష్యముతో నిందు సింహావలోకనము చేయఁబడును.

సంస్కృత వాఙ్మయమునందుఁ గావ్యమును వాఙ్మయమునకు హృదయముగ లాక్షణికులు పరిగణించిరి. కావ్యములు కాలాంతరమున భిన్నరూపములను దాల్చినను వాఙ్మయతత్త్వమును గ్రహించుటకుఁ గావ్యతత్త్వమును గ్రహించుట పరమసాధనముగ నున్నది. వాఙ్మయపరిణామమును భాష, భావము, రచన, రూపము, రసము విశదము చేయుచున్నవి. కావ్యములందును, నితర రచనలందును నీవిభాగములు వాఙ్మయపరిణామమునకు వినియోగపడిన విధమును వాఙ్మయపరిశీలనము తెలుపుచున్నది.

ఆంధ్రవాఙ్మయము భిన్న యుగములందు స్వజాతీయ విజాతీయ విజ్ఞానముల ప్రాబల్యముల కనురూపముగ వికసించిన విధమును వాఙ్మయ రచనలు విశదము చేయుచున్నవి. వేదములు, వేదాంగములు, పురాణేతిహాసములు నితర భారతీయవాఙ్మయములకు వలె ఆంధ్రవాఙ్మయమునకును మూలాధారములుగ నున్నవి.

ప్రాచ్య పండితులును, పాశ్చాత్యపండితులును కావ్యలక్ష్యమును, కావ్యప్రయోజనమును భిన్నమార్గముల నిర్ణయించుచున్నారు. వేదము లపౌరుషేయములు. వేదాంగములు—శిక్ష, కల్పము, వ్యాక

రణము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు వేదార్థనిర్ణయమున కేర్పడిన పౌరుషేయశాస్త్రములు. వైదికధర్మతత్త్వములను వేదాంగములద్వారా పురాణములు వ్యక్తముచేయుచున్నవి. వేదమంత్రములందుఁ గల గాథలు పురాణములందు విస్తృతములై దైవత్వము మానవత్వమునందును, అపౌరుషేయము పౌరుషేయమునందును ప్రత్యక్షముచేయుచున్నవి. వేదములం దాహూతులైన దేవతలకుఁ బురాణములును, ఉపపురాణములును నేర్పడినవి. ఋగ్వేదమునందు వర్ణింపఁబడిన వసిష్ఠవిశ్వామిత్రులు, వినతాకద్రువలు, అగ్నివరుణేంద్రాదులు, బ్రహ్మవిష్ణు రుద్రసోమాది దేవతలు పురాణములందు నూతన వికాసమును బొందినవిధమును బురాణగాథలు వెల్లడి చేయుచున్నవి.

సంస్కృత వాఙ్మయము

సంస్కృత వాఙ్మయము ప్రపంచ వాఙ్మయములం దతిప్రాచీనమైన వాఙ్మయము. లోకమాన్య బాలగంగాధర తిలకుగారు 'ఓరియను', 'ఆర్యుల ఉత్తరధ్రువవాసము' అను గ్రంథములందు వేదకాలమును ౮౦౦౦ ఏండ్లకుఁ బూర్వముగ నిర్ణయించిరి. జేకోబీ పండితుఁడును తిలకుగారి సిద్ధాంతముల నంగీకరించి ౬౦౦౦ఏండ్లకుఁ బూర్వముగ సిద్ధాంతీకరించెను. ఆర్థరు మెక్డోనలుగారు 3౫౦౦ సంవత్సరములుగ నిర్ధారణ చేసిరి. బైబిలు కాలప్రణాళికయందును, గ్రీకువాఙ్మయాధిక్యమునందును విశ్వాసముగల పాశ్చాత్య పండితులు వేదకాల నిర్ణయమునందు సంకుచితాభిప్రాయములను గలిగియుండుట సహజముగ నున్నది. ఈజిప్టు, అస్సిరియ, చాల్డియ, సింధు, గ్రీసు మొదలగు ప్రాచీనసామ్రాజ్యముల చరిత్రములు భారతీయవిజ్ఞానము యొక్క ప్రాచీనత్వమును విశదముచేయుచున్నవి. సింధులోయయందు బయల్వెడలిన మోహంజోదారో జీర్ణనగరములు ౫3౦౦ ఏండ్లకుఁ బూర్వము వర్ధిలినటులు సర్ జాన్ మార్షలుగారు నిర్ణయించుచున్నపుడు వేదయుగప్రాచీనత్వము స్థిరపడుచున్నది. వేద

కాలము ౧౦,౦౦౦ ఏండ్లనను, ౪,౦౦౦ ఏండ్లనను వైదిక విజ్ఞానము మానవధర్మవికాసమునందు నిరుపమానముగనున్నది. వైదికవిజ్ఞానము వేదాంతమును, బౌద్ధమతమును, శైవవైష్ణవభక్తిని లోకమునకుఁ బ్రసాదించినది.

పురుష ప్రకృతిసంయోగవిలసితమైన విశ్వమునందుఁ బురుష వికాసమును, ప్రకృతివికాసమును విశ్వకల్యాణమునకు సాధనములుగ నున్నవి. ప్రకృతిసౌందర్యము, ప్రకృతిగాంభీర్యము, ప్రకృతి వైచిత్ర్యము, ప్రకృతి బీభత్సము మానవుల సుఖదుఃఖములకుఁ గారణమగుచు జిజ్ఞాసకు సాధనమగుచున్నవి. మానవజిజ్ఞాస వేదవేదాంత పురాణేతిహాస కావ్యనాటకశాస్త్రకళాదుల భావరూపముల వాఙ్మయ నిర్మాణమునకు సాధనమగుచున్నది. లోకమునందలి వివిధములైన వాఙ్మయముల పరిశీలన మీ తత్త్వార్థమును వెల్లడిచేయుచున్నది. భారతదేశ భాషావాఙ్మయములకు సంస్కృతవాఙ్మయమే మూలాధారముగ నున్నది. ప్రాచీనకాలమునందలి ప్రాకృత వాఙ్మయములకును, వర్తమానకాలమునందలి దేశభాషా వాఙ్మయములకును సంస్కృత వాఙ్మయమే మూలాధారముగనున్నది. సంస్కృతవాఙ్మయము దేశభాషా వాఙ్మయములకు మహోపకారమును జేసినటులు మహాపకారమును గూడఁ జేసినది.

చతుర్వేదములు క్రీస్తుశకమునకు ౫౦౦౦ ఏండ్లకుఁ బూర్వమే పూర్ణస్వరూపమును బొందినవి. వేదాంగములు—శిక్ష, కల్పము, ఛందస్సు, నిరుక్తము, వ్యాకరణము, జ్యోతిషము—క్రీస్తుశకమునకు ౧౦౦౦ ఏండ్లకుఁబూర్వమే రచింపఁబడినవి. పూర్వోత్తరమీమాంసలును నాకాలముననే ఏర్పడినవి. ధర్మ శాస్త్రములు క్రీస్తుశకమునకు ౮౦౦ ఏండ్లకుఁబూర్వమే రచింపఁబడినవి. భారతరామాయణములు క్రీ. శ. ౫౦౦ ఏండ్లకుఁ బూర్వమే రచింపఁబడినవి. అష్టాదశపురాణములు, కావ్యములు, నాటకములు, లక్షణగ్రంథములు క్రీ. శ. ౭౦౦ ఏండ్ల లోపలఁ బరిపూర్ణతను బొందినవి. అపారమైన

సంస్కృతవాఙ్మయము సారస్వతోపాసకులకు సిద్ధముగ నున్నను ప్రజాసామాన్యమునకు దురారాధ్య మైనది. చతుర్దశ విద్యలును బ్రాహ్మణాధీనమునం దుండినవి. బ్రాహ్మణేతరుల కీవిద్యలు నిషిద్ధములై దుర్లభములుగ నుండినవి. బ్రాహ్మణపోషకులైన క్షత్రియులకును నీవిద్యలు దుర్లభములై యుండెను. విశ్వామిత్రుఁడు బ్రహ్మర్షి యగుటకుఁ బడిన పాట్లు విద్యోపార్జనమునందు బ్రాహ్మణేతరప్రజలకుఁ గల ప్రతిబంధకములను విశదముచేయుచున్నవి.

వేదములు, వేదాంగములు కాలక్రమమున జ్ఞానప్రతిపాదకములైనను, అవి కేవలము కర్మప్రతిపాదకములై జనసామాన్యమునకు నిరుపయోగములుగ నుండెను. కర్మాధికారము లేని ప్రజాసామాన్యమునకుఁ గర్మకాండ యంతయు నయోమయముగ నుండెను. కర్మాధికారులైన బ్రాహ్మణులకును గర్మకాండ దురవగాహమై, దురారాధ్యమైనది. వైదికమతములందును, శ్రౌతమునందును శాఖాభేదము లేర్పడినవి. కర్మాధికారము గల క్షత్రియాదులకైనను బ్రాహ్మణసహాయము లేక కర్మానుష్ఠానము జేయుట కవకాశములు లేక వారియందుఁ బ్రతిఘటనము బయలుదేఱినది. కర్మవేత్తలైన బ్రాహ్మణులకును ననంతమైన కర్మకాండ మయోమయమై పురుషార్థమునకు నిరర్థకమైనది. నిరుక్త కాలముననే వేదచోదితమైన కర్మకాండ దుర్గమమైనది. వేదకాలాంతమునందుఁ గర్మకాండ దుస్తరమై జ్ఞానమార్గ మారంభమైనది. వేదాంతములైన ఉపనిషత్తులు జ్ఞానమార్గమును బ్రతిపాదించినవి. క్షత్రియులైన జనకాదులు రాజయోగులై, బ్రాహ్మణోత్తములైన శుకాదులకు వేదాంత తత్త్వోపదేశములను జేయుటకు సమర్థులైరి. వైదికకర్మాధికారులైన బ్రాహ్మణులకును, వైదికకర్మాధికారములేని బ్రాహ్మణేతరులకును వేదవేదాంగములు పురుషార్థసిద్ధికిని, జీవయాత్రను సుఖప్రదము చేయుటకును నిరుపయోగములైనవి. బ్రాహ్మణపండితులకుఁ బ్రజాహృదయమునందుఁ బ్రవర్ధమానమగుచున్న జ్ఞానతృష్ణ నుపశమింపఁజేయుట యనివార్యమైనది. ఈ మార్గ మవలంబించనియెడల రాజ్యములేని రాజు

వలె బ్రాహ్మణమతము నిరర్థకము కాఁగలదు. ధర్మపరాయణు లైన కొందఱు బ్రాహ్మణులును, రాజులును స్వధర్మనిర్వాహణము నకుఁ బూనుకొనిరి.

పండితులు ప్రజలను జ్ఞానవంతులను జేయుటకుఁ బురాణము లను గల్పించిరి. భారతరామాయణములు ప్రజలను జ్ఞానవంతులను జేయుటకు రచింపఁబడినవి. వేదవ్యాస విరచితములైన పురాణాది గాథలను సూతుఁడు శౌనకాది మహామునులకు వినుపించుచుం డెను. వైదిక పౌరాణికగాథలు కావ్యరూపములను దాల్చినవి. కావ్యరూపమునఁ బ్రజలకు జ్ఞానోపదేశమును జేయుటకు పండితులు ప్రయత్నించుచుండిరి. వేదములు, పురాణములు, శాస్త్రములు, కావ్యములు విజ్ఞానవ్యాపనమునకు విద్వాంసులకు వినియోగపడి నను బ్రజాసామాన్యమున కీవిజ్ఞానము దుర్లభముగనుండెను. వైదిక భాష, సూత్రభాష, పౌరాణికభాష, కావ్యభాష మహాపండితులకే దుర్గ్రాహ్యముగ నుండినపుడు సామాన్యులమాట విచారింప నవసరమే లేదు.

విజ్ఞానసంపాదనమునకును, విజ్ఞానవ్యాపనమునకును దీక్షను బూనిన మహర్షికులము క్షీణించినది. బ్రహ్మర్షులకు విజ్ఞానోపాసన దీక్ష నశించినది. బ్రహ్మర్షికులములు నామమాత్రావశిష్టములైనవి. ప్రజాహృదయమునందు విజ్ఞానతృష్ణ వర్ధిల్లినది. ప్రజల జ్ఞానతృష్ణను దీర్చుట కపారమైన సంస్కృతవాఙ్మయ మున్నను దానిని గ్రహిం చుటకుఁ బండితులకును, ప్రజలకును సాధ్యముగాకుండెను. బ్రాహ్మణ పండితులు వేదవేదాంగములను గోప్యముగ నుంచిరి. ఇవి గురు ముఖముననే యభ్యసింపఁదగినవి. వేదాధ్యయనము, వైదికకర్మలు బ్రాహ్మణులకు మాత్రమే సాధ్యములు. ఆరంభమునందుఁ జైతన్య ప్రదమైన వైదికకర్మకాండ సూత్రయుగమునాఁటికి నిశ్చేష్టతను వహించినది. పురుషార్థమునకు సాధనములైన వైదికకర్మలు ధర్మార్థకామములకు విముఖత్వమును బూనినవి. వేదాంతమునకు

సాధనములైన వైదికకర్మలు జడములైనవి. జిన బుద్ధాదులు కర్మకాండను ధర్మపరముచేసి ప్రజాహృదయమును చైతన్యోజ్జ్వలము చేయుటకు సమకట్టిరి.

జినుఁడు, బుద్ధుఁడు పండితపామరులకు దుర్గమమైన సంస్కృత భాషను విడిచి సుగమమైన వాడుకభాషయందు వారి ధర్మోపదేశములను జేయుట కుపక్రమించిరి. దేశభాషయందు వాఙ్మయనిర్మాణ మారంభమై సంస్కృతవాఙ్మయ విజ్ఞానము నవరూప భావముల సులభముగ ప్రజాహృదయము నావహించినది. పాలీభాషయందు ధమ్మపదము, బుద్ధజాతకములు మొదలగు గ్రంథములు విరచితములై, ప్రజాసామాన్యమునకు ధర్మపరిజ్ఞానము సుకరమైనది.

విక్రమార్క హర్షవర్ధన భోజరాజాదుల కాలమునందు సంస్కృతవాఙ్మయము పునరుద్ధృతమై ప్రాకృతవాఙ్మయమును గొంతవఱ కరికట్టినను జైనబౌద్ధ మతాచార్యు లవలంబించిన దేశభాషాదరణము వివిధ ప్రాంతములందును స్థిరపడినది. వివిధములైన దేశభాషలందుఁ బ్రజావికాసమునకు సాధనములైన దేశభాషా వాఙ్మయనిర్మాణము లారంభములైనవి. ప్రభువులు, పండితులు, పామరులు దేశభాషల పట్ల నాదరణమును బూని సంస్కృత విజ్ఞానమును దేశీయవాఙ్మయస్వరూపమునఁ బరివర్తనముచేయుట కుపక్రమించిరి. ఈ పరివర్తనమునందును వేదములు, వేదాంగములు దుర్గమములైన దుర్గములుగనే యుండెను. దేశభాషా వాఙ్మయము లన్నియు సామాన్యముగఁ బురాణేతిహాస కావ్యముల యనువాదములతో నారంభమైనవి. సంస్కృత వాఙ్మయము దేశభాషా వాఙ్మయములకు సిద్ధాన్నమును సమకూర్చి మహోపకారమును జేసినను వాని సహజవికాసమునకుఁ గొంత ప్రతిబంధకముగ నేర్పడినది. పండితులును, ప్రజలును సహజమై సచేతనమైన దేశీయభాషా సంప్రదాయములను, ప్రజావాంఛలను ననుసరించుటకు బదులు పురాతనమై, చిరకాలప్రతిష్ఠితమైన సంస్కృత

వాఙ్మయము ననుకరించుచు నిర్మాణకౌశలమునకు భంగమునుగలుగఁ జేసిరి. ప్రాకృతవాఙ్మయములందును, ద్రవిడవాఙ్మయములందును భాష, భావములు, ఛందస్సు, రచనలు తద్భవ తత్సమ ప్రాయములై ప్రబలినవి. సంస్కృతమునకును, దేశభాషలకును జిరకాలమునుండియుఁ గలుగుచున్న సంరంభమునందును, సంసర్గమునందును సంస్కృతభాషాప్రతిభయే దేశీయవాఙ్మయములం దెల్లెడలను గోచరమగుచున్నది. పండితులు సామాన్యముగ సంస్కృతభాషాప్రియులు; సంస్కృతవిజ్ఞానప్రియులు. సామాన్యప్రజలు సహజమైన దేశభాషాప్రియులు. ఇది ప్రకృతి ధర్మము; కాలప్రభావము. పండితులుగాని, ప్రజలుగాని నిందార్హులుగారు. భారతీయవిజ్ఞాన వాఙ్మయములందు సంస్కృత విజ్ఞాన వాఙ్మయముల ప్రతిభ భిన్న కాలములందు భిన్నరూపముల నెల్లపుడును వ్యక్తమగుచునే యున్నది. దేశభాషల వాఙ్మయవికాసమున కెన్ని యవాంతరములు, విఘ్నములు, విపత్తులు గలిగినవో దేవున కెఱుక! అయినను సజీవములైన దేశభాషావాఙ్మయములు స్వయంవ్యక్తిత్వమును గలిగి వర్ధిల్లుట ప్రకృతిధర్మము.

క్రీస్తు శకమునందలి ఏడెనిమిదిశతాబ్దములకు సంస్కృత వాఙ్మయమునందు నిర్మాణదక్షత క్షీణించినది. జైన బౌద్ధమత బోధకులు ౮౦౦ ఏండ్లు వారి బోధలను దేశభాషలందుఁ జేయుచు దేశీయ వాఙ్మయరచనలను జేయుటకుఁ దోడ్పడుచుండిరి. కుమారిలభట్టును, శ్రీశంకరాచార్యులును నేడెనిమిది శతాబ్దములందు జైనబౌద్ధమతములను శిథిలముచేసి వైదికమతమునకును, సంస్కృతసంస్కారమునకును దిరిగి యుత్తేజమును గలుగఁజేసిరి. వైదికమతప్రియులైన రాజులు శంకరదండయాత్రకుఁ దోడ్పడి పడిపోవుచున్న వైదికమత ధ్వజమును దిరిగి ప్రతిష్ఠించిరి. కాని ఈ యుత్తేజము వైదికమతసంరక్షణమునకుఁ గొంత వినియోగపడినను ప్రజాప్రయోజనములకు, వాఙ్మయప్రయోజనమునకును విశేషముగ వినియోగపడలేదు. సంకుచితమైన వైదికకర్మమార్గము పండితపామరులకు జీవయాత్రయందు

విముఖత్వమును గలుగఁజేసినది. దుర్గమమైన జైనబౌద్ధధర్మమార్గము పండితపామరులకు జీవయాత్రయందు విరక్తినిగలుగఁజేసినది. ప్రజలకు జీవయాత్రయందుఁ గలిగిన విముఖత్వమును బోఁగొట్టి యనురక్తిని గలుగఁజేసి పురుషార్థసిద్ధిని బడయుటకు భక్తిమార్గము ప్రముఖమైనది.

శ్రీశంకరాచార్యులు వైదికధర్మప్రతిష్ఠాపనము జేసినను వారి రచనలు భక్తిమార్గ ప్రభావమును సువ్యక్తము చేయుచున్నవి. వేదోక్తమైన కర్మమార్గము దురారాధ్యమై నిరర్థకమైనది. జైనబౌద్ధమత ప్రతిపాదితమైన ధర్మమార్గము దురారాధ్యమై సంకరమైనది. కర్మమార్గము, జ్ఞానమార్గము, ధర్మమార్గము పండితులకు సుగమములైనను బ్రజాసామాన్యమునకు దుర్గమములై వారి హృదయానందరస ప్రవాహమును శుష్కింపఁజేసినవి. ప్రజాహృదయమునం దానందరసోదయమై దేశము, ప్రజలు వర్ధిలుటకుఁ బ్రజాహృదయమున కనుభవసిద్ధమైన దేశీయ భాషావాఙ్మయ నిర్మాణము లవసరములైనవి. ఈ నిర్మాణములకు జీవకళను సజీవమైన భక్తిమార్గము సమకూర్చినది. ఇది కాలప్రభావము. పండితులకును, ప్రభువులకును ప్రజాసంకల్పము నాఁపుట దుష్కరమై ప్రజాహితార్థము గాకపోయినను దమ కీర్తి కొఱకైనను దేశీయవాఙ్మయ నిర్మాణమునకుఁ బూనుకొనవలసిన యవసరము గలిగినది. ప్రపంచమునందు సర్వకాల సర్వావస్థలయందును స్వప్రయోజనపరాయణులవలెఁ ద్యాగశీలురును గలుగుచుందురు. అట్టి త్యాగమూర్తులే చిరంజీవులై ప్రజాదరణమునకుఁ బాత్రులగుచున్నారు. క్రీస్తుశకము తొమ్మిది పదిశతాబ్దములందు భరతవర్షమున నవయుగ మారంభమయినది. దేశభాషావాఙ్మయములు పల్లవించుట కారంభించి క్రమవికాసమును బొందినవి. ఆంధ్ర కర్ణాటక మహారాష్ట్ర ఘూర్జర వంగ హిందీ వాఙ్మయములు సామాన్యముగఁ బదవశతాబ్దము తరువాతనే వృద్ధిబొందినవి. ఈ సంగతిసందర్భములను గనుఁగొనుట యితర దేశభాషావాఙ్మయముల చరిత్రలకువలె నాంధ్రవాఙ్మయ చరిత్రమునకును నత్యంతావశ్యకముగ నున్నది.

3
అజ్ఞాతయుగము

ఆంధ్రవాఙ్మయచరిత్రయం దజ్ఞాతయుగ మాంధ్రరాజుల కాలము నుండి నన్నయభట్టారకుని కాలమువఱకును వ్యాపించియున్నది. ఆంధ్రరాజుల శాసనములన్నియుఁ బ్రాకృత భాషయందుఁ గలవు. నాసిక, నానాఘాటు, అమరావతి, నాగార్జునకొండ మొదలగు స్థలములలోని శాసనములు సామాన్యముగఁ బ్రాకృత భాషయందుఁ గలవు. ఆశాసనములలోని విషయములు దానధర్మములకు సంబంధించి యున్నవి. ఈ శాసనము లాంధ్రావనికి సంబంధించినవైనను నాంధ్రవాఙ్మయమునకు సంబంధించినవి గావు.

ప్రాకృత శాసనములు

ఈ శాసనము లాంధ్రహృదయ భావాంకురములను గనుఁగొనుటకు మాత్రమే వినియోగపడఁగలవు. పల్లవుల శాసనములు సామాన్యముగఁ బ్రాకృతసంస్కృతములందుఁ గలవు. విష్ణుకుండి వంశజుల శాసనములు సంస్కృతమునం దున్నను దెలుఁగుపదములు గన్పడుచున్నవి. ఆ శాసనములం దాంధ్రవాఙ్మయాంకురములు పొడ గట్టుచున్నవి. చాళుక్యరాజుల శాసనములు సంస్కృతాంధ్రములందుఁ గలవు. ఆశాసనములందలి విషయములును దానధర్మములకు సంబంధించియున్నవి.

ఈశాసనములందు దేశీయవాఙ్మయము బీజరూపమున గోచరమగుచున్నది. శాసనములందుఁ బద్యగద్యరూపమున వాఙ్మయాంకురములు గనుపడుచున్నవి. రగడ, మధ్యాక్కర, సీసము మొదలగు పద్యములు నన్నయకుఁ బూర్వమే వాడుకయం దున్నటులు శాసనములు దెలుపుచున్నవి. కాని ఆపద్యములందు రచించిన గ్రంథము లేవియుఁ గానరాకున్నవి. శ్రీయుత వంగూరి సుబ్బారావుగారు వారి యాంధ్రవాఙ్మయ చరిత్రమునందు నన్నయకుఁ బూర్వమునందుండిన యాంధ్రవాఙ్మయము నశించుటకుఁ గల కార

— మచ్చునకు మూఁడు ప్రాకృత శాసనములు —

౧

నాసిక గుహలలోని శాసనము

[ఈ శాసనము నాసిక గుహలలో ౩-వ గుహలోని వసారా తూర్పుగోడమీఁద ఉన్నది. ఈ నాసికగుహలలోని ఆంధ్రరాజుల ప్రాకృతశాసనములను 'సేనార్టు' పండితుఁడు 'ఎపిగ్రాఫియా ఇండికా' ఎనిమిదవ సంపుటములో అర్థవివరణములతోను, పాఠభేదములతోను బ్రకటించెను. అందుండియే ఈశాసనపాఠము గ్రైకొనఁబడినది.]

౧. సిద్ధం సెనాయె వెజయంతియె విజయఖదా వారా గోవధనస బెనాకటక స్వామి గోతమిపుతో సిరిసదకణి.

౨. ఆనపయతి గోవధనె అమచ విణ్హుపాలితె గామె అపరకఖడియె య ఖెతం అజకాలకియం ఉసభదతెన భూతం నివతన

౩. సతాని బె ౨౦౦ ఎతె అమ్హ ఖెతె నివతణ సతాని బె ౨౦౦ ఇమెస ప్వజి తాన తెకి రసిణ వితరామ ఎతస చస ఖెతస పరిహార

౪. వితరామ అపవెస అనొమస అలొణఖాదక అరఠసవినయిక సవజాతపారి హారిక చ ఎతహిన పరిహారెహి పరిహర్. హి

౫. ఎతె చస ఖెతపరిహార్. చ ఎథ నిబధాపెహి అవియెన ఆణతం అమాచెన సివగుతెన ఛతో మహాసామియెహి ఉపరఖితో

౬. దతా పటికా సవచ్ఛరె ౧౮ వాసపఖె ౨ దివసె ౧ తాపసెన కటా.

౨

జగ్గయ్యపేట స్తూప శాసనము

[ఈ శాసనము జగ్గయ్యపేట స్తూపపు రాళ్ళమీఁదఁ జెక్కఁబడి యున్నది. దీనిని బూలరుదొర గారు 'ఇండియన్ ఆంటిక్వెరీ' పత్రిక ౧౧-వ సంపుటము (౧౮౮౨) లోఁ బ్రకటించిరి. బర్జెస్ దొర గారు తమ 'అమరావతి, జగ్గయ్యపేట స్తూపములు' అను గ్రంథములో దీనిని దిరిగి ప్రకటించిరి. ఇక్కడఁ బొందుపఱచిన శాసనపాఠము బర్జెస్ దొరగా రిచ్చినది.]

౧. సిద్ధమ్ రాఞో మాఢరిపుతస ఇఖాకుణం సిరివిర పురిసదతస సంవచ్ఛర ౨౦ వాసాపఖం ౮ దివసం

౨. ౧౦ క (౦) మకరథె ణడతూరె ఆవెసనిస నాకచందసపుతో గామె మహా కాండురూరె ఆవెసని

౩. సిధథో ఆపణో మాతరం నాగిలనిం పురతో కతూనం ఘరణిం చ సముద నిం బాలకం చ మూలసిరిం

౪. బాలికంచ నాకబుధనికం భతుక (౦) చ బుధనికం తస ఘరనిం చ కనికం బాలకా చ నాగసిరి చంద

౫. సిరి బాలికం యు సిధనిక (౦) ఎవ (౦) నాతి మిత సంబధివగన సహగామె వెలగిరి యం భగవతో

౬. బుధస మహాచెతియపువాదరె ఆయక - ఖంభె ౫ సవనియుతె అపణో దేయ ధమ్మం సవసతానం హి

౭. తసుఖాయ పటిథాపిత తి

3

కృష్ణాజిల్లా అల్లూరిలోని శాసనము

[ఈ శాసనము కృష్ణాజిల్లా నందిగామతాలూకా అల్లూరులో నొక శిలా స్తంభముమీఁదఁ జెక్కఁబడియున్నది. శాసనముయొక్క ఆద్యంతములు గల శిలా భాగము విరిగిపోయి కానరాలేదు. అక్షరములనుబట్టి ఇది క్రీ. శ. రెండవ శతాబ్ది నాఁటిదిగఁ దోఁచును. మనకు దొఱకిన శాసనభాగమున రాజుపేరు లేదు. ఇందు భార్యతోను, కొడలితోను వచ్చి 'మహాతలవరుఁ' డనునతఁడు చేసిన దానధర్మములు వర్ణితములైనవి. దీని ప్రతిబింబమును, ఇందలి సారాంశమును (ఇంగ్లీషున) చెన్నపురి శాసనశాఖవారు ౧౯౨౩—౨౪వ సాంవత్సరిక నివేదికలోఁ బ్రకటించియున్నారు. శాసనపాఠము శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారిచ్చినది.]

౧. ...ల [సే మట] వ [సచ]

౨. సరామొ విహారో దెయధమ పరిచా

౩. నిగలసిమ్హాయ వెతరకుతో న

౪. తిఖెత సారసపాపికల సిమాయ

౫. నివతనాని రాజదతిని చారశె మఛ (?)

౬. పటసిమాయ బతిసనివతనాని రా

౭. • పురసిమాయ చసవిస నివతనా న

౮. ట లస గావిన పచసతాని చొయతి బలివా.

౯. సకటాని పెసరుపాని దాసిదాస సచతాల.

౧౦. కుభికటాహ సచతరి లోహియొజె కటాహాని కంస (?)

౧౧. సభాయనాని చతరి వదాలాభి కారో కరొడాయొయొ

౧౨. క దివికాయొచ అతరగిరియపిచ పాకతళాకా

౧౩. కాహాపనా నచ పురానం సహసం అఖయ నివ

౧౪. ఎస మహాతలవరస దెయధమ పరిచాకో

౧౫. అతపేటతిరపసె బాపన నివతనాని

౧౬. ఎతస భారియస సపుతకస సనసకస

౧౭. అయిరాన పువసెలియాన నిగాయస

ణములు బ్రాహ్మణాభిమానము, మతకలహములు నని నిర్ణయించిరి. జైనులును, బౌద్ధులును వారి మతధర్మవ్యాపనము నారంభమునందు పాలీతెలుఁగు భాషల ముఖమునఁ జేసియుందురు. జైనబౌద్ధమతబోధకులు సామాన్యముగ సంస్కృతపండితులైయుందురు. వారు మతబోధను బోధరూపముననే శిష్యులకుఁ జేయుచుండిరి. ఇదియే ప్రాచీన గురుకులసంప్రదాయము. వారు తెనుఁగునందు మతబోధలఁజేసినను దెలుఁగుభాషయందు గొప్ప గ్రంథములను వ్రాయలేదనియే నమ్మఁదగియున్నది. అథర్వణాదులు వ్రాసిన వ్యాకరణగ్రంథ నామములను బట్టియు, నితరసాధనములను బట్టియు నాంధ్రవాఙ్మయ మున్నటులూహింపఁదగినను గ్రంథసముదాయము లేని యూచర్చవలనఁ బ్రయోజనము గలుగదు.

సంస్కృతపాండిత్యమే గౌరవప్రదమని తలఁపఁబడు యుగమునందుఁ దెనుఁగువాఙ్మయము వర్ధిల్లుట కవకాశములు లేవు. సూత్రయుగమునుండి నేఁటివఱకును ఆంధ్రదేశమునందు సంస్కృతభాషాపాండిత్యమును, వైదికమతాభిమానమును నవిచ్ఛిన్నముగ నిలిచియే యున్నవి. ఆంధ్రపండితులు వ్రాసిన కొన్ని సంస్కృతగ్రంథముల నామములు ౨౨, ౨౩, ౨౪ పుటలయందుఁ బేర్కొనఁబడినవి. శ్రౌతసూత్రకారుఁడైన అశ్వలాయనుఁ డాంధ్రుఁడు. గృహ్యసూత్రములను, కల్పసూత్రములను, ధర్మసూత్రములను వ్రాసిన ఆపస్తంబుఁ డాంధ్రుఁడు. పదునాల్గవ శతాబ్దమునందు ఋగ్వేదభాష్యమును రచించిన సాయనాచార్యుఁడును నాంధ్రబ్రాహ్మణుఁ డను ప్రతీతి గలదు. సాంగోపాంగ వేదాధ్యయనసంపన్ను లాంధ్రదేశమునం దెందఱో నేఁడును గలరు. ఆంధ్రదేశమునందు జైనబౌద్ధమతములు వ్యాపించినను వైదికమతముగూడఁ బ్రబలియున్నది. పండితుల దృష్టి సంస్కృతముమీఁద నిలిచినటులు తెనుఁగుమీఁద నిలువలేదు. నన్నయకాలమునందైనను సంస్కృతపండితులకుఁ గల గౌరవము తెలుఁగు పండితులకు లేదు. ఆంధ్రవాఙ్మయము వర్ధిల్లినతరువాత వర్తమానకాలమునందును నాస్థితియే కొంతవఱకు నిలిచియున్నది. ప్రభువు

లకును, పండితులకును సంస్కృతముమీఁదఁగల గాఢాభిమానమే తెలుఁగువాఙ్మయ నిర్మాణమునకుఁ బ్రతిబంధకమైనది.

తెనుఁగు శాసనములు

నన్నయకుఁ బూర్వము తెలుఁగు వాఙ్మయ మెంతయున్నదో, ఏ స్వరూపమున నున్నదో, ఏల నశించినదో నిర్ణయించుటకుఁ దగిన యాధారములు లేవు. ఇంతవఱకును నుపలబ్ధములైన నన్నయకు వెనుకటి తెలుఁగు శాసనములవలన నీ విషయములు తేలుచున్నవి. ఈ శాసనపరిష్కర్తలు శ్రీయుతులు జయంతి రామయ్యపంతులు గారు, కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, తేకుమళ్ల రాజగోపాలరావు గారు మొదలగు పరిశోధకు లీవిషయములను వ్యక్తముచేసిరి. నన్న యకుఁ బూర్వ మాంధ్రవాఙ్మయమునందుఁ బద్యగద్యరచనలు గలవు. పద్యములు దేశీయఛందస్సునందు వ్రాయఁబడినవి. రగడలు, మంజరి, ద్విపదలు, సీసములు, మధ్యాక్కరలు, గీతములు, తరువోజలు శాస నములందు వాడుకయందుండినవి. ఈ పద్యములందు యతిప్రాస నియమము లున్నవి. సంస్కృతమునందువలె యతిస్థానము కేవలము విరతిమాత్రమే యగాటకాక ఆంధ్రమునందుఁ గ్లిష్టరూపమును గలిగి యున్నది. ఇది కర్ణాట తమిళ కావ్యములందువలె నాంధ్రకావ్యము లందును సహజముగ నేర్పడినది. ఈ పద్యముల ఛందస్సు మాత్రాగణబద్ధమని పరిశోధకులు నిర్ణయించిరి. నన్నయ దేశీయ ఛందస్సును సంస్కరించి యతిప్రాసలను స్థిరపఱచి ఆంధ్ర వాఙ్మయ వృక్షమునకు దోహదము నొసఁగెను. ఆకాలపు వాఙ్మయస్వరూపము ప్రజలు నేఁటికిని బాడెడు తందానపదములందును, భ్రమరగీతము లందును, పాటలందును గోచరమగుచున్నది.

భాష సంస్కృతపదములతోఁ గూడినను దేశీయముగ వెల సినది. శాసనములందును, పాటలందును, పదములందును గొన్ని సంస్కృతపదములు దొర్లినను దెలుఁగుమాటలే అధికముగ వాడఁ బడినవి. శాసనకర్తలకుఁ గల సంస్కృతాభిమానము వారి వ్రాఁత

— నన్నయకుఁ బూర్వపు శాసనములు —

(మచ్చునకు రెండు)

అద్దంకి శిలాశాసనము

౧. ....[పుర ?]

౨. ....భూపాలకుణ్డు [॥*]

౩. పట్టంబుగట్టిన ప్రథమంబునేణ్డు బలగర్వ్వంబొ

౪. ప్పగ బైలేచి సేన [।*] పట్టంబు గట్టిఞ్చి ప్రభుం

౫. బణ్డరంగు[౦*] బ[ణ్చి]న సామ[౦*]త్త పదువతో
బోయ[।*]

౬. కొట్టంబు లన్ఱెణ్డుం గొని వేంగినాణ్టిం గొఱల్చియ

౭. త్రిభువనాంకుశబాణ నిల్పి [*] కట్టెపుదుర్గ్గంబు గడు

౮. బయల్సేసి కణ్డుకూర్ బెజవాడ గావిఞ్చె మెచ్చి [।*]

౯. పణ్డరంగు పరమమహేస్వరుణ్డు అదిత్యబటరని

౧౦. కి ఇచ్చిన భూమి ఎనుబొదివుట్ల అడ్డు పట్టునేల [।*]ద

౧౧. మ్మపురంబున దమ్మువులు[।*]దిని రక్షిఞ్చినవారికి అస్వ

౧౨. మేదం[బు]న ఫలం[బు] [అ]గు [॥*] *

సత్యాదిత్యచోళశాసనము*

(కడప మండలము)

౧. స్వస్తిశ్రీ చోళమ

౨. హారాజాధిరాజ ప

౩. [ర] మేశ్వర విక్రమాది

౪. [త్య] శక్తికొమరవి

౫. [క్ర] మాదితులకొడు[కు]

---

* శ్రీ హెచ్. కృష్ణశాస్త్రిగారి పాఠము.

౬. [ళ్] కాశ్యపగోత్రు
౭. [న్ము] శత్యదితున్నశిద్ధి [వే*]
౮. యురేనాణ్డు ఏఱు [వే*]
౯. [యి] ఏళుచున్ది కొ [మ]
౧౦. [జి] పాఱశేవ [శ]
౧౧. [మ్మాఁ] కాశ్యపగో
౧౨. [త్రి] నికి ఇచ్చిన
౧౩. చిఱుంబూరి ఉత్త
౧౪. శతూపుఁనదిశ
౧౫. . దు జుగ్గిపొలగ [రు]
౧౬. సు ద [క్షి] ణదిశ
౧౭. ...పాఱ [మ]
౧౮. ఏనుమఱుత్రు [గా]
౨౦. నుతాగిరి దేని
౨౧. సల్పినవానికి
౨౨. [వే] గుళ్ళువు వేసె
౨౩. ఱువుళు వేవా [న్రూ]
౨౪. ఋ్యనిల్పినం పుణ్య
౨౫. [ంబు] దినికి వక్రంబు
౨౬. వచ్చువన్ను పుత్రవ
౨౭. ద్య శ్రీవద్యగో [వ]
౨౮. ద్య పఞ్చమహా
౨౯. [పా]తక ఇచ్చేసిన
౩౦. వానిలోకంబు
౩౧. [నుణ్డు] వాన్ను.

లందలి వర్ణక్రమమునందుఁ గనుపడుచున్నది. అనుస్వారమునకు బదులు వ్యాకరణయుక్తముగ ననునాసికములే వాడఁబడినవి. శాసనములు గ్రాంథికభాషయందును, వాడుకభాషయందును గలవు. కొంతవఱకు వ్యాకరణయుక్తముగను నున్నవి; లిపి రేఖాకృతి నున్నది. వర్తులాకారమును దాల్పలేదు. భావములు శాసనములందు సర్వసామాన్యములు. శాసనములందు దానములు, భూములు, హద్దులు, దానవస్తువులు మున్నగు సామాన్య విషయములు మాత్రము వివరింపఁబడినవి. విశేషణములు సంస్కృతపదములుగనే యున్నవి.

నన్నయకుఁ బూర్వమునందుఁగల తామ్రశాసనములను, శిలాశాసనములను సమగ్రముగఁ బరిశీలించుటవలన నజ్ఞాతయుగమునందలి ఆంధ్రభాషాస్వరూపమును నిర్ణయించుటకుఁ గొంత వీలు గలుగఁగలదు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారు, ఆంధ్రదేశీయేతిహాస పరిశోధక మండలివారు, గిడుగు రామమూర్తి పంతులుగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిలుగారు మొదలయిన పరిశోధకులు చేసిన పరిశోధనము లమూల్యమైన ప్రయోజనమును సమకూర్చినవి. ఈపరిశోధన లంధకారబంధురమైన యుగమునందుఁ దమకాంతులఁ బ్రసరింపఁజేసి ఆంధ్రవాఙ్మయాంగములను సూక్ష్మరూపమున ద్యోతకము చేయుచున్నవి. సూక్ష్మాంగములు పరిశోధనలవలన స్థూలరూపముగా స్ఫుటము కాఁగలవు. ఆంధ్రశాసన పరిశోధనల విషయమై ప్రభుత్వ మవలంబించుచున్న యలసత్వము సారస్వతోపాసకుల కసహ్యమై నిరుత్సాహమును గలుగఁజేయుచున్నది. వందలకొలఁది శాసనములు శాసనపరిశోధక కార్యాలయమునందుఁ జిరకాలమునుండి నిద్రించుచున్నవి. శాఖాధికారులు ఆ శాసనముల పరిశోధనకు వెంటనే యేర్పాటులను జేసి పరిశోధకుల ప్రయత్నములను సార్థకముచేయుట ధర్మము.

శాసనముల విషయమై ప్రజలు చూపుచున్న విముఖత్వము నసహ్యముగ నున్నది. ప్రజలు తామ్రశిలాశాసనములను

పదునొకండవ శతాబ్దికి పూర్వపు ఆంధ్రభాషాశాసనముల పట్టిక

జిల్లా	తాలూకా	గ్రామము	వంశము	రాజు పేరు	శాసనకాలము *
అనంతపురం	గుత్తి	కొండుపల్లి	బాదామిచాళుక్య	విజయాదిత్య సత్యాశ్రయ శ్రీపృథివీవల్లభ	క్రీ. శ. ఏడవశతాబ్ది
,,	,,	దిమ్మగుడి	,,	విక్రమాదిత్య సత్యాశ్రయ పృథివీవల్లభ	క్రీ. శ. ఏడవశతాబ్ది
చిత్తూరు	మదనపల్లి	ముదివేడు	వైదుంబ (?)	....	క్రీ. శ. ఎనిమిదవశతాబ్ది (?)
,,	,,	వెలిగల్లు	,,	గండత్రినేత్ర శ్రీ బయ్యదుంబమహారాజు	క్రీ. శ. ఎనిమిదవశతాబ్దాంతము (?)
గుంటూరు	బాపట్ల	పాలపట్టు	....	....	,,
,,	ఒంగోలు	అద్దంకి	వేంగీచాళుక్య	[గుణకవిజయాదిత్య (?)]	క్రీ. శ. తొమ్మిదవ శతాబ్ది
నెల్లూరు	పొదిలి	బుదమకాయలపాడు	చాళుక్య (?)	విష్ణువర్ధన	,,
కడప	కమలాపురం	మాలెపాడు	చోళ	సత్యాదిత్య చోళమహారాజు	,,
గుంటూరు	ఒంగోలు	ధర్మవరం	చాళుక్య	విజయాదిత్య	,,
,,	,,	,,	,,	భీమమహారాజు	,,
,,	,,	మైలవరం	....	....	,,
నెల్లూరు	కందుకూరు	కందుకూరు	వేంగీచాళుక్య *	....	,,
,,	,,	పెట్లూరు	....	....	క్రీ. శ. పదవశతాబ్ది
,,	కనిగిరి	నలజనంపాడు	పల్లవ	బోదిరాజు	,,
,,	పొదిలి	కలుజువ్వలపాడు	చోళ	తొండయరాజు *	క్రీ. శ. పదవశతాబ్ది
కడప	కమలాపురం	చిలమకూరు	చోళ	....	,,
,,	,,	మాలెపాడు	రాష్ట్రకూట	నిత్యవర్ష	క్రీ. శ. పదవశతాబ్ది

* పై శాసనముల కాలము అక్షరస్వరూపము ననుసరించి నిర్ణయించినది.

దర్శినియోగము చేయుచు నపారమైన నష్టమును గలుగఁ జేయుచున్నారు. ప్రజలు శాసనములను గాపాడియు, నకలులను దీసికొనుచుఁ బరిశోధకుల ప్రయత్నములను సఫలముచేయుట పరమ ధర్మము.

౪
ఆదియుగము

౧. మును మార్గకవిత దేశం-బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిల్పి రంధ్రవిషయం-బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్.
(కుమారసంభవము)

ఆంధ్రవాఙ్మయచరిత్రయందుఁ బదునొకండవ శతాబ్ది మొక పుణ్యఘట్టము. ఆంధ్రవాఙ్మయముయొక్క సువ్యక్తమైన యారంభము నన్నయభారతముతో నారంభమైనది. నన్నెచోడుని పద్య మీ విషయమునే ధ్రువపఱచుచున్నది. వేంగిదేశాధీశుఁడు రాజరాజనరేంద్రుఁడు 1022 మొదలు 1063 వఱకును రాజమహేంద్రవరమునందు రాజ్యముచేసెను. రాజరాజుకాలమునందు దేశము ప్రశాంతస్థితియం దుండినది. రాజేంద్రచోళుఁడు దిగ్విజయయాత్రను జేసి దక్షిణభాగమునందు శాంతిస్థాపన చేసెను. (రాజేంద్రచోళుఁడు తన కుమార్తెను - అంగమ్మదేవిని రాజరాజున కిచ్చి పెండ్లిచేసి చోళచాళుక్య రాజ్యములకు మిత్రత్వమును బలపఱచెను. రాజరాజు తల్లి కుందమాంబదేవి రాజేంద్రచోళునకుఁ దోడఁబుట్టువు. పూర్వచాళుక్య వేంగీచోళరాజ్యములకుఁ గల సంబంధబాంధవ్యములు రాజరాజుదృష్టిని భారతాంధ్రీకరణమునకుఁ బ్రోత్సహించియుండును.) తమిళ కర్ణాటక భాషలందు వాఙ్మయము లదివఱకే వికసించుచుండెను. ఆంధ్ర పండితులు వేంగీరాజ్యమును విడిచి కర్ణాటక రాజ్యమునందు గౌరవ పోషణములను బడయుచుండిరి. (పంపయ్య బ్రాహ్మణ్యమును, వేంగీ దేశమును వదలి కర్ణాటకమునకుఁ బోయి 941వ సంవత్సరమునందు పంపభారతమును రచించెను.) రాజేంద్రచోళుని

కాలమునందుఁ దమిళ శైవభక్తులు వాఙ్మయాభ్యుదయమును జేయు చుండిరి. భారతము తమిళసంఘములందుఁ బారాయణగ్రంథముగఁ జోళరాజులు నియమించిరి. ఈ పరిస్థితులందు ధర్మదయార్ద్రనిబద్ధ బుద్ధిగల రాజరాజనరేంద్రుఁడు నన్నపార్యునిఁ దెనుఁగుభారతరచనను జేయఁగోరుట రాజప్రవృత్తికిఁ దగియున్నది.

క. బహుభాషల బహువిధముల - బహుజనములవలన వినుచు భారతబద్ధ
స్పృహులగువారికి నెప్పుడు - బహుయాగంబులఫలంబు పరమార్థ మగున్.

(భార. ఆది. ౧-౧౬.)

అందులకు నన్నయభట్టంగీకరించుచు సవినయముగఁ దెలిపిన భావము లా కవివర్యుని వినయవిధేయతలకు నిదర్శనములుగ నున్నవి.

చ. అమలినతారకాసముదయంబుల నెన్నను సర్వవేదశా
స్త్రముల యశేషపారము ముదంబునఁ బొందను బుద్ధిబాహువి
క్రమమున దుర్గమార్థజల గౌరవభారతభారతీసము
ద్రముఁ దఱియంగ నీఁదను విధాతృనకైనను నేరఁ బోలునే ?

(భార. ఆది. ౧-౧౫.)

నన్నయభట్టు తన యాంధ్రభారతమును వ్రాయుటకుఁ గల ప్రతిభ నాతఁడే హృద్యముగ నొక పద్యమునఁ దటస్థునివలెఁ బ్రథమ పురుషమందు వివరించెను.

సీ. తన కులబ్రాహ్మణు ననురక్తు నవిరళజపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాననిరతుఁ
బాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్రజాతు సద్వినుతావదాతచరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభిశోభితు సత్ప్రతిభాభియోగ్యు
నిత్యసత్యవచను మత్యమరాధిపా - చార్యు సుజను నన్నపార్యుఁ జూచి
పరమధర్మవిదుఁడు వరచళుక్యాన్వయా-భరణుఁ డిట్టులనియెఁ గరుణతోడ.

(భార. ఆది. ౧-౯.)

నన్నయకు భారతకావ్యరచన కవసరమైన ప్రతిభయంతయుఁ గలదు. ఆయన జపహోమతత్పరుఁడు; విపులశబ్దశాసనుఁడు; వేదా

ధ్యయన నిరతుఁడు; పురాణవిజ్ఞాననిరతుఁడు ; లోకజ్ఞుఁడు; ఉభయ భాషాకావ్యరచనాభిశోభితుఁడు; నిత్య సత్యవచనుఁడు.

ఈపద్యమునందలి 'తనకుల బ్రాహ్మణుక' అను పదము వాద ప్రతివాదములకుఁ గారణమైనది. శ్రీయుతులు బుర్రా శేషగిరిరావు గారు, చిలుకూరి వీరభద్రరావుగారు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి గారు మొదలగువారు దానికి విచిత్రార్థములను గల్పించిరి. నన్నయ క్షత్రియ బ్రాహ్మణుఁడు, క్షత్రియనియోగి, వైదికపురోహితుఁడు, నియోగిబ్రాహ్మణుఁడు మొదలగు సిద్ధాంతములు వెలువడినవి. ఈ సిద్ధాంతములను ఖండించుటయు, సమర్థించుటయును సాధ్యము. నిజస్థితి యేదో మాత్రము తెలియకున్నది. 'తన కులబ్రాహ్మణుఁడు' అను సమాసములో బ్రాహ్మణుఁడు ప్రధానపదము. నన్నయ బ్రాహ్మణుఁడనుట నిర్వివాదాంశము. ఆంధ్రమహాభారతము బ్రాహ్మణ ధర్మోద్ధరణమునకై పుట్టినది. పద్యమునందలి ఇతర గుణవర్ణనము లును బ్రాహ్మణస్వభావమునే తెలుపుచున్నవి. రాజరాజు నన్నయ క్షత్రియకులబ్రాహ్మణుఁడని చెప్పుటగాని, నన్నయ తన్ను గుఱించి యటులు వ్రాసికొనుటగాని యసంబద్ధము. క్షత్రియకులోద్భవుఁ డెప్పుడును బ్రాహ్మణుఁడు కాఁజాలఁడు. నన్నయ రారాజునకుఁ గుల బ్రాహ్మణుఁడు. రారాజుయొక్క సభయందు,

> "మంత్రి పురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మహాప్రధానానంత సామంత............విద్వజ్జనంబులు"

ఉన్నటులు వచనము తెల్పుచున్నది. కులబ్రాహ్మణుఁడు పై నుదాహరించినవారిలోనివాఁడు గాక యన్యుఁడును, రాజునకుఁ బూజ్యుఁడును నై యుండవలయును. అట్టి పూజ్యుఁడు కులగురువో, కులమున కారాధ్యుఁడో మాత్రమే యగును. కులశబ్దమున కర్థములు చాల నున్నవి. కాని కులదేవత, కులగురువు, కులపతి పదములందు వలెనే కులబ్రాహ్మణ పదమునందును గులపదము రూఢ్యర్థమును సూచించుచున్నదని తోఁచుచున్నది. నన్నయ [illegible]

బ్రాహ్మణుఁడు. రాజకులారాధ్యుఁడైన బ్రాహ్మణుఁడు. ఆకాలము నందు జైనులు, బౌద్ధులు, పండారులు రాజులకు గురువులైయుండుట కలదు. వైదిక మతాసక్తియు, బ్రాహ్మణభక్తియుఁ గల రాజరాజునకు బ్రాహ్మణోత్తముఁడు కులగురువై యుండుట సహజము. గురువునకు భక్తితత్పరుఁడైన రాజరాజుమీఁద ననురక్తి యుండుటయును సహజము. 'మత్స్యమరాధిపాచార్య' యను పదమును నీయర్థమునే స్ఫురింపఁజేయుచున్నది. భారతరచనయందు నన్నయకు నారాయణభట్టు చేసిన సహాయము నీతాత్పర్యమును బలపఱచుచున్నది. తెలుఁగు భారతమును రచియించిన నన్నపార్యుఁడు బ్రాహ్మణుఁడే కాక రాజరాజునకుఁ గులగురువును నైయుండును. నన్నయ యెవరైనను ఆంధ్రవాఙ్మయ నిర్మాతయై, వాగనుశాసనుఁ డను కీర్తిని బడసిన మహానుభావుఁడు. ఈ వితర్కములు నన్నయప్రతిభకుఁగాని, సత్కీర్తికిఁగాని, గౌరవమునకుఁగాని ప్రతిబంధకములు గావు.

భారత మాంధ్రభాషయందు మొదటికావ్యమై వెలయుచున్నది. నన్నయ భట్టారకుఁడు భారతరచనకుఁ గారణములను దెలిపియున్నాఁడు. భారతము బహుభాషలయందుఁ గలదు. రారాజు బ్రాహ్మణభక్తుఁడు; శివభక్తుఁడు; పాండవోత్తమకథాశ్రవణాసక్తుఁడు. భారతమహిమను బౌరాణికులు కొనియాడిన విధమును గథాప్రస్తావనయందు నన్నయ తెలిపియున్నాఁడు.

> సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని యధ్యాత్మవిదులు వేదాంత మనియు
> నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని కవివృషభులు మహాకావ్య మనియు
> లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని యైతిహాసికు లితిహాస మనియుఁ
> బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చయం బని మహిఁ గొనియాడుచుండ
> వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ డాదిముని పరాశరాత్మజుండు
> విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరఁగుచుండఁ జేసె భారతంబు.
>
> (భార. ఆది. ౧-౩౧.)

వివిధవేదతత్త్వవేదియైన వేదవ్యాసుఁడు భారతమును విశ్వజనీనమై పరఁగుచుండునటుల చేసెను. మహాభారతము ధర్మతత్త్వ

జ్ఞులకు ధర్మశాస్త్రము; అధ్యాత్మవిదులకు వేదాంతము; నీతివిచక్షణులకు నీతిశాస్త్రము; కవీంద్రులకు మహాకావ్యము; లాక్షణికులకు సర్వలక్ష్య సంగ్రహము; ఐతిహాసికుల కితిహాసము; పౌరాణికులకు బహుపురాణ సముచ్చయము. పరమార్థప్రదమైన భారతము సంక్షోభాయత్తమైన సమయమునందు నవయుగారంభమునకుఁ బ్రజల సంస్కారమునకు ననుకూలముగ వినియోగపడఁదగియున్నది. భారతమును వినుటవలనఁ గలిగెడి ఫలమును బర్వానుక్రమణికయందు నన్నయ యొక సీసపద్యమున సంక్షేపముగఁ జెప్పియున్నాఁడు.

సీ. ఆయురర్థులకు దీర్ఘాయురవాప్తియు నర్థార్థులకు విపులార్థములును
ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు వినయార్థులకు మహావినయమతియుఁ
బుత్త్రార్థులకు బహుపుత్త్రసమృద్ధియు సంపదర్థుల కిష్టసంపదలును
గావించు నెప్పుడు భావించి వినుచుండువారల కిమ్మహాభారతంబు
భక్తియుక్తులైన భాగవతులకు శ్రీవల్లభుండు భక్తవత్సలుండు
భవభయంబులెల్లఁ బాపి యిష్టార్థసంసిద్ధిఁ గరుణతోడఁ జేయునట్లు.

(భార. ఆది ౧-౩౨)

భారతమును భక్తితో నెప్పుడును వినుచుండెడి భక్తియుక్తులైన భాగవతులకు భక్తవత్సలుఁడైన శ్రీవల్లభుఁడు భవభయములను బాపి యిష్టార్థసిద్ధిని గరుణతోడ సమకూర్చును. ఆ సంకల్పముతోడనే నన్నయ భట్టారకుఁ డాంధ్రభారతమును జగద్ధితంబుగ రచియించెనని విశ్వసింపఁదగియున్నది.

ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లో
నారసి మేలు నా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నా రుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు దెనుంగున న్మహా
భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్.

(భార. ఆది. ౧-౨౬)

ఆంధ్రభారతమునందలి ప్రస్తావనావతారికలందు నన్నయ తన కావ్యరచనకుఁ బరమప్రయోజనమును సువ్యక్తము చేసెను. స్థూలదృష్టితోఁ బ్రస్తావనావతారికలను బరిశీలించునపుడు వైదికమతా

భిమానమును, బ్రాహ్మణాభిమానమును, వర్ణాభిమానమును ద్యోతకములగుచున్నను సూక్ష్మదృష్టితో నవలోకించునపుడు నన్నయ సంకల్ప ముదారమని ద్యోతకమగుచున్నది. వేదవ్యాస భారతమునందు- వేదముల యాధిక్యము, బ్రాహ్మణ ప్రభావము, వర్ణాశ్రమ ధర్మముల ప్రాధాన్యము విశేషముగఁ గనుపడుచున్నది. భారతము నాంధ్రీకరించిన నన్నయ కీకథన మంతయు నవసరమయినది. కాని మహాకావ్యరచనకుఁ బూనుకొనిన నన్నయ బ్రాహ్మణధర్మసంరక్షణముతోపాటు మహాకావ్యలక్ష్యమైన “విశ్వశ్రేయః కావ్యమ్” అను నుత్తమకావ్యధర్మమును బాటించిన విధము నవతారికా ప్రస్తావనలు, గ్రంథమును విశదము చేయుచున్నవి. మంగళాచరణ శ్లోకమునందు ‘శ్రేయసే’ పదమును వాడి కావ్యప్రయోజనమును దెల్పెను. ఆ కావ్యప్రయోజనమునే

> “నానారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహాభారతసంహితా రచనబంధురుఁడయ్యె జగద్ధితంబుగన్”

కవీంద్రులు మెచ్చునట్లు ప్రసన్నకథను, అర్థగాంభీర్యమును, రమ్యమైన శైలిని గలిగియుండునటులు నన్నయ యాంధ్రభారతమును రచియించెను. నన్నయకృతికి లక్ష్యము విశాలమైన విశ్వశ్రేయస్సుగాని సంకుచితమైన బ్రాహ్మణశ్రేయస్సుగాదు. అయినను ఆ సంకుచిత లక్ష్యము భారతమునందంతటను ముఖ్యముగ బ్రాహ్మణాభిమానమునందుఁ బ్రత్యక్షమగుచున్నను జగద్ధితమే కావ్యరచనకు ముఖ్యకారణము.

కర్మమార్గము

ఈ తత్త్వార్థమును వైదికవిజ్ఞాన పరిణామము పరిస్ఫుటము చేయుచున్నది. వైదిక మతమునకుఁ గర్మప్రాధాన్యము, బ్రాహ్మణాధిక్యము కీలకములు. వీనిని దేశకాలపాత్రములు శిథిలము చేసినవి. విశాలమైన దేశమునందు దేశావసరముల కనుగుణముగఁ గర్మములు భిన్నరూపములను దాల్చినవి. కాలక్రమమునఁ గర్మస్వ

రూప స్వభావములు మాఱినవి. ప్రజాశయముల కనురూపముగఁ గర్మప్రయోజనములును మాఱినవి. వేదములందే కర్మప్రాధాన్యము పోయి వేదాంతము స్థిరపడినది. మతవిప్లవములు, రాజ్యవిప్లవములు, సాంఘికవిప్లవములు వేదాంతమును స్థిరపఱచినవి. జైనబౌద్ధమతములు వైదికమతమును శిథిలము చేసినవి. వైదికమతోద్ధరణమును జేయుటకు వైదిక మతప్రియు లెంత పాటుపడినను నది శిథిలమైనదనియే యొప్పుకొనవలయును. రాజులును, బ్రాహ్మణులును వైదిక మతసంరక్షణమును జేయుటకుఁ దా మెంతపాటుపడినను నిర్జీవమైన కర్మకాండను, వర్ణాశ్రమధర్మమును బునరుద్ధరణముచేయుట దుస్తరమైనది. కర్మకాండ దురారాధ్యమై నిరర్థకమైన విధమును జైనబౌద్ధమతములును, వేదాంతమును జెప్పక చెప్పుచున్నవి. వైరాగ్యధర్మకాండపరములైన జైనబౌద్ధములు క్షీణించినను వైదికమత దుర్గమును శిథిలము చేసినవి. వైదికమతమునకును, జైనబౌద్ధమతములకును వేదాంతము సామాన్య ధర్మమైనది. జైనబౌద్ధమతములవలె వేదాంతమును, కర్మకాండను, వర్ణాశ్రమ ధర్మములను నిరాకరించినది. వైదికమతస్థులందువలె జైన బౌద్ధమతస్థులందును, బ్రాహ్మణులందువలె బ్రాహ్మణేతరులందును వేదాంతులు బయలుదేరిరి. వారు సంకుచితమైన కర్మమార్గమును విడిచి విశాలమైన జ్ఞానమార్గము నవలంబించిరి. అద్వైతమతాచార్యులగు శ్రీశంకరాచార్యులు వైదికమతోద్ధరణమును జేసిన రీతినే వైదిక మతపతనమును గూడఁ జేసెను. ఇది కాల మహిమ; చిరకాలగతమైన వైదికమతసంఘర్షణమునకుఁ బరిణామము.

అద్వైతము సకలభేదముల నంతరింపఁజేసి జ్ఞానమార్గమున నేకత్వమును బ్రతిపాదించినది. జ్ఞానమార్గమునఁ బురుషార్థమును బడయుటకుఁ గర్మమార్గము నిరుపయోగమై భక్తిమార్గ మేర్పడినది. కర్మమార్గము వైదికమతాధికారులైన బ్రాహ్మణోత్తములకుఁ బ్రయోజనకరమైనను అట్టి యధికారములేని తదితరులకు మార్గాంతరము లేక భక్తిమార్గము శరణ్యమైనది. "భక్తియుక్తులైన భాగవతులకు

భ క్తవత్సలుండు, శ్రీవల్లభుండు పరమార్థమును దయచేయు"నని పర్వానుక్రమణికాంతమునందు నన్నయ తెలియఁజేసెను. మహా కావ్యనిర్మాత నన్నయ విశ్వశ్రేయస్సునకు సాధనమైన భక్తిమార్గము నాంధ్రభారతముఖమున ఆంధ్రలోకమునకు వ్యక్తము చేసెను.

పదునొకండవ శతాబ్దము

నన్నయ సంకల్పమును సఫలము చేయుటకుఁ గావ్యమును, గాలమును దగియున్నవి. భారతము పంచమ వేదము. వైదిక మత పరిణామము నితిహాసరూపమున భారతము వ్యక్తము చేయుచున్నది. భారతము వేదయుగాంతమునం దారంభమైనను వర్తమాన రూపమును బడయుటకుఁ గొన్ని శతాబ్దములు పట్టినవి. వైదికమతాచార్యుఁడు వేదవ్యాసుఁడే మహాభారతమును రచించి పండిత పామర హృదయములకు వైదికమతపరిణామమును సుగమము చేసెను. ధర్మాధర్మ సంరంభమునందు ధర్మవిజయమును మహాభారతేతిహాసము సహస్రముఖములఁ బ్రతిపాదించుచున్నది. కౌరవ పాండవ యుద్ధమునందుఁ బాండవవిజయము ధర్మవిజయము. రాజు లన్యోన్య కలహములతో మహాసంక్షోభమును గలుగఁజేయుచుండిరి. నిరంతర యుద్ధముల చేత సంక్షుభితమైన కాలమునందు యుద్ధధర్మము నాంధ్ర భారతము వ్యక్తము చేసినది. జ్ఞానోపార్జనము వేదాధ్యయనమూలమునఁగాక ధర్మారాధనమూలముననే సాధ్యమని ధర్మవ్యాధోపాఖ్యానము మొదలగు ననంతములైన యితిహాసములు విశదము చేయుచున్నవి. మహాభారతము సాంఖ్యయోగమును, కర్మయోగమును, జ్ఞానయోగమును, భక్తియోగమును సమన్వయము చేసినది. వేదాంతము "తత్త్వమసి" ఇత్యాది మహావాక్యముఖమునఁ బ్రతిపాదించిన మోక్షమును మహాభారతము "సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ" ఇత్యాది భక్తిసాధనముల మూలమునఁ బ్రతిపాదించినది. భక్తవత్సలుఁడైన శ్రీకృష్ణుఁడు భక్తులైన భీష్మార్జునులకుఁ బురుషార్థమును సాధ్యము చేసిన విధము భారతమునందు సర్వత్ర గోచరమగుచున్నది. శ్రీకృష్ణసారథ్యమే భక్తుఁడైన పార్థునకు విజ

యమును సమకూర్చినది. భగవద్భక్తపరాయణులైన ధర్మరాజభీష్మార్జున విదురాదులు కృతార్థులైరి.

చ. ప్రియహితసత్యవాక్య యరిభీషణ కృష్ణ భవన్నియోగసం
శ్రయమున నున్న వా కధికశత్రుజయం బగు శేముపెద్ద ని
శ్చయముగ నింక మోక్షితుల సర్వమహీశులు నిమ్మహాధ్వర
క్రియయును సిద్ధిఁ బొందెన యకిల్బిషకీర్తి వెలుంగుచుండఁగన్.

క. ధరణీశ్వర సర్వగుణా - కర కరుణానిరత సర్వకార్యైకధురం
ధర నినుఁ బడసిన మాకును - హరివిక్రమ పడయరానియవియుం గలవే?

(భార. సభా. ౧-౧౬౫,౧౬౬.)

పదునొకండవ శతాబ్దమునం దారంభమైన భక్తిమార్గము కాలక్రమమున వికసించి వాఙ్మయాభ్యుదయమునకుఁ దోడ్పడినది. ఆంధ్రకర్ణాటమహారాష్ట్రగూర్జర వంగహిందీ వాఙ్మయములు పదుమూఁడు పదునాలుగు శతాబ్దములందు భాగవత భక్తివిలసితము వర్ధిల్లిన విధమును వాఙ్మయచరిత్రలు విశదము చేయుచున్నవి. నన్నయ భారతభాగమునందు సూచితమైన భాగవతభక్తి తిక్కన కాలమునందుఁ బరిస్ఫుటమైన విధమును భారతము విశదము చేయుచున్నది.

కాలమును భారత రచనకుఁ బరిపక్వముగనున్నది. కుమారిలభట్టు శంకరాచార్యాదులు వైదికమత ప్రతిష్ఠాపనను జేసినను భక్తిమార్గము ప్రజాహృదయము నావరించినది. ప్రజలు భాగవత భక్తిపరాయణులై పాటలను బాడుచు, స్తవములను జేయుచు, భజనలను గావించుచు బ్రహ్మానందమును బొందుచుండిరి. తమిళ వాఙ్మయము భక్తిప్రభావమును విశదము చేయుచున్నది. క్రీస్తుశక మేడనిమిది శతాబ్దములందే సంబందరు, అప్పర్ స్వామి, సుందరమూర్తి, మాణిక్యవాచకరు మొదలగు శివభక్తులును తమిళభాషయందు శివస్తోత్రములను భక్త్యావేశముతో రచియించి భక్తిమార్గమును దక్షిణ భాగమునందు వ్యాపింపఁజేసిరి. ఆ శైవస్తోత్రములు నేఁటికిని బ్రాహ్మణ బ్రాహ్మణేతరులకు బ్రహ్మానందదాయకములుగ నున్నవి. బ్రాహ్మణేతరులైన ఈ శైవభక్తులు భక్తిభరితులై దేవాలయము

లందుఁ దంబూర శ్రుతిలో మేళవించి రమ్యముగఁ బాటలను, పద్యములను బాడుచు భాగవతభక్తిని వ్యాపింపఁ జేసిరి. చాళుక్యచోళ రాజ్యముల సంబంధబాంధవ్యములతో రాజరాజు కాలమునకుఁ దెలుఁగుదేశమునందును శైవభక్తులు సహజముగ వ్యాపించి యుందురు. పదునొకండవ శతాబ్దారంభమునందుఁ గర్మమార్గముకన్నను భక్తిమార్గమే ప్రబలుచున్నదని యూహింపఁదగియున్నది. ఆ పరిస్థితులందు వివిధమార్గములను సమన్వయము చేయఁగల భారత మాంధ్రానువాదమునకు సకలవిధములఁ దగియున్నది. ఆంధ్రభాగవత రచన కింకను గాలము పరిపక్వము కాలేదు. రామాయణమునకు, పంచమవేదమైన భారతమునకుఁ గల ప్రతిభ వైదికమతపరిణామమును బ్రతిపాదించుటకుఁ జాలదు.

భారతరచన ౧౦౫౦ ప్రాంతముల నారంభమైనను ౧౨౭౦ ప్రాంతములందు ముగిసినది. నన్నయభట్టారకుఁ డాదిసభాపర్వములను, ఆరణ్యపర్వములోని నాలవ యాశ్వాసమునందు మూఁడువంతులును దెలిఁగించెను. ఎఱ్ఱాప్రెగడ భారతారణ్యపర్వ శేషమును దెనిఁగించెను. ఆయన ౧౨౮౦లో జననమొంది ౧౩౫౦ వఱకును జీవించియుండునని వీరేశలింగము పంతులుగా రాంధ్రకవుల చరిత్రమునందు నిర్ణయించిరి. శేషించిన పదునైదుపర్వములను దిక్కనసోమయాజి తెనిఁగించెను. తిక్కన సోమయాజి ౧౨౨౦ ప్రాంతమునందు జనించి ౧౩౦౦ ప్రాంతములందు మృతినొందిన ట్లు వీరేశలింగము పంతులుగారు నిర్ణయించిరి. ఆంధ్రభారత మారంభమైన తరువాత ముగియుటకు ౨౦౦ ఏండ్లు పట్టినవి. ఆంధ్ర మహాభారతమును రచియించిన మువ్వురు కవులును 'కవిత్రయ'మని ప్రసిద్ధిఁగాంచిరి. ఆంధ్రవాఙ్మయ వ్యాపనమునం దాదయుగమునందుఁ గల మందగమనము నీ మహాభారతరచన దెలుపుచున్నది. ఆ కవిత్రయము ఆంధ్రవాఙ్మయమునందు వాగనుశాసనుఁడు, ప్రబంధ పరమేశ్వరుఁడు, కవిబ్రహ్మ యను సార్థక నామధేయముల విరాజిల్లుచున్నారు. భారతకావ్యమునకుఁ బరమేశ్వరునిఁ బట్టభద్రునిఁ జేసిన తిక్కన ఆంధ్ర వాఙ్మయ

సామ్రాజ్యమునకుఁ బట్టభద్రుఁడుగ నున్నాఁడు. ఈ గ్రంథమునందుఁ గవిత్వతత్త్వ విచారణ కవకాశము లేదు. అయినను వీరేశలింగము పంతులుగారు కవుల చరిత్రమునందుఁ దిక్కనవిషయమై వ్రాసిన భావములను దెలుపుట ధర్మముగ నున్నది. ఈ భావముల సారమునే వేర్వేఱురీతుల వారి సంస్కారమున కనురూపముగ విమర్శకులు, పండితులు సందర్భానుసారముగఁ దెలిపియున్నారు:

"తెలుఁగు భాషయం దెన్ని గ్రంథము లున్నను, తిక్కన సోమయాజి కవిత్వముతో సమానముగాఁ గాని, దానిని మించునట్లుగాఁ గాని కవిత్వము చెప్పఁగలిగినవా రిం దేట్టివఱ కొక్కరును కనఁబడలేదు. తిక్కన కవిత్వము ద్రాక్షాపాకమయి మిక్కిలి రసవంతముగా నుండును; ఈతని కవిత్వమునందు పాదపూరణమునకయి తెచ్చి పెట్టుకొనెడు వ్యర్థపదము లంతగా నుండవు; పదముల కూర్పుమాత్రమే కాక యర్థసందర్భమును మిక్కిలి పొందికగా నుండును; ఏవిషయము చెప్పినను యుక్తియుక్తముగాను, ప్రౌఢముగాను నుండును; ఎక్కడ నేవిశేషణము లుంచి యేరీతి నేపదములు ప్రయోగించి రసము పుట్టింపవలయునో యీకవికిఁ దెలిసినట్లు మఱియొకరికి దెలియదు; ఈయనకవిత్వము లోకోక్తులతోఁ గూడి జాతీయముగా నుండును; ఈయన పదలాలిత్యమును, యుక్తిబాహుళ్యమును, అర్థగౌరవమును, రచనాచమత్కృతియు, శయ్యావిశేషమును, సందర్భశుద్ధియు, కల్పనాకౌశలమును అన్యులకు రావు; ఈ కవిశిఖామణియొక్క కవిత్వమునం దొకవంతు సంస్కృతపదములును, రెండు వంతులు తెలుఁగుపదములు నుండును."

తిక్కన వాడుకయందున్న తెలుఁగుమాటలను దనకృతులయందు వాడి తెలుఁగుసొంపును బెంపొందఁజేసిన విధమును భారత, నిర్వచనోత్తరరామాయణములు తెలుపుచున్నవి. ఇందులకు దృష్టాంతము లనంతములు గలవు.

సీ. అఱుదారు మేలుకట్లాయితంబై చూడ నొప్పారి తనుపగు చప్పరములుఁ
బగనైన చెలువంబు గరగరికయుఁ దియ్య తెలినీరుఁ గలిగిన దీర్ఘికలును
బొదవైన మక్వంచఁ బొలుచునట్లుగ నేనుఁగులకు గుఱ్ఱములకుఁ గట్టములును
మురిదర బయలైన చందంబుఁ జతురాభిమతమైన యాస్థానమంటపములు
బియ్యములును నెయ్యుఁ బెరుఁగును గూరగాయలును వంటింట్రియలును గడ్డి
కసవములును జెల్లుగా నొడఁగూర్చిఁ నిగూఢవృత్తిఁ దానఁ గూడ నడచె.
(ఉద్యో. ౧-౫౩.)

సీ. లలితంబు లగు మట్టియల చప్పుడింపార నంచకైవడి నడ నల్ల వచ్చి
ఱాఁచ మేనికాంతి సుడియంగఁ బయ్యెద సగము దూలించి పై ముసుఁ దిగిచి
సోలెఁడు తెలిడిఁగెలిఁ గ్రాలుచు వింత చెలువంబు దళుకొనఁ జేరి నిలిచి
తెలిగన్నుఁగవకు నెచ్చెలి యైన లేఁత నవ్వొలయంగ సరసంపుఁబలుకు పలికి
మెఱయు చెయ్వులరాగంబు మెయిగొనంగ-నెడఁద సొగయించుమాటల
నెలమి మిగుల
నిన్ను నవరక్తిఁ గొలుచున న్నులఁతు లుండ-నీరసాకార సైరంధ్రి గోరఁదగునె?
(విరా. ౨-౬౪.)

ఈ పద్యమునందు నాలుగైదు సంస్కృతపు పదములు మాత్రమే వాడఁబడినవి. ఈకారణమువలననే "తెన్గుబాస వినిర్మింపఁ దివురుటరయ భవ్యపురుషార్థతరుపక్వఫలము" అని తిక్కన సంభావించెను.

ఆంధ్రభారతరచన వాఙ్మయచరిత్రమునందుఁ గవిత్రయ కాలమునందుఁ గలిగిన పరిణామమును దెలుపుచున్నది. నన్నయ భారతమును రాజరాజునకుఁ గృతిగఁ దెనిఁగించెను. నన్నయ రెండు వంతులు సంస్కృత పదములను, ఒకవంతు తెనుఁగుపదములను వాడెను. నన్నయశైలి సరళముగను, గంభీరముగను, ద్రాక్షాపాకముగా నున్నది. నన్నయరచన సంస్కృతసంస్కారమయముగ నున్నది. నన్నయ శివభక్తుఁడు; నన్నయకావ్యము ప్రథమాంధ్రకావ్యము. తిక్కన హరిహరులకుఁ గృతిగ భారతమును రచించెను. తిక్కన రెండువంతులు తెలుఁగుపదములను, ఒకవంతు సంస్కృతపదములను వాడెను. తిక్కనరచన సంస్కృతాంధ్రసంస్కారముల సమ్మేళనమును బొంది ఆంధ్రహృదయమునకు లక్ష్యముగ నున్నది. తిక్కన అద్వైతి. తిక్కనకావ్యము పరిపక్వమైన కావ్యము. తిక్కన భారతములోని పదునైదుపర్వములను "జనసంప్రార్థ్యంబుగను" తెనుఁగుబాసను రచియించెను. భారత రచనయందు నన్నయకును, దిక్కనకును లక్ష్యములు భిన్నములుగ నున్నవి. నన్నయకు భారతరచనకుఁ బ్రయోజనము రాజరాజానుగ్రహమును, దెనుఁగుఁగావ్యరచనయును. తిక్కనకు భారతరచనకుఁ

ప్రయోజనము తెనుఁగుబాస, తెనుఁగుజనులు, తెనుఁగుదేశము, దుఃఖనివృత్తి, సుఖప్రాప్తి, మోక్షము, పరమేశ్వర సాక్షాత్కారము. నన్నయ భట్టారకుఁడు తన కృతిని రాజరాజున కంకితము చేసెను. తిక్కన సోమయాజి తనకృతిని ఆంధ్రత్వమునకును, పరమేశ్వరునకును సమర్పించెను.

క. ప్రాగల్భ్యనిరూఢి యయి - భారత మమరఁ బరఁగు పంచమవేదం
బారాధ్యము జనులకుఁ ద - ద్గౌరవ మూహించి నీ వఖండితభక్తిన్.

(విరా. ౧-౧౪)

తే. తెనుఁగుబాస వినిర్మింపఁ దివురుటరయ - భవ్యపురుషార్థతరుపక్వఫలము గాదె
దీని కెడ నియ్యకొని వేడ్క నూనికృతిప - తిత్వ మర్థించి వచ్చితిఁ దక్క శరణ్య.

(విరా. ౧-౧)

ఉ. కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁ గ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయసంస్కృతి
శ్రీకభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వదీ
క్షాపథినొంది పద్యముల గద్యములన్ రచియించెదం గృతుల్.

(విరా. ౧-౩౦.)

తిక్కన జనాభ్యర్చితమైన భారతమును దేవదేవున కర్పించి వాఙ్మయభక్తకోటికి వరణీయుఁడై, పుణ్యచరిత్రుఁడై జన్మసాఫల్యమును గాంచెను.

ఉ. కూర్చుట నూత్నరత్నమునకుం గనకంబునకుం దగున్ జనా
భ్యర్చితమైన భారత మపారకృపాపరతంత్రవృత్తిమైఁ
జేర్చిన దేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి నా
నేర్చినభంగిఁ జెప్పి వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్.

(విరా. ౧-౨౮)

ఉ. ఇట్టిపదంబుఁ గాంచి పరమేశ్వరునిం గృతినాథుఁ జేసి యే
నట్టివఁ బూజ్యమూర్తియగు భారతసంహితఁ జెప్పఁ గంటి నా
పట్టు కృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రుఁడనైతి నవ్విభుం
గట్టిన బట్టు మప్రతిమ కారుణికత్వమహావిభూతికిన్.

(విరా. ౧-౨౪)

పదునొకండవ శతాబ్దమునందు నన్నయకాలమునందుఁ బున రుద్ధృతమైన వైదికమార్గనిష్ఠయును, పల్లవించిన భేదములేని భక్తిమార్గమును దిక్కనయందుఁ బరిపక్వతను బొందినవి. తిక్కన నియోగి బ్రాహ్మణుఁడు; లోకవ్యవహారజ్ఞుఁడు; సంగ్రామ దక్షుఁడు; సోమయాజి; కవిబ్రహ్మ; తత్త్వజ్ఞుఁడు; పరమేశ్వరభక్తుఁడు. తిక్కన సోమయాజి "విశ్వశ్రేయః కావ్యమ్" అను పరమార్థమును గల్పించిన మహానుభావుఁడు. ఆంధ్రప్రజాభ్యుదయము, ఆంధ్రభాషాభ్యుదయము, ఆంధ్రదేశాభ్యుదయము, పరమేశ్వరారాధనము కావ్యరచనకుఁ బరమప్రయోజనము లని తిక్కన వ్యక్తముచేసి ఆంధ్రవాఙ్మయమున కఖండమైన ప్రతిభను సమకూర్చెను.

ఉ. వైదికమార్గనిష్ఠ మనువర్తనముం దగ నిర్వహించుచున్
భేదము లేని భక్తిమతి నిర్మలవృత్తిఁగఁ జేయుచుండు మ
త్స్వాదనిరంతరస్మరణ తత్పరభావముకల్మి నాత్మ స
మ్మోదముఁ బొందఁ గావ్యరసముం గొనిగ్రోలుచు నుండు దెప్పుడున్.

(విరా. ౧-౧౪)

కావ్యప్రయోజనము విశ్వకల్యాణము. కావ్యము రసాత్మకము. విశ్వకల్యాణము రసోదయమువలననే కలుగుచున్నది. రసాత్మకమైన కావ్యము చిన్నదైనను, పెద్దదైనను గావ్యప్రయోజనమును సమకూర్చుచున్నది. విశ్వమంతయు రసాత్మకమై వెలయుచున్నది. రసాన్వేషకులైన కావ్యతీర్థులు సర్వత్ర రసప్రభావమును గనుఁగొనుచున్నారు. విశ్వవ్యాప్తములైన భగవద్విభూతులు రసాత్మకములై పరమానందమును గలుగఁజేయుచున్నవి. దిగంత వ్యాప్తములైన దివ్యవిభూతులను గన్నులు చూచుచున్నవి; చెవులు వినుచున్నవి; బుద్ధి తెలిసికొనుచున్నది; ఇతరేంద్రియములు యథోచితముగ నింద్రియవ్యాపారములను నిర్వహించుచున్నవి. అయినను దివ్యవిభూతుల రసస్వాదయము విజ్ఞానసంపన్నులకు మాత్రము ప్రత్యక్షమగుచున్నది. సామాన్యులకు రసస్వాదయము గోచరముగాదు.

కర్మేంద్రియములు కార్యరూపమునను, జ్ఞానేంద్రియములు భావరూపమునను రసానందమును గలుగఁజేయుచున్నవి. కరచరణాది కర్మేంద్రియములకు విషయరస మానందకరము; చెవులకు శబ్దరస మానందకరము; కన్నులకు రూపరస మానందకరము; ముక్కునకు గంధరస మానందకరము; త్వక్కునకు స్పర్శరస మానందకరము; జిహ్వకు రుచ్యరస మానందకరము; కర్మేంద్రియ జ్ఞానేంద్రియాయత్తమైన విషయవాంఛల రసానంద మారంభమునం దమృతప్రాయముగఁ గనుపడినను విషపరిణామమును బొందుచున్నది. విషయోపలాలితమైన రసానందము కావ్యమునకు క్షుద్రప్రయోజనముగాని యుత్తమప్రయోజనము గాదు. కావ్యమునకుఁ బరమప్రయోజనము విషయాతీతమైన రసానందమువూలమునఁ గలుగుచున్నది. నవరసములు గలుగఁజేసెడి యానందము విషయోపభోగమువలననే కలుగుచున్నది. శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము, శాంతము, వాత్సల్యము వలనఁ గలిగెడి రసానందము విషయాసక్తముగాక విషయాతీతముగ నుండుట విశ్వశ్రేయస్సునకు సాధనము. విషయాసక్తమైన రసానందము తాత్కాలికము; పరిమితము; స్వార్థపరము; దుఃఖదాయకము; మానసికము.

విషయాతీతమైన రసానందము విశాలము; పరార్థపరము; సుఖదాయకము; ఆధ్యాత్మికము. విషయాసక్తమైన రసానందప్రాప్తికి సాధనము భోగము. విషయాతీతమైన ఆనంద ప్రాప్తికి సాధనము త్యాగము. కావ్యలక్ష్యము "యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే—సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే" అని మమ్మటాచార్యుఁడు చేసిన నిర్వచనమునకు విశ్వశ్రేయస్సు ప్రధాన లక్ష్యముగాక యప్రధానలక్ష్యమగుచున్నది. విన్నకోట పెద్దన్న కావ్యాలంకారచూడామణియందుఁ జేసిన భావనిర్వచనమును నుత్తమకావ్యమునకుఁ దగియుండదు.

క. బహిరర్థాలంబనమై - విహరించు మనోవికార విలసితము సుమీ
విహిత మగు భావ మన ; నది-మహి విజ్ఞానంబు నా సుమఫలం బరఁగున్.

క. ఘనవిజ్ఞానం బాత్మకు - మనసున నే కలుఁగు నట్టి మనసున కబ్బున్
కనదింద్రియములచేతన్ - వినఁగా వీనులకు నొదవు విషయప్రాప్తిన్.

మనోవికారవిలసితమైన భావము విషయరసానందమును గలుగఁజేసినను విజ్ఞానదాయకము, విషయాతీతమునైన రసానందమును గలుగఁజేయఁజాలదు.

విశ్వకల్యాణలక్ష్యము భక్తిరసమునందుఁ బ్రత్యక్షమగుచున్నది. అనన్యమైన భక్తిరసమునందు సకలరసములును నిమిడియున్నవి. శ్రీకృష్ణుని శృంగారవిలాసములు, మురళీగానము, పార్వతీపరమేశ్వరుల యఖండప్రేమ, సీతారాముల విలాసములు, పురాణేతిహాసములు, కావ్యనాటకములు, కీర్తనలు భక్తిరసావేశమును విశదము చేయుచున్నవి.

మహాదీక్షాపరాయణులు గానివారు మహాకావ్యనిర్మాణాధికారులు గాఁజాలరు. తిక్కన భారతరచనకు "శ్రీవిభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వదీక్షావిధిని" బూఁదెను. తిక్కన పూనిన యజ్ఞదీక్ష సోమయాగదీక్ష మాత్రమే కాదు ; ఆయన పూనినది మహాకవితా యజ్ఞదీక్ష. కావ్యదీక్షయు నితరయాగదీక్షలవలె నాధిభౌతికమై భోగపరమైనపుడు విషయాసక్తమై సామాన్య ప్రయోజనమును గలిగించుచున్నది. కావ్యదీక్ష యాధ్యాత్మికమైనపుడు విషయాతీతమై "భవ్యపురుషార్థ తరు పక్వఫలము" గలిగించుచున్నది. కావ్యయజ్ఞమునందు విశ్వాత్మకమైన కావ్యరసమే అధియజ్ఞము. విశ్వాత్మకమైన రసఫలమును సాధించుటకును, నిర్మించుటకును, ననుభవించుటకును సర్వసాక్షియైన ఆత్మకు సామర్థ్యము గలదుగాని దేహేంద్రియాదులకు సామర్థ్యములేదు. మహాకవిత్వ దీక్షకు ఫలమైన కావ్యరసమును బొందుటకు వలయు సాధనములను బరమేశ్వరుఁడు సాక్షాత్కరించి తిక్కనకుఁ బ్రసాదించెను. ఆత్మానందమును

బడయఁగల కావ్యరసము భగవంతుని ప్రీతికి భాజనమగుచున
ఇయ్యది వైదికమతపరమగు ప్రవర్తనమును గలిగి, చిత్తశుద్ధిఁ
డను, భావసంశుద్ధితోడను జేసెడి పరమేశ్వరభక్తిప్రభావమునఁ
గలుగుచున్నది. [విశ్వశ్రేయస్సే భగవత్సంకల్పము; కావ్యమునకుఁ
బ్రయోజనము; యజ్ఞమునకు ఫలము; పురుషార్థమునకుఁ బరిణా
మము; సకలమతములకుఁ బరమార్థము. విశ్వశ్రేయస్సున కధికారు
లుగాని కవులు, యాజకులు, మతాచార్యులు మొదలగువారు చేసెడి
ప్రయత్నములు విశ్వకల్యాణమునకును, నాత్మానందమునకును సాధ
నములు కావు.]

తిక్కన సంస్కృతాంధ్రములందు మహాపండితుఁడు; వైదిక
మత పరిణామములైన కర్మజ్ఞాన వైరాగ్య భక్తిమార్గములం దప్రతి
మానమైన ప్రజ్ఞగల పరమవేదాంతి. ఆ మహానుభావుఁడు కావ
త్మను బూని రచించిన యాంధ్రకావ్య మాంధ్రవాఙ్మయమునందు
బరంజ్యోతివలె వెలుఁగుచున్నది; ఆంధ్రరసహృదయమునందు
గాన్యరసామృతమును బ్రవహింపఁ జేయుచున్నది; ఆత్మానంద
మును గలుగఁజేయుచున్నది; విశ్వకల్యాణమునకు సాధనము
నున్నది. తిక్కనామాత్యుఁడు భక్తిమయమైన జ్ఞానరసామృతముఁ
గ్రోలి బ్రహ్మపదము నధిష్ఠించెను. పోతనామాత్యుఁడు జ్ఞానమం
మైన భక్తిరసామృతమునుగ్రోలి శ్రీకైవల్యపదము నధిష్ఠించెను
ఆంధ్రవాఙ్మయ పరిణామమునందుఁ గర్మజ్ఞానవైరాగ్య సంవర్ధితవ
లైన భక్తిసృష్టియు లుత్తమసృష్టములుగ నున్నవి.

సంస్కృత వాఙ్మయమునందు వలెనే ఆంధ్రవాఙ్మయమున
దును వాఙ్మయమునకు మతము ప్రధానవిషయముగ నున్నది. ఆ
యుగపుఁ గవులు చాలమంది మత విషయిక కావ్యములను ర
యించిరి. ముఖ్యముగఁ బురాణేతిహాస కావ్యములనో, వానియంద
భాగములనో, ఉపాఖ్యానములనో తెనిఁగించిరి. ఆదియుగము పురాణ
యుగము. అయినను తెనుఁగురచనలు కేవల మనువాదములు

గావు. కథా సందర్భములు, భావములు, వర్ణనలు, జాతీయములు, పద్యములు తెనుఁగుహృదయమున కనురూపముగ నాంధ్ర సంస్కారమును బొందినవి. భారత, భాగవత, రామాయణాది పురాణములు తెలుఁగు హృదయమునుగలిగి స్వతంత్ర రచనలుగ నున్నవి. భారతము, భాగవతము, రామాయణము, నృసింహపురాణము, ఉత్తర హరివంశము, పద్మపురాణము, మార్కండేయ పురాణము, వరాహ పురాణము, విష్ణు పురాణము మొదలగు పురాణేతిహాసములు పదునైదవ శతాబ్దాంతములోపల దెనిఁగింపఁబడినవి. దశకుమార చరిత్రము, కేయూరబాహు చరిత్రము, భోజరాజీయము, కాదంబరి, విక్రమార్క చరిత్రము మొదలగు చరిత్రములును తెనిఁగింపఁబడినవి. అథర్వణ వ్యాకరణము, కావ్యాలంకారచూడామణి, అనంత ఛందస్సు మొదలగు లక్షణగ్రంథములు, కొన్ని ప్రబంధములు, ఉపాఖ్యానములు, మాహాత్మ్యములు, శాస్త్రములు, నీతిసార ముక్తావళి, సుమతి శతకము, పంచతంత్రము మొదలగు నీతిగ్రంథములును నీయుగమునకుఁ జెందినవే. వల్లభరాయవిరచితమైన క్రీడాభిరామ మను మొదటి ఆంధ్రనాటక మీ యుగమునకుఁ జెందియున్నది. ఈయుగపు కవులందు నాచనసోముఁడు, పాల్కురికి సోమనాథుఁడు, వెన్నెలకంటి సూరన్న, పిల్లలమఱ్ఱి పినవీరన్న, శ్రీనాథుఁడు ప్రతిభాశాలులైన కవులు. ఆంధ్రవాఙ్మయపరిణామమునందాదియుగ మనువాదయుగమైనను వ్యక్తిత్వమునుగలిగి ప్రతిభగల యుగముగ నున్నది. కారణము నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, పోతనాదుల మహత్త్వము. భావికవుల కీమహాకవుల ప్రతిభయే కొంతవఱకుఁ బ్రతిబంధకమైనది. కవిత్రయము నడిచిన మార్గమే ప్రమాణమై నేఁటికిని స్వతంత్రరచనలు దూష్యములుగఁ బరిగణింపఁబడుచున్నవి.

వాఙ్మయ స్వరూపములు

ఆంధ్ర కావ్యములు సామాన్యముగ సంస్కృత కావ్యముల మార్గము ననుసరించినవి. సంస్కృత వాఙ్మయము సామాన్యముగ

గద్యపద్యాత్మకముగ నున్నది. వేదములు పద్యాత్మకములు; ఉపనిషత్తులు, పురాణములు, చంపుకావ్యములు గద్యపద్యాత్మకములుగ నున్నవి. నన్నయ తిక్కనాదికవులు సంస్కృత వాఙ్మయమార్గము ననే నడిచిరి. నన్నయ భారతరచనయందు ౧౦౦ పంక్తులలోఁ బద్య పంక్తులు ౬౪ ను, గద్యపంక్తులు ౩౬ ను, తిక్కన భారతరచనయందు ౧౦౦ పంక్తులలోఁ బద్య పంక్తులు ౬౭ ను, గద్యపంక్తులు 33 ను ఉన్నవి. తిక్కన నిర్వచనోత్తరరామాయణమును రచించినను నిది యసాధారణము. భాగవతమునందు ౧౦౦ పంక్తులలో ౬౫ పద్య పంక్తులును, 3౫ గద్యపంక్తులును గలవు. పదునేడవ శతాబ్దమునకుఁ గావ్యములందు గద్యరచన తగ్గినది. పురాణయుగమునందును, ప్రబంధ యుగమునందును జంపువులు ప్రధానములైనవి. చంపువులందు దేశికవితకు సహజమైన జాతులపద్యముల వాడుకతగ్గి వృత్తముల వాడుక హెచ్చినది. ఆదియుగమునందు సామాన్యముగఁ గవులందఱును నన్నయమార్గము నవలంబించినను ద్విపదకావ్యములను రచించిన మహాకవులును గలరు. ఆకవులందుఁ బాల్కురికి సోమనాథుఁడు, గౌరన, శ్రీనాథుఁడు, రంగనాథుఁడు సుప్రసిద్ధులు.

పండ్రెండు పదమూఁడు శతాబ్దముల వాఙ్మయము

ఆంధ్రవాఙ్మయ చరిత్రమునందును, వైదిక మతపరిణామమునందును బండ్రెండవ శతాబ్దము ప్రముఖముగ నున్నది. రాజరాజ నరేంద్రునికాలమునందుఁ బునఃప్రతిపాదితమైన కర్మమార్గమునకుఁ బండ్రెండవ శతాబ్దమునందుఁ బ్రబలమయిన ప్రతిఘటనము గలిగినది. శ్రీ రామానుజాచార్యులు, యామునాచార్యులు, దేశికాచార్యులు వైష్ణవమతమును వ్యాపింపఁజేసిరి. చోళరాజులు వైష్ణవమతమును స్వీకరించి వైష్ణవమతవ్యాపనమునకుఁ దోడ్పడిరి. వైష్ణవభక్తులు భక్తిపరమయిన విశిష్టాద్వైతమును బోధించిరి. రామానుజాచార్యులు ప్రస్థానత్రయమునకును విశిష్టాద్వైత పరమైన భాష్యములను రచియించి భక్తిమార్గ వ్యాపనమునకుఁ దోడ్పడెను. శంకరాచార్యులు రచియించిన అద్వైత పరములైన భాష్యములకును, రామానుజా

సంఖ్య	కవి పేరు	కవికాలము	గ్రంథము పేరు	గ్రంథవివరణము	విశేష విషయములు
౧	నన్నయ	౧౦౨౨-౧౦౬౩	మహాభారతము	ఇతిహాసము	
౨	తిక్కన	౧౨౩౦-౧౩౦౦	,,	,,	
	,,	,,	నిర్వచనోత్తర రామాయణము	పద్యకావ్యము	
౩	ఎఱ్ఱాప్రగడ	౧౨౮౦-౧౩౫౦	మహాభారతము, నృసింహపురాణము	ఇతిహాస పురాణములు	
౪	నన్నెచోడుడు	౧౧౫౦-౧౧౭౦	కుమారసంభవము	కావ్యము (ప్రబంధము)	
౫	పా. సోమన	౧౧౭౦-౧౨౨౦	పండితారాధ్యచరిత్రము, బసవపురాణము	,,	
౬	రంగనాథుడు	౧౨౦౦-౧౨౩౬	రంగనాథరామాయణము (ద్విపద)	ఇతిహాసము	
౭	కేతన	౧౨౫౦-౧౨౭౦	దశకుమారచరిత్రము	కావ్యము (ప్రబంధము)	
౮	బద్దెనకవి	౧౨౬౦-౧౩౦౦	నీతిశాస్త్రముక్తావళి	పద్యకావ్యము	నీతి
౯	మంచెన	౧౩౦౦-	కేయూరబాహుచరిత్రము	ప్రబంధము	
౧౦	అథర్వణాచార్యుడు	౧౨౪౦-౧౩౦౦	అథర్వణకారికలు	సూత్రగ్రంథము	వ్యాకరణము
౧౧	కాచవిభుడు, విట్టలరాజు		రంగనాథోత్తరరామాయణము (ద్విపద)	ఇతిహాసము	
౧౨	మారన	౧౨౫౦-౧౩౦౦	మార్కండేయపురాణము	పురాణము	
౧౩	విన్నకోట పెద్దన్న	౧౩౦౦-	కావ్యాలంకారచూడామణి	పద్యకావ్యము	లక్షణగ్రంథము
౧౪	చిమ్మపూడి అమరేశ్వరుడు		విక్రమసేనము	ప్రబంధము	
౧౫	హుళక్కి భాస్కరుడు	౧౨౯౫-౧౩౬౦	భాస్కరరామాయణము	ఇతిహాసము	
౧౬	నాచనసోముడు	౧౩౬౦-	ఉత్తరహరివంశము	,,	
	,,		వసంతవిలాసము	ప్రబంధము	
౧౭	వేములవాడ భీమకవి	౧౪౦౦-	కవిజనాశ్రయము [స్కంధము(భాగవతము)	పద్యకావ్యము	లక్షణగ్రంథము
౧౮	మడికిసింగన	౧౪౨౦-	వాసిష్ఠరామాయణము, పద్మపురాణము, దశమ	ఇతిహాస పురాణములు	
౧౯	జక్కయకవి	౧౪౦౬-౧౪౨౨	విక్రమార్కచరిత్రము	ప్రబంధము	
౨౦	అనంతామాత్యుడు	౧౪౩౦-	భోజరాజీయము	,,	
			రసాభరణము	అలంకారశాస్త్రము	
౨౧	రావిపాటి తిప్పన	౧౩౮౦-	చంద్రతారావళి, మదనవిజయము	,,	
౨౨	వి. వల్లభరాయుడు	౧౪౨౦-	అంబికాశతకము		

వైదికమతమైన కర్మమార్గము నవలంబించినను గాలక్రమమున భక్తిమార్గము ప్రధానమైనది. శైవము ప్రాచీన వైదికమార్గమునఁ గర్మలను, వర్ణాచారములను ఆశ్రయించుచు వృద్ధిని బొందినది. లింగధారణశైవము శైవముతోపాటు లింగధారణమును ప్రధానముగ స్వీకరించినది. వీరశైవము కర్మసంస్కారములను, జాతిభేదమును నిరసించుచు లింగధారణదీక్షను శాసించినది. వీరశైవమునకు లింగధారణము బీజము; లింగభక్తి శక్తి; గురులింగ జంగమ ప్రసాదము కీలకము. జైనబౌద్ధమతములు కర్మసన్న్యాసమును, జీవయాత్రయందు వైరాగ్యమును వ్యాపింపఁజేసినవి. భక్తికిఁ, బ్రజాగౌరవమునకు కాషాయాంబరములు చిహ్నములైనవి. భిక్షాటనము పూజ్యమైన వృత్తియైనది. గృహస్థాశ్రమమునందు విరక్తి ప్రబలినది. ప్రజలు నిరాశ్రయులైరి. సంఘశక్తి క్షీణించినది. వేదాంతమును సిమార్గమునే యవలంబించినది. వైదికమతప్రోక్తమైన కర్మానుష్ఠానము ప్రజాసామాన్యమునకు స్వధర్మనిర్వహణమునకు నిరుపయోగమైనది. భగవద్భక్తిని సార్థకము చేయుటకు మానవసేవ యవసరమైనది. వీరశైవము నిత్యజంగమార్చనలందు ఆత్మానందమును, శివానందమును, విశ్వకల్యాణమును సాధ్యముచేసి వైదికమత పరిణామమును భక్తిమార్గరూపమున విస్తరింపఁజేసినది. వీరశైవ ప్రభావము పండ్రెండు పదుమూఁడు శతాబ్దములందలి ఆంధ్రవాఙ్మయమునందు గోచరమగుచున్నది. ముఖ్యముగ ద్విపదకావ్యములందును, శతకములందును, పాటలందును, కీర్తనలందును వీరశైవప్రాబల్యము గోచరమగుచున్నది. తిక్కన భారతమునందును, పోతన భాగవతమునందును పండ్రెండవ శతాబ్దమునందుఁ బ్రబలిన భక్తిమార్గ ప్రాభవము వారి భావములందును, భాషయందును, రచనలయందును వ్యక్తమగుచున్నది.

తెనుఁగుస్వరూపము : ద్విపదకావ్యములు

ఆంధ్రవాఙ్మయస్రవంతి రెండు ప్రధానములైన మహాప్రవాహములను గలిగి శోభిలుచున్నది. ఒకటి సంస్కృతసంస్కార ప్రవా

హము. రెండవది తెనుఁగు సంస్కార ప్రవాహము. ఈమహాస్రవంతి యందింకను నెన్నియో నదీనదములు సంగమించి జీవనమహత్త్వమును వృద్ధిచేసినను సంస్కృతాంధ్రప్రవాహములు మాత్రమే ప్రధానములుగ నున్నవి. జీవనది కాధారభూతములైన రెండు ప్రవాహములందును మూలప్రవాహమును నిర్ణయించుట దుర్లభము. సంస్కృతవాహిని హిమసంజాతమైన నిర్మలజలపూరితమై ఋతుధర్మము ననుసరించుచుఁ బ్రవహించుచున్నది. తెలుఁగు వాహిని నిర్ఝరసంజాతమైన సంకుల జలపూరితమై కాలధర్మము ననుసరించుచుఁ బ్రవహించుచున్నది. రెండువాహినులును గలిసి అన్యోన్యాశ్రయమును గలిగి ఆంధ్రస్రవంతీరూపమును బొంది ప్రవహించుచున్నను సంగమమునకుఁ బూర్వమును, సంగమానంతరమును బ్రత్యేకముగఁ బ్రబలిన ఘట్టములు సంభవించినవి. రెండువాహినులు నిండినపుడును, రెండు వాహినులు ఎండినపుడును, ఒకటి యెండి రెండవది నిండినపుడును ఆంధ్రవాఙ్మయ స్రవంతియందు రసప్రవాహము, రసశోషణము గలుగుచున్నవి. ఇందులకుఁ గారణములు వాహినుల ప్రవృత్తులందే కలవు. ఒకటి పురాతనము, రెండవది నవీనము; ఒకటి వేదోక్తమైన కర్మపరము, రెండవది భాగవతాయత్తమైన భక్తిపరము; ఒకటి గ్రంథస్థము, రెండవది ముఖస్థము ; ఒకటి బ్రాహ్మణసాహిత్య సంవర్ధితము, రెండవది ప్రజాసాహిత్య సంవర్ధితము.

రెండు ప్రవాహములును ఆంధ్రముద్రాంకితములై కలిసి తెనుఁగువాఙ్మయ ప్రవాహమునం దైక్యమును బొందినను రెంటికిని ప్రత్యేక లక్ష్యలక్షణములు గోచరమగుచున్నవి. ఒక వాహిని కూలంకషముగ వెల్లువలైపాఱుచున్నప్పుడు రెండవ వాహిని తగ్గియుండుట ప్రకృతిధర్మము. కాని వెల్లువ తగ్గిపోయిన తరువాత రెండు వాహినులు కలిసి యథాప్రకారము పాఱునపుడు రెండు వాహినులకుఁ గల యన్యోన్యాశ్రయము విశదమగుచున్నది.

ఆంధ్రవాఙ్మయస్రవంతి యుపనదుల సంగమమువలన స్వరూపస్వభావములందు మార్పులను బొందుచున్నను నాంధ్రవాఙ్మయ

ప్రవాహము జీవనదియై ప్రవహించుచున్నది. దేశకాలపాత్రల ననుసరించి వాఙ్మయ స్రవంతి విశాలమైనను సంకుచితమైనను, నిర్మలమైనను కలుషితమైనను, పర్వతములందు ప్రవహించినను బయళ్ళయందుఁ బాఱినను తెలుఁగు స్వభావము, తెలుఁగు స్వరూపము సర్వత్ర గనుపడుచుండును.

పదునొకండవ శతాబ్దమునందు నన్నయ భారత మాంధ్రవాఙ్మయమునందు సంస్కృత వాహినిని గూలంకషముగఁ బ్రవహింపఁజేసిన విధ మిదివఱకే సందర్భానుసారముగఁ దెలుపఁబడినది. నన్నయభారతము దలపెట్టిన వైదికమతవ్యాపనమునకును, సంస్కృత సంస్కార ప్రాబల్యమునకును వెంటనే ప్రతిరోధము గలిగినది. శైవ వైష్ణవమతములు వ్యాపించినవి. మహాభక్తులు, నాయనారులు, ఆళ్వారులు ప్రజాహృదయము నాకర్షించిరి. ప్రజలకు భక్తిమార్గము నుపదేశించుటకు జానుదెనుఁ గావలసినదైనది. పండ్రెండు పదుమూఁడు శతాబ్దములందుఁ బుట్టిన వాఙ్మయము ప్రజల మేలుకొలుపును దెలుపుచున్నది. ఈ కాలపు వాఙ్మయము భావమునందును, రూపమునందును, లక్ష్యమునందును దెనుఁగుహృదయమును దెలుపుచున్నది. నన్నయవిరచితమైన భారతభాగము ౧౦౬౩ ప్రాంతములందు ముగిసినది. నన్నెచోడుఁడు ౧౧౫౦-౧౧౭౦ నడుమఁ గుమారసంభవమును రచించెను. పాల్కుర్కి సోమనాథుఁడు ౧౧౭౦-౧౨౨౦ నడుమ బసవపురాణమును, బండితారాధ్యచరిత్రమును జానుదెనుఁగున ద్విపదయందు రచించెను. రంగనాథరామాయణము, లేక బుద్ధరామాయణము ద్విపదయందు ౧౨౦౦-౧౨౭౮ నడుమ వ్రాయఁబడినది.

నన్నెచోడుఁడు క్షత్రియుఁడు. ఆయన కాళిదాసకృతమైన కుమారసంభవమునే కాక ఉద్భటకవికృతమైన కుమారసంభవమును గూడ మాతృకనుగఁ గైకొనెను. నన్నెచోడుఁడు తన కుమారసంభవమును జంగమ మల్లికార్జున యోగి కంకితముచేసెను. ఆయనకుఁ గల గాఢమైన శైవభక్తిని గుమారసంభవము దెలుపుచున్నది.

గీ. మఱువ జంగమమల్లయఁ దగిలి చూచి-యంద కన్నులు మనమును నంటియున్న
నచలభావన నిల్చెఁ దానట్ల పరము-నభవుఁగని జను లచలాత్ము లగుట యరుదె ?

సోమనాథుఁడు బసవపురాణమునం దఖండముగ వర్ణించిన గురులింగ జంగమభక్తినే నన్నెచోడుఁడును నీపద్యమునందు సువ్యక్తము చేసెను. ఈ కవి తన కావ్యములందుఁ దెనుఁగుమాటల నధికముగ వాడియుండెను. దేశికవితఁ బుట్టించి తెనుఁగును నిలుపుటయం దీకవి కత్యంతాదరము గలదు. ఈయన సంస్కృతకవులను స్తుతించి తెలుఁగుకవుల పేరే ఎత్తలేదు. ఈ సందర్భములన్నియు వైదిక మత ప్రతిఘటనమునకును, దెనుఁగు ప్రీతికిని, శివభక్తి పరత్వమునకును, ఆంధ్రవాఙ్మయ వికాసమునకును నిదర్శనములుగ నున్నవి.

సోమనాథకృతములైన బసవపురాణమును, పండితారాధ్య చరిత్రమును నీసందర్భములను బోధించుచున్నవి. సోమనాథుఁడు బ్రాహ్మణ్యమును విడిచి వీరశైవమును స్వీకరించెను. ఆయన శివ కవులనుమాత్రమే ప్రశంసించెను. సోమనాథుఁడు బసవపురాణమును, పండితారాధ్య చరిత్రమును తేటతెనుఁగున ద్విపదయందు రచియించెను.

ఆరూఢ గద్యపద్యాది ప్రబంధ-పూరిత సంస్కృతభూయిష్ఠరచన
మానుగా సర్వసామాన్యంబు గామిఁ-జానుఁ దెనుఁగు విశేషము ప్రసన్నతను.
(పండితారాధ్య చరిత్రము)

ఉరుతర గద్య పద్యోక్తులకంటె-సరసమై పరగిన జానుఁదెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ - గూర్చెద ద్విపదలు గోర్కి దైవాఱఁ
దెలుఁగుమాట లనంగవలదు ; వేదముల-కొలఁదియ కాఁజూడుఁ డిల నెట్టు లనినఁ
బాటి తూమునకును బాటి యానేనిఁ - బాటింప సోలయుఁ బాటియకాదె.

అల్పాక్షరముల ననల్పార్థరచన-కల్పించుటయ కాదె కవివివేకంబు
అలరుచు బసవనిఁ దలఁచు తలంపు-బలుపునఁగాఁజేసి భావమ్ము మెఱసి
యకలంక లింగ రహస్యసిద్ధాంత-సకల వేద పురాణ సమ్మతంబైన
యాతత బసవపురాతనభక్త-గీతార్థసమితియే మాతృక గాఁగఁ
బూరితంబై యొప్పు ప్రాసలలోన-దారంబుక్రియఁ బురాతన భక్తవితతి.
(బసవ పురాణము)

సోమనాథుఁడు నన్నయ ప్రారంభించిన సంస్కృత మార్గకవిత్వమును విడిచి దేశీయ కవిత్వమార్గమును సంపూర్ణముగ నవలంబించెను. గద్యపద్యాది సంస్కృత భూయిష్ఠమైన కావ్యరచనలు సర్వసామాన్యముగాఁ దెలియవనియు, జానుఁదెనుఁగు ప్రసన్నతకు సాధనమనియు సోమనాథుఁడు ద్విపదరచనకుఁ గారణమును దెలియఁజేసెను. సోమనాథుఁడు తన కావ్యములందుఁ దెనుఁగుమాటలను విచ్చలవిడిగ వాడి తెలుఁగుసొంపును బాడెను. సోమనాథుని ద్విపదలు తెనుఁగువాహినీసౌందర్యమును దెలుపుచున్నవి. సోమనాథుఁడు ద్విపదరచనయందును నూతనమార్గము నవలంబించెను. ఆ కాలమునందుఁ గర్ణాటకవాఙ్మయ వ్యాపనమునం దున్న వచనములు, రగడలు, త్రిపదులు, షట్పదులు సోమనాథుని ద్విపదరచనలకుఁ బ్రోత్సాహ మొసఁగియుండును.

కర్ణాటక వాఙ్మయమునందును బండ్రెండవ శతాబ్దాంతమునందుఁ జంపూరచనలను, సంస్కృతవృత్తములను వీరశైవకవులు నిరసించి దేశీయరచనలకుఁ బూనుకొనిరి. రైసుగారును, నరసింహాచార్యులుగారును గన్నడ వాఙ్మయచరిత్రమునం దీవిషయమును సువ్యక్తము చేసిరి. ఆంధ్ర కర్ణాటదేశముల కూడలియందు నివసించిన సోమనాథుఁడు వీరశైవమతవ్యాపనమునకుఁ గర్ణాటకకవుల మార్గము నవలంబించుటయు సహజము. కావ్యరసానందమును జనులందఱు ననుభవించుటకు మాటలు, తలఁపులు వారికిఁ దెలిసినవై యుండవలయును. బసవపురాణమును, బండితారాధ్యచరిత్రమును వైదికమత భక్తినిఁ బ్రతిపాదించినను ప్రజల కనుభవసిద్ధమైన భక్తిమార్గమును జానుతెనుఁగున నుపదేశించినవి. వీరశైవ బృందావనమునందు గురులింగజంగమ రూపమున సర్వసమానత్వమును బోధించినవి.

వేదంబు లాదియో విధికల్పితంబు-లాదియో జాతుల కడి యెట్లు లనినఁ
జను వేదచోదితజాతులు రెండు-వినుము ప్రవర్తకంబును నివర్తకము
భవకర్మసంస్కారి భువిఁ బ్రవర్తకుఁడు-శివకర్మసంస్కారి భువి నివర్తకుఁడు
సన్నుత వేదార్థచరితంబు లుండ - మొన్నఁ బుట్టిన కులమ్ముల మాట లేల

స్రష్టృసిక్త మసువట్టి జాతులు గావె - యష్టాదశంబులు నవి యేల చెప్ప
మిక్కిలి పదునెనిమిదివర్ణములకు - నిక్కమారయ భక్తనిచయంబు కులము
భాగ్యహీనుండు దాఁ బసిఁడిఁ బట్టిన న - యోగ్యంపులోష్టమై యున్నట్లు శివుని
ప్రతిబింబమూర్తి యా భక్తుఁడు భవికి - మతిఁ జూడ మానవాకృతి నుండు ధరణిఁ
గావున శివభక్తగణముల మహిమ - భావింపఁ దలఁప నీప్రాప్తియే చెపుము.

(బసవ పురాణము)

ఆంధ్రవాఙ్మయమునం దాదియుగమునందు నన్నయ యస్ఫుటముగఁ దెలిపిన "తెనుఁగు రచనయును, భక్తిమార్గమును" పండ్రెండవ శతాబ్దాంతమున ద్విపదకావ్యములయందు పరిస్ఫుటమైన విధము నా కాలపు వాఙ్మయము విశదముచేయుచున్నది. పదుమూఁడవ శతాబ్దాంతమునందు భారతరచనను బూరించిన తిక్కనసోమయాజి పండ్రెండు పదుమూఁడు శతాబ్దములందుఁ బరిస్ఫుటమైన తెనుఁగు వాహిని నాదరించి రెండువాహినుల సంయోగమును జేసినవిధమును తిక్కన కవిత్వ మహత్త్వము విశదముచేయుచున్నది.

పండ్రెండవ శతాబ్దమునందుఁ బ్రజాహృదయమునఁ బ్రబలిన భక్తిమార్గము తెనుఁగు వాహినికి పోషణమును గలుగఁ జేసినది. ఆ పోషణమే తిక్కన రచించిన భారతమునందుఁ బ్రత్యక్షమగుచున్నది. తిక్కన రచించిన భారతమునం దాంధ్రస్వరూపము భాషయందును, భావములందును, రూపములందును హృద్యముగఁ బ్రత్యక్షమగుచున్నది. పదునైదవ శతాబ్దారంభమునందు భాగవతమును రచించిన పోతనామాత్యుఁడు రెండువాహినులను గలిపి గంభీరమైన భాగవతప్రవాహమును విస్తరించి ఆంధ్రవాఙ్మయమునందుఁ దెలుఁగు మహిమను, భక్తిప్రభావమును మేళగించి కావ్యరసానందమును వ్యక్తము చేసెను. పదునైదవ శతాబ్దమునందు గౌరనమంత్రి హరిశ్చంద్రోపాఖ్యానమును, నవనాథచరిత్రమును, శ్రీనాథుఁడు పల్నాటి వీరచరిత్రమును ద్విపదయందు హృద్యముగ రచించి ఆంధ్ర వాఙ్మయ స్వభావమును, ద్విపదకావ్యముల ప్రతిష్ఠను గాపాడిరి.

ఆంధ్రవాఙ్మయ చరిత్రయందు ఆదియుగము ఆంధ్రభాగవత రచనతో నంతమందుచున్నది. ఆదియుగము వైదికమార్గయుగము; అనువాదయుగము; సంస్కృతమార్గయుగము; పండితయుగము; పురాణయుగము. ఆ యుగమునందు కర్మమార్గమునకును భక్తిమార్గమునకును, సంస్కృతకావ్యములకును తెలుఁగుకబ్బములకును, పురాణేతిహాసములకును చంపువులకును, పండితులకును ప్రజలకును సంరంభసాహచర్యములు ప్రబలుచు ఆంధ్రవాఙ్మయస్వరూపస్వభావములు పరిస్ఫుటములైనవి. నన్నయ్య సంస్కృతసాహిత్యమున కాంధ్రసంస్కారము చేసి ఆంధ్రసాహిత్యనిర్మాణమున కుపక్రమించెను. తిక్కన దేశీయసాహిత్యమునకు సంస్కృతసంస్కారము చేసి ఆంధ్రసాహిత్యస్వరూపమును బరిస్ఫుటముచేసెను. పోతన సంస్కృతాంధ్రసాహిత్యములను మేళవించి ఆంధ్రసాహిత్యస్వరూప స్వభావములను బండితపామరహృదయములకు సుగ్రహము చేసెను. నన్నయ ప్రారంభించిన సంస్కృతవాహిని పోతనహస్తములందుఁ దెలుఁగువాహిని అయినది. భారతము ప్రతిపాదించిన కర్మమార్గము భాగవతమునందు భక్తిస్వరూపమును దాల్చినది. భారత ముద్ధరించిన సంస్కృతపాండిత్యము భాగవతమునందుఁ బండితపామరులకు గ్రాహ్య మయిన తెలుఁగు స్వరూపమును దాల్చినది. ఆంధ్రమహాభాగవతమునకుఁగల ప్రజాదరణ మీవిషయమును సువ్యక్తము చేయుచున్నది.

ఆంధ్ర మహాభాగవతము

బమ్మెర పోతరాజు భాగవతమును మహాకావ్యలక్ష్యముతో రచించెను. పోతన త్రిలింగదేశస్థమైన బమ్మెరయందు జననమొందెను. బమ్మెర నిజామురాష్ట్రమునందలి ఓరుగల్లు ప్రాంతములందుఁ గలదు. సుప్రసిద్ధమైన ఏకశిలానగరమే ఓరుగల్లు నామమున వన్నెకెక్కినది. పోతరాజుకాలమును నిర్ణయించుటయందు భేదాభిప్రాయములు గలవు. పోతరాజు పదునైదవ శతాబ్దారంభమున భాగవతమును రచించియుండును. పోతరాజు సహజపాండిత్యసంపన్నుఁ డను ప్రతీతి గలదు. భాగవతరచన యీప్రతీతికిఁ దగియున్నది. గ్రంథ

పాఠము, గ్రంథపూరణము మొదలగు విషయముల విమర్శనలు ప్రస్తుతసందర్భములం దసాధ్యములు. పోతరాజామాత్యుని స్వతంత్ర ప్రవృత్తి నీపద్యము వెల్లడిచేయుచున్నది:

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని చొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెటవ్రేటులం బడక సమ్మతితో హరి కిచ్చి చెప్పె నీ
బమ్మెరపోతరా జొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్.

కృతిపతినిర్ణయమునందు పోతరాజు దెలిపిన భావము లా మహానుభావుని యుదారసంకల్పమును విశదము చేయుచున్నవి.

పోతరాజు (శ్రీ)కైవల్యపదంబుఁ జేరుటకునై భాగవతమును (శ్రీ)రామభద్రున కంకితముచేసి జగద్ధితంబుగ రచియించి పరమార్థమును బడసెను. పోతరాజు సంస్కృతాంధ్రవాహినుల నాంధ్రవాహినీస్వరూపమున భాగవతమునందుఁ బ్రవహింపఁజేసి ఆంధ్రవాఙ్మయ హృదయమును భావరూపములందుఁ బరిస్ఫుటము చేసెను.

క. కొందఱకుఁ దెనుఁగు గుణమగుఁ - గొందఱకును సంస్కృతంబు గుణ మగు రెండుం
గొందఱకు గుణములగు నే - నందఱ మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్.

పోతన భాగవతరచనయందు సంస్కృతపదముల నధికముగ వాడినను సంస్కృతపదజాలమున కాంధ్రసంస్కారమును జేసి తెలుఁగునం దైక్యమును బొందించెను.) ఈ నైక్య మాంధ్రభాషామాధుర్యమును, నాంధ్రభాషాతత్త్వమును బరిస్ఫుటముచేసినది. తెనుఁగు బాసకు సహజమైన తియ్యఁదనము పోతరాజ త్యాగరాజరచనలందు మనోహరముగ గోచరమగుచున్నది. భాగవతమునందలి పద్యములు కర్ణరసాయనములై పరమాహ్లాదమును గలుగఁజేయుచున్నవి. భాగవతరచనయం దాంధ్రహృదయము భాషయందును, భావమునందును, శైలియందును గోచరమగుచున్నది.

పదలాలిత్యము, భావలాలిత్యము భాగవతమునం దేకస్థాయిని బొంది ఆంధ్రసాహిత్య స్వరూపహృదయమును విశదముచేయుచు

న్నవి. సంస్కృతాంధ్రపదములు, భక్తిజ్ఞానమార్గములు, భాగవత మునం దేకస్థాయిని బొంది కావ్యమునకు పరమప్రయోజనమైన యానందమును ప్రత్యక్షము చేయుచున్నవి. వైదికమంత్రప్రతిపాదిత మైన కర్మమార్గము భాగవతమునందు భక్తిస్వరూపమును దాల్చి నది. వేదవ్యాసుఁడు పంచమవేద మనఁబరఁగు భారతమును రచిం చియును మనశ్శాంతిని బొందలేదు.

సీ. వ్రతధారి నై వేదవహ్నిగురుశ్రేణి మన్నించితి విహితకర్మములఁ గొఱఁత
వడకుండ నడుపుదు భారతమిషమునఁ బలికితి వేదార్థభావ మెల్ల
మునుకొని స్త్రీశూద్రముఖ్యధర్మము లందుఁ దెలిపితి నేఁ జెల్ల దీనఁ జేసి
యాత్మ సంతోష మంద దాత్మలో నీశుండు సంతసింపకయున్న జాడ దోఁచె

ఆ. హరికి యోగివరుల కభిలషితంబైన-భాగవతవిధంబుఁ బలుక నైతి
మోస మయ్యెఁ దెలివి మొనయదు మఱచితి-ననుచు వగచుచున్న యవసరమున.

మనశ్శాంతి లేక వగచుచున్న వేదవ్యాసునకు నారదుఁడు చేసిన హితోపదేశము, భాగవతకావ్యప్రయోజనమును విశదము చేయుచున్నది.

ఉ. అంచితమైన ధర్మచయ మంతయుఁ జెప్పితి వందులోన నిం
చించుక గాని విష్ణుకథ లేర్పడఁ జెప్పవు ధర్మముల్ ప్రపం
చించిన మెచ్చునే గుణవిశేషము లెన్నినఁ గాక నీకు నీ.
కొంచెము వచ్చు టెల్ల హరిఁ గోరి నుతింపమి నార్యపూజితా.

మ. హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజహంసావళీ
సురుచిభ్రాజితమైన మానససరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ
హరినామస్తుతి లేనికావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ
కరమై యుండ దయోగ్యకర్మలినవత్కాకోలగర్తాకృతిన్.

మ. అపశబ్దంబులఁ గూడియున్ హరిచరిత్రాలాపముల్ సర్వపా
పపరిత్యాగము సేయుఁ గావున హరిన్ భావించుచుం బాడుచున్
జపముల్ సేయుచు వీనులన్ వినుచు నశ్రాంతంబుఁ గీర్తించుచుం
దపసుల్ సాధులు ధన్యులౌదురు గదా తత్త్వజ్ఞ చింతింపుమా.

నారదుని యుపదేశము ననుసరించి వేదవ్యాసుఁడు భాగవతమును రచించి మోక్షమును బొందినవిధమునఁ బోతరాజు శ్రీరామభద్రుని యాదేశము ననుసరించి భాగవతమును రచించి పునర్జన్మము లేకుండఁ దన జన్మమును సఫలము చేసికొనెను. మానవులు సంసారచక్రమునందుఁ గర్మపరతంత్రులై పరిభ్రమణము చేయుచున్నను భక్తిమార్గముల మోక్షమును బొందఁగల విధమును భాగవతము విశదముచేయుచున్నది.

క. విను మీసంసారం బను-వననిధిలో మునిఁగి కర్మవాంఛలచే వే
దనఁ బొందెడువానికి వి-ష్ణుని గుణవర్ణనము తెప్ప సుమ్ము మునీంద్రా!

చ. యమనియమాదియోగముల నాత్మ నియంత్రిత మయ్యుఁ గామరో
షములఁ బ్రచోదితంబ యగు శాంతి వహింపదు విష్ణుసేవచేఁ
గ్రమమున శాంతి గైకొనిన కైవడి నాదు శరీరజన్మక
ర్మములరహస్య మెల్ల మునిమండన చెప్పితి నీవు కోరినన్.

క. నిగమములు వేయుఁ జదివిన-సుగమంబులు గావు ముక్తిసుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను-నిగమంబుఁ బఠింప ముక్తినివసనము బుధా.

ఆంధ్రసాహిత్యరచన పురాణయుగమునందు భాగవతరచనయందుఁ బరిపక్వము నొందినది. ఆంధ్రభాగవతమునకు సంస్కృత భాగవతము మాతృకయైనను వర్ణనలు, పద్యములు, శైలి, భావములు ప్రజాదరణమునకుఁ బాత్రమైన తెనుఁగుస్వభావస్వరూపములను దాల్చినవి. సరళమైన పోతనరచన సరళమైన ఆంధ్రహృదయమును విశదముచేయుచున్నది. భాగవతమునందుఁ గల శబ్దాలంకారములును, అంత్యప్రాసలును తెలుఁగుబాసకు సహజాలంకారములు. ఆంధ్రభారతి కిట్టి సహజాలంకారములను సమకూర్చిన కవులయందు పోతనామాత్యుఁ డగ్రగణ్యుఁడు. భాగవతభక్తిపారవశ్యమును, కావ్యరసానందమును గలుగఁజేయుటయందుఁ బోతనామాత్యుని ప్రతిభ యసామాన్యము. గజేంద్రమోక్షము, రుక్మిణీకల్యాణము, ప్రహ్లాదచరిత్రము మున్నగు ఘట్టముల కాంధ్రసాహిత్యమునందుఁ గల యాదరణము పోతనామాత్యుని ప్రతిభను విశదముచేయుచున్నది. భాగవత

రచన సహజమై, రసవంతమై, భాగవతభక్తిభరితమై ఆంధ్రహృదయ స్వరూపమును సర్వత్ర ప్రత్యక్షము చేయుచున్నది.

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచల మైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.

ఆంధ్ర వాఙ్మయపరిణామమున భారత రచనయందు నన్నయ యవలంబించిన సంస్కృతమార్గము భాగవతరచనమున పోతనరచన యందు దేశిరూపమును బొందినది. వైదిక కర్మమార్గము భక్తిరూపమును దాల్చినది; రాజావలంబన మాత్మావలంబనరూపమును దాల్చినది; పండితాశ్రయము ప్రజాశ్రయపరమైనది. కావ్యమునకుఁ బరమప్రయోజనమైన విశ్వశ్రేయస్సు సార్థకమైనది. జీవయాత్రను, విశ్వశ్రేయస్సును సార్థకము చేయుటకు సాధనములైన నిర్గుణసగుణోపాసనలు భాగవతమునందు సమన్వయమును బొందినవి. సంసార యాత్రకు సహజములైన శృంగారవైరాగ్యములు, సుఖదుఃఖములు, కలిమిలేములు, నిరహంకార దురహంకారములు భాగవత భక్తియందు సమన్వయమును బొందఁగలవిధమును పోతనామాత్యుఁడు భాగవతఘట్టములందు దివ్యతమముగ వినిర్మించి కైవల్యమార్గము ననుగ్రహించెను.

పురాణయుగకవులందు నాచనసోముఁడు, భాస్కరకవులు, మడికి సింగన, పిల్లలమఱ్ఱి పినవీరన మొదలగు కవు లాంధ్రవాఙ్మయ నిర్మాతలందుఁ బ్రముఖులు. పదునాల్గవ శతాబ్దారంభమునందు నివసించిన నాచనసోముఁ డాంధ్రవాఙ్మయమునకు సహజమైన స్వరూప స్వభావములను గల్పించిన కవిబృందమునకుఁ జెందిన మహానుభావుఁడు. కవిబ్రహ్మ తిక్కనసోమయాజివలె నీమహాకవి యాంధ్రవాఙ్మయమునకుఁ గళాన్యాసము చేసి మూర్తిమంతముచేసెను. వాఙ్మయం దున్న తెలుఁగుభాష కంగన్యాస హృదయన్యాసములను జేసి

కళాస్వరూపమును ప్రతిపాదించిన మహాకవి ఇతఁడు. వాడుకయం దున్న తెలుఁగు సాహిత్యమునకుఁ గావ్యసంస్కారము చేసి ఆంధ్ర సాహిత్యవాహినిని వీర్యవంతము చేసిన సోమనాథకవీంద్రుని ప్రతిభ ఆంధ్రవాఙ్మయ ప్రవాహమునం దఖండముగ వెలుఁగుచున్నది. ఆంధ్రవాఙ్మయమునందు సంస్కృతాంధ్ర సాహిత్యముల సంయోగ మును దిక్కన సోమయాజివలెనే సోమనాథుఁడును నిరూపమానము గఁ జేసి ఆంధ్రసాహిత్యహృదయమును విస్పష్టము చేసెను. ఉత్తర హరివంశము సోముని ప్రతిభను విశదముచేయుచున్నది.

చ. లలన లతావితానముల లత్తుకకెంపులచాయ చల్లు చే
తుల సెలగొమ్మ లందికొనఁ దోరపుఁబువ్వులు పిక్కటిల్ల సె
జ్జ్వెలులు కెలంగి మావిరుల కెందొవ లయ్యె ననం దనంబునన్
దలిరులఁ గోయు రాచిలుక దాఁటులుఁ దేఁటులు నాసచేయఁగన్.

చ. నవుక తెలుంగు మాటజతనంబు నవాంగవిలాసముల్ ముసుం
గిడిన తెలుంగు ముద్దుమొగ మించుక వంచిన సిగ్గుఁ బార్వతిం
దపఁబటుపంగ నొప్పెసఁగె దర్పకవైరికి నాసపాటుగా
నడరుచుఁ జిత్రరేఖ యను నచ్చర నెచ్చెలు లిచ్చ మెచ్చఁగన్.

చ. తిరిసిఁ కూడు దెచ్చి నలుదిక్కుల బోసలు తింపి పెట్టఁగాఁ
బెరిఁగిన పొట్టతోడ నొక పీటపయిం దొరవోలె నెవ్వరిన్
సరకుగొనండు పట్టుకొని చాఁగఁ బగొన్న బలే యెలుంగుఁ డ
క్కరిబలు మోపు మోచు నయగారితనం బఱ నట్టి గట్టెఁనన్.

(హరివంశము)

ఉ. ఈ కొఱగాని కార్య మిటు లెవ్వఁ డొకో యనుకూలశత్రుఁడై
నీకుఁ బ్రియంబు గాఁ బలికె నీవును నిత్తెఱఁ గాచరింపఁగా
రాక తలంచి మాడ నిది రాక్షసవంశవినాశకాలమో
కాక కటుగాన నీకొనునె కాదన కీదృశ మెవ్వఁ డేనియున్.

(భాస్కరుఁడు)

చ. చనదు మహద్విరోధ మని చక్కటి చెప్పిన నింతతప్పనన్ ?
గనలితి ! నీతిశూన్యులకుఁ గార్యము లేటికిఁ దోఁచు ? నిప్పు కే

యును బలిలేదు ; నీవలన నొప్పని నావచనంబు లెల్ల నీ
వనిమొన రాముచేఁ బడినయప్పుడె తెలెంగెదు గాక పోయెదన్.

(హుళక్కి భాస్కరుఁడు)

పురాణయుగము పోతనతో నంతము నొందినను శ్రీనాథునితో నీయుగము సహజముగ ముగియుచున్నది. శ్రీనాథుఁడు పదునైదవ శతాబ్దారంభమునందు నివసించియున్నటులు విమర్శకులు నిర్ణయించుచున్నారు. శ్రీనాథుఁడు పోతనసమకాలికుఁడనియు, బావమఱఁది యనియు గాథలు గలవు. శ్రీనాథుఁడు సరస్వతీప్రసన్నుఁడయ్యును లక్ష్మీప్రసాదమునకై తన కృతులను విక్రయముచేసెను. పోతన శ్రీనాథునకుఁ గావ్యరచనయందుఁ గల పరమప్రయోజనమున లక్ష్యభేదము క్రింది పోతనకృతమైన పద్యమును, శ్రీనాథకృతమైన పద్యమును విస్పష్టము చేయుచున్నవి:

ఉ. బాలరసాలసాల నవపల్లవ కోమలకావ్యకన్యకం
గూళల కిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతరసీమలఁ గందమూలకౌ
ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై.

(పోతన)

సీ. దీనారటంకాలఁ దీర్థ మాడించితి దక్షిణాధీశు ముత్యాలశాలఁ
బలుకుఁ దోడై తాంధ్రభాషామహాకావ్య నైషధగ్రంథసందర్భమునకుఁ
బగులఁ గొట్టించి యుద్భటవివాదప్రౌఢి గౌడడిండిమభట్టు కంచుఢక్కఁ
జంద్రభూషక్రియాశక్తిరాయలయొద్దఁ బాదుకొల్పితి సార్వభౌమబిరుద

తే. ఎటులు మెప్పించెదో నన్ను నింకమీఁద - రావుసింగమహీపాలు దీవిశాలు
నిండుఁగొలువున నెలకొనియుండి నీవు - సరససద్గుణనికురుంబ శారదాంబ.

(శ్రీనాథుఁడు)

శ్రీనాథుఁడు సంస్కృతాంధ్రములం దఖండమైన పాండిత్యము గల మహాకవి. ఆయన రచించిన శివరాత్రిమాహాత్మ్యము, శృంగార నైషధము, కాశీఖండము, పల్నాటి వీరచరిత్రము, భీమేశ్వరపురాణము, వీథినాటకము, హరవిలాసము శ్రీనాథుని

ప్రతిభాపాండిత్యములను వెల్లడిచేయుచున్నవి. "నైషధం విద్వ దౌషధం" అను పండితాభిప్రాయము శ్రీనాథుని పాండిత్య ప్రకర్షను చాటుచున్నది. ఆంధ్రవాఙ్మయమునందు సంస్కృత వాహిని నత్యద్భుతముగ ప్రవహింపఁజేసిన కవులందు శ్రీనాథుఁడు ప్రముఖుఁడు. శ్రీనాథుని శైలి సంస్కృతపదభూయిష్ఠమైనను సరళమై, సుబోధమై ప్రజాదరణమును బడయుచున్నది. శ్రీనాథుఁ డాంధ్రవాఙ్మయమునం దాంధ్రకళాన్యాసమును జేసిన స్వతంత్రకవి. శ్రీనాథుఁడు తన పల్నాటి వీరచరిత్రమునందు దేశీయఛందస్సును, దేశీయగాథలను, దేశీయసాహిత్యమును నుపయోగించి ఆంధ్రవాఙ్మయమునందు స్వతంత్ర కావ్యరచనలకు మార్గదర్శకుఁడయ్యెను. వీథి నాటకమునందు హాస్యరస మసహ్యముగ నుండుటవలననే వీథి నాటకమైనది. శ్రీనాథుఁడు రాజానుగ్రహమును, ప్రజాదరణమును బడసిన మహాకవి. శ్రీనాథుని ప్రజ్ఞాపాండిత్యము లాంధ్రసాహిత్య బృందావనమునందుఁ దేజోవంతములై విరాజిల్లుచున్నవిధము నాతని పలువిధములైన రచనలు విశదము చేయుచున్నవి.

సీ. శిశిరమూఁ రసన్య చిఱుబంతిపసు పాడు నెందు సాయంకాల మింపెసర్వ
నరుఁ డొందు జలము నుద్ధరణంబు సేవించి శంభులింగముఁ దాల్చు జఠరపిఠరి
వినువీథిఁ బోరాడి వివశంబు లై కూలి హంసంబు లయ్యెఁ వాయసము లెందుఁ
బ్రవహించు నెందుఁ శ్రీభాగీరథికిఁ బోటి యమృతప్రవాహ్వయ యైనతటిని

గీ. యని విముక్తిసాధూకంఠహారలతిక-దివ్యకేదారలింగేశతీర్థభూమి
నదనదీవాపిపల్వలహ్రదసమగ్ర-ప్రాతుపందిలి కాశికోద్యానమునకు. (కాశీఖండము)

చ. అటు తనునే సురేశ్వరుని యంతటివాఁ డఖిలాప్సరోంగనా
విటుఁ డొక మర్త్యభామినికి వేడుక చేయుచు నున్నవాఁడు వి
స్ఫుటబహురత్నభూషణవిభూషితు లయ్యెడు రాచవారికిన్
గటకట యారకూటకటకంబు రుచించునొ కాక యొక్కఁడన్.

ఉ. నీచరితంబు చూడ నతినిష్ఠుర మయ్యెడు లోకపాలదు
ర్వాచికసూచికాంకురపరంపర దూర్చెదు మాటిమాటికిన్
నా చెవులందు నీకుఁ దగునా యిటు చేయఁగఁ దప్ప దన్న బా
ధాచరణంబు నైజమె కదా తలపోయఁ గృతాంతదూతకున్. (శృంగారనైషధము)

గీ. పువ్వు ముడిచిన పుగవీథిభూమియందుఁ గట్టె మోవంగ వలసిన కారణమున
వీరభద్రునిచే దైన్యవృత్తి నొందె-దక్షుఁ డట్టిమహోన్నతస్థానమునను.

మ. జగతీమౌళివతంసభూషణము విశ్వఖ్యాతమై కాశికా
నగరంబుం బెఱఁబాసి నీవును జగన్మాత్రైకచారిత్ర యీ
చిగురుంబోఁడికి నాకు సంగటకటా చేదప్పెను వాటిల్లెనే
ముగురిం గూర్చిన యంత దైవమునకు న్మోమోట లేదే సుమీ.

(భీమఖండము)

మ. జవమేపారి సురారిపద్మజభుజా చక్రీభవచ్ఛార్ఙ్గగాం
డివకోదండవినిర్గళత్ప్రబలసందీప్తాస్త్రసంఘాతముల్
భువనక్రోడము నిండి భానుకిరణంబుల్ దూఱ నీకుండఁగన్
బవలుం బర్వ మహాంధకారములు పై పైమూఁచి రేఖాగతుల్.

చ. కమలవనాళికాకణికె కంటకకోటులచేతఁ జాఁకి కిం
పలనటిఁ జెన్ గరిత్రి సుహిమాగమవేళఁ దటాకసారణిన్
సలిలము పొంటి పండినయజాంగలసీమయు లెన్ని యన్నిటన్
దలఁపుగ నీవు పేర్మిగరు దాల్చినభావము ప్రస్ఫుటంబుగన్.

(శివరాత్రి మాహాత్మ్యము)

ఉ. ముందిగ మేనయత్తలు సమాదరణం బెసరంగఁ బెట్టి పు
త్తెంచిన మంచికజ్జములు తేనియ నేతను దోఁచి తోఁచి భ
క్షించుమనుఁ దల్లిఁ దండ్రిఁ దన చిన్నికరాంగుళి వంచి వంచి యూ
రించుచు నాడె మిన్న గమిరేను కుమారకుఁ డింటిముంగటన్.

ఉ. మాటలు వేయు నేమిటికి మంగళలక్షణలక్ష్మి దైన యీ
జోటికి భర్త గాఁగలఁడు సోమకిరీటుఁడు సర్వదేవతా
కోటికిరీటకోటిపరికుంచితభవ్యమణిద్యుతిస్ఫుటా
పాటలపాదపీఠుఁ డను పట్టి కృతార్థుఁ జేసెతి భూధరా.

(నారవిలాసము)

మంజరి. పేరె బాలుఁడు గాని బిరుసుమగంటె-బగ వారిఁ గొట్టిన బాలత్వ మేల ?.
తలిదండ్రులను బ్రోవఁ దనయుఁడె కర్త-మానాభిమానముల్ మఱచుట మించఁ
బ్రబలింపఁ గలవారు బాలురె సుమ్మ-బాలురె పెద్దలు బల్లిదు లౌరె
బాలురకే బుద్ధి పరికించి చూడఁ-బెద్దలు మతి చెడి పిల్లకిపాటుదురు

పాంచభౌతిక దేహపటిమ క్షీణించు-ధైర్యంబు తగ్గ నుత్సాహంబు లుడుగు
వయసు మీఱినవేళ వచ్చునా బలిమి-కీర్తి కైనను నపకీర్తికి నైన
బాలురపై నుంతు భార మంతియు నిఁక. (పల్నాటివీరచరిత్ర)

సాహిత్యోపాసనమునందు శ్రీనాథునకును, పోతనామాత్యునకును గల లక్ష్యభేదము వారి ప్రతిభావిశేషములను సార్థకము చేసినది. శ్రీనాథుని లక్ష్యము పోతనామాత్యుని లక్ష్యమువలె విశాలమును, విశుద్ధమును, పరమార్థబోధకమును గాక సంకుచితమును, సంకీర్ణమును, సామాన్యమును నగుటచే కావ్యప్రయోజనమును సామాన్యముగఁ బరిణమించినది.

౫
మధ్యయుగము
(౧౪౫౦-౧౭౦౦)
1450-1700
ప్రబంధయుగము, స్వతంత్రయుగము

వాఙ్మయము ప్రజాజీవనమునకుఁ బ్రతిబింబము. ప్రజాశయములు, ప్రజాభీష్టములు, ప్రజాశీలము, ప్రజాహృదయము వాఙ్మయమునందు గోచరమగుచుండును. సంస్కృతవాఙ్మయము సామాన్యముగ మతవాఙ్మయము. సంస్కృత వాఙ్మయాధారమున నభివృద్ధిని బొందిన దేశభాషావాఙ్మయములును సామాన్యముగ మతవాఙ్మయములుగ వెలసినవి. ఆంధ్రవాఙ్మయము ముఖ్యముగ నాదియుగమునందు మతధర్మాధారమున నభివృద్ధిని బొందినది. ఆంధ్రవాఙ్మయమున కమూల్యాలంకారములైన భారత భాగవత రామాయణములాంధ్రవాఙ్మయతత్త్వమును నిర్ధారణచేసినవి. ఆంధ్రవాఙ్మయరచనలందు నేఁటికిని నన్నయ తిక్కన పోతనాదుల మహత్త్వము నిలిచియున్న విధమును వాఙ్మయస్వరూపములు విశదము చేయుచున్నవి. మధ్యయుగము స్వతంత్రయుగముగఁ బరిగణింపఁబడుచున్నను ఆదియుగస్వరూపములు స్థిరతరములైన విధమును ప్రబంధయుగ వాఙ్మయము విశదముచేయుచున్నది.

నన్నయ తిక్కన పోతనాదికవులు సంస్కృతగ్రంథములను తెనిఁగించుటయందు వారి కవిత్వమహత్వమును వెల్లడిచేసినను వారి రచనలందు చిత్రకథాకల్పనలకును, రాజస శృంగారమునకును నవకాశములు లేవు. కావ్యమునకు పరమ ప్రయోజనములైన విశ్వకల్యాణము, రసానందమును బ్రహ్మానందమునందు ప్రత్యక్షమగుచున్నవి. బ్రహ్మనిష్ఠాపరాయణులైన మహాత్ములు విశ్వకల్యాణప్రదములైన కావ్యములను రచించి పరమానందమును గలుగఁజేయుదురు. తిక్కనపోతనలు దివ్యగుణ సంకీర్తనమునందు భాగవత భక్తిరసపరమైన కావ్యరసానందమును గలుగఁజేసిరి. అగమ్యమైన జీవయాత్రయందనన్యమైన భక్తి ఆనందరసానుభవమునకు సాధనముగ నున్నది. అనన్యమైన భక్తి సంసారప్రవృత్తియందు, నానావిధములైన యవస్థలందు నానావిధమైన రసానందమును గలుగఁజేయుచు విశ్వకల్యాణమునకు సాధనమగుచున్నది. సకల రసములకును స్థాయిభావము శాంతరసమునందుఁ గలుగుచున్నది. శృంగార శాంత వీరకరుణాది రసానందమునకును స్థాయిభావము శాంతరసమునందుఁ గలుగుచున్నది. విశ్వప్రవృత్తియందు సాత్త్వికరసానందము దుఃఖనివృత్తికిని సుఖప్రాప్తికిని, రాజస తామసరసానందము సుఖారాధనమునకును దుఃఖమునకును సాధనమగుచున్నవి. వేదపురాణేతిహాసములందుఁ బ్రతిపాదితమైన సాత్త్విక శృంగారము ప్రబంధములందు రాజస తామస శృంగారరూపములను దాల్చినది. అప్సరసలు, వారాంగనలు నాయికలై, మాయాగంధర్వులు నాయకులై శృంగారరసము కేవలము కామపరమైనది. ఇది కాలమహిమ.

పదునాఱవ శతాబ్దారంభమునందు మహమ్మదీయ విజయములు హిందూదేశమునందు ధర్మపరివర్తనమును గలుగఁజేసినవి. చాళుక్యరాజులు భారతరచనమూలమున వైదికధర్మసంరక్షణమును జేయుటకుఁ జేసిన ప్రయత్నములు మొదట ఫలవంతములైనను గాలక్రమమున నిర్వీర్యము లైనవి. పదునాల్గవ శతాబ్దారంభమునందు కాకతీయరాజ్యక్షయము వైదికధర్మప్రాబల్యము నాంధ్ర దేశమునందు

కృశింపఁజేసినది. బసవేశ్వరమతమును వైదికమతధర్మమును శిథిలముచేయుటకు వినియోగపడినది. పదునైదవ శతాబ్దమునందు సంప్రాప్తమైన మహమ్మదీయరాజ్యవ్యాపనము దక్షిణదేశమునందును వైదికమతమునందుఁ బరివర్తనమును గలుగఁజేసినది.

మహమ్మదీయ విజృంభణమును ఉత్తరహిందూస్థానమునందు రాజపుత్రవీరులు ప్రతిఘటించిన విధముననే దక్షిణదిగ్భాగమునందును నాంధ్రవీరులు ప్రతిఘటించుటకుఁ బూనుకొనిరి. విద్యారణ్యస్వాముల సహాయమున హరిహరరాయలు, బుక్కరాయలు స్థాపించిన విజయనగరసామ్రాజ్యము వైదికమతోద్ధరణమునకుఁ గొంతవఱకు వినియోగపడినను, హిందూసంఘమునందుఁ బరివర్తనమును గలుగఁజేసినది. ఆ పరివర్తనము ప్రజాజీవనమునకుఁ బ్రతిబింబమైన వాఙ్మయమునందు గోచరమగుచున్నది.

మహమ్మదీయరాజ్యవైభవములు, సమాజులు హిందూసంఘమునందును, మతధర్మమునందును మహాపరివర్తనమును గలుగఁజేసినవి. మతధర్మములందు వైరాగ్యభావము లుప్తమై భోగాభిలాష వర్ధిల్లినది. కర్మమార్గము శిథిలమై భక్తిమార్గము ప్రబలినది. సాత్త్విక శృంగారరస మస్తంగతమై రాజసతామసశృంగారరసములు ప్రబలినవి. విజయనగర సామ్రాజ్యవిజయములు రాజస తామస శృంగార రసములను పోషించిన విధము నా కాలపు వాఙ్మయము విశదము చేయుచున్నది. విజయనగరాధీశులు పండితులను, కవులను, కళలను పోషించి ఆంధ్రవాఙ్మయమునకు నూతనవికాసమును గలుగఁజేసిన విధమును విజయనగరసామ్రాజ్యచరిత్ర విశదముచేయుచున్నది.

విజయనగర సామ్రాజ్యాధీశులందుఁ బ్రతిభాశాలియైన శ్రీకృష్ణదేవరాయల కాలమునం దాంధ్రవాఙ్మయమునకుఁ గలిగిన మహావికాస మాంధ్రసాహిత్యహృదయమును పరిస్ఫుటము చేసినది. పెద్దన కృతమైన మనుచరిత్ర మాంధ్రవాఙ్మయ వికాసమునందు స్వతంత్రయుగ వాఙ్మయ స్వరూపస్వభావములను దెలుపుటకుఁ బరమ

ప్రమాణముగ నున్నది. శ్రీకృష్ణదేవరాయల దిగ్విజయములు, విజయనగరవైభవములు, శృంగారవిలాసములు, ధర్మసంస్థాపనలు, మహోత్సవములు, విద్యావినోదములు ప్రజల ధర్మప్రవృత్తియందు భావపరివర్తనమును గలుగఁజేసినవి. దేశమునందును, సంఘము నందును, ధర్మమునందును గలిగిన భావపరివర్తనము వాఙ్మయము నందు గోచర మగుచున్నది. స్వారోచిష మనుసంభవమునందు విజయనగరసామ్రాజ్యప్రతిభయు, శ్రీకృష్ణదేవరాయల ప్రతిభయు సూచితమై యుండును.

శా. హిందూరాజ్యరమాధురంధరభుజాహిగ్రామణీ కంచుక
స్యందస్వచ్ఛయశోసుధచ్ఛ యవనక్షోణీశవిస్థాపనా
మందీభూతకృపాకటాక్ష యసకృన్మాద్యత్కళింగాంగనా
బందిగ్రాహవిగాహితోత్తరకకుబ్ధాటీసమాటీకనా.

మనుచరిత్రకుఁ గృతికర్తయైన పెద్దనామాత్యుఁడు వైదికధర్మ పరాయణుఁడు; కృతిపతియైన శ్రీకృష్ణదేవరాయలు రాజసధర్మ పరాయణుఁడు. వైదికపరమైన కర్మమార్గమునకును, వైదికపరమైన భక్తిమార్గమునకును నిత్యజీవనమునందు ధర్మప్రవృత్తియందు సంరంభ సాహచర్యములు ప్రబలినవి. నిరంతరసంగ్రామములు, సంగ్రామ సంప్రాప్తములైన భోగభాగ్యములు ప్రజాజీవనమునందు నూతన సంచలనమును గలుగఁజేసినవి. ప్రజాహృదయమునందుఁ గలిగిన నూతన సంచలనమును ధర్మపరివర్తనమును వాఙ్మయహృదయము నందుఁ బ్రతిబింబించుచున్నది.

ఆంధ్రవాఙ్మయచరిత్రయందు మనుచరిత్రతో నారంభమైన ప్రబంధయుగము స్వతంత్రయుగమైనను అనుకరణయుగముగఁ బరిణ మించినది. ప్రబంధములకు శిరోభూషణమైన మనుచరిత్రయందే అను కరణబీజములు గోచరమగుచున్నవి. కథ, భావములు, వర్ణనలు, పద్యములు, శైలి పూర్వోదాహృతము లైనను కావ్యనిర్మాణము నందు మనోహరములైన నవీనరూపములను దాల్చినవి. పెద్దనార్యుఁడు

మనుచరిత్రమును "శిరీషకుసుమ పేశల సుధామయోక్తుం"ను రచియించి తెలుఁగుతియ్యఁదనమును ప్రత్యక్షముచేసెను. ఆంధ్రసాహిత్యరసమును తన మనుచరిత్రయందు మూర్తీభవింపఁజేసిన పెద్దనామాత్యుఁడు 'ఆంధ్రకవితాపితామహుఁడు' అను సార్థకనామధేయుఁడు.

ప్రవరాఖ్యుఁడు శ్రోత్రియ బ్రాహ్మణుఁడు, గృహమేధి. వరూథిని కామాసక్తమైన అప్సరస. ప్రవరాఖ్యవరూథినుల సంభాషణలు సంఘమునందుఁ బురుషార్థములకుఁ బ్రవర్ధమానమయ్యెడి సంరంభమును విశదముచేయుచున్నవి. చిరకాల సంరక్షితమైన వైదికకర్మానుష్ఠానమునకుఁ బదచ్యుతి గలిగినది. వైదికకర్మపరాయణత్వమును పెద్దనార్యుఁడు ప్రవరాఖ్యముఖమునఁ బ్రతిపాదించినను, వరూథినీ మనోరమాదుల ముఖమునను, గంధర్వమనువుల ముఖమునను వర్ణించిన రాజసశృంగారవిలాసములు వైదికమతవిలయమునకు నిదర్శనములు. మహమ్మదీయరాజ్య విజృంభణము హిందూమత సంఘములందు పరివర్తనమును గలుగఁజేసినది. మహమ్మదీయప్రభువుల భోగపరాయణత్వము హిందూ ప్రభువులను భోగపరాయణులను జేసినది. మహమ్మదీయప్రభువుల ఘోషాపద్ధతులు, బహుభార్యాగ్రహణము, కామారాధనము హిందూప్రభువులు నానుసరించినవి. మహమ్మదీయుల నమాజులు, ప్రార్థనలు కర్మమార్గమును శిథిలము చేసి భాగవతభక్తిని, భాగవతసంకీర్తనములను ప్రజ్వలింపఁజేసినవి.

విజయనగరసామ్రాజ్యమునందు వీరాగ్రేసరుల శౌర్యప్రతాపములు, కవీశ్వరుల కావ్యసంపదలు, వారాంగనల శృంగారవిలాసములు, శ్రోత్రియుల వైదికసిద్ధాంతములు, దేశికాచార్యుల విశిష్టాద్వైత సిద్ధాంతములు, శిల్పాచార్యుల కళాదక్షత్వము, గాయకుల శ్రావ్యగీతములు, హిందూరాజుల ధర్మరక్షణపరత్వము, ప్రజల స్వదేశ స్వధర్మ స్వభాషాభిమానము విలాసవంతము లైనవి. ఆమహావిలాసములను పెద్దనామాత్యుఁడు స్వారోచిషమనుసంభవమునందు హృద్యముగ చిత్రించెను. దురవస్థలకుఁ బాలగుచున్న వైదిక

విజ్ఞానమును దక్షిణాపథమునందు సంరక్షించుటకు శ్రీకృష్ణదేవ రాయలు కంకణమును గట్టుకొనెను. పెద్దనామాత్యుఁడు స్వారోచిష మనుసంభవమునం దీ మహాఫలమును సంభావించెను. కాని, వైదిక విజ్ఞానము నావహించిన మహాప్రతిబంధకములను సంభావించుట మహా కవియైన పెద్దనామాత్యునకును సాధ్యము గాకపోయినది. మనుచరి త్రయందలి కథాప్రవృత్తియే కావ్యప్రయోజనమును సంకుచితము చేయుచున్నది.

విశ్వశ్రేయస్సునకు సాధనమైన కావ్యప్రయోజనమును రాజా శ్రయము సంకుచితము చేసినది. శుద్ధశ్రోత్రియుఁడైన ప్రవరాఖ్యుఁడు నిమిత్తమాత్రుఁడు. శిష్టాచారపరాయణుఁడైన ప్రవరాఖ్యుఁడు నిరవ లంబనుఁడు, నిస్సహాయుఁడు. ప్రవరాఖ్యుఁడు ప్రకటించిన ప్రధాన మైన శాంతరసమునకుఁ గావ్యమునం దప్రధానస్థానమును, వరూథిని వరించిన కామాయత్తమైన శృంగారరసమునకుఁ బ్రధానస్థానమును గలిగినవి. ఇందువలననే కవి "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రి యుల్" అని వ్రాయవలసివచ్చినది. కావ్య మంతయుఁ గామపరమై కావ్యప్రయోజనమును సంకుచితము చేసినది. తిక్కనపోతనాదుల వలె పెద్దన కావ్యనిర్మాణమునకుఁ బరమార్థమును సంకల్పించియుం డలేదు. రాజానుగ్రహమును, ప్రజాదరణమును నుదారమైన కావ్య ప్రయోజనమును దుస్తరముచేసినవి. భావసంశుద్ధి దుస్తరమై కావ్య ప్రయోజనము సంకుచితమైనను పెద్దనామాత్యుఁ డాంధ్ర కవితా పితామహుఁ డను ప్రసిద్ధిని బడసినాఁడు.

మనుచరిత్ర స్వతంత్రకావ్యము. ఈ కావ్యమునందు సంస్కృ తాంధ్ర సాహిత్యములు సమ్మేళనమును బొంది ఆంధ్రసాహిత్యస్వరూ పము పరిస్ఫుటమైనది. కథ పురాణగాథమైనను కథాసందర్భములు ప్రజాజీవనమునకుఁ బ్రతిబింబములు. ఆంధ్రభోజుఁడు కృతిపతి. ఆంధ్రశ్రోత్రియుఁడు కృతికర్త. ఆంధ్రసాహిత్యము కావ్యహృద యము. ఆంధ్రభాషామాధుర్యము, తెనుఁగుపదముల లాలిత్యము,

మధ్యయుగమునందలి ప్రసిద్ధకవులు, వారి గ్రంథములు— క్రీ. ౧౬ మొదలు ౧౮-వ శతాబ్దము వఱకు

క్రమ సంఖ్య	కవిపేరు	కవికాలము*	గ్రంథముపేరు	గ్రంథవివరణము	విశేష విషయములు
౧	పిడుపర్తి సోమనాథుడు	౧౫౧౦-	బసవపురాణము	పురాణము	
౨	పిడుపర్తి బసవకవి	౧౫౨౦	ప్రభులింగలీలలు	,,	
౩	కృష్ణదేవరాయలు	౧౫౧౦-౧౫౩౦	ఆముక్తమాల్యద	ప్రబంధము	
౪	అల్లసాని పెద్దన్న	౧౫౧౦-౧౫౩౫	స్వారోచిష మనుచరిత్రము	,,	
౫	నందితిమ్మన	౧౫౧౦-౧౫౨౬	పారిజాతాపహరణము	,,	
౬	ధూర్జటికవి	౧౫౨౦-౧౫౩౦	కాళహస్తిమాహాత్మ్యము	,,	మాహాత్మ్యము
౭	తెనాలిరామలింగకవి	౧౫౨౫-౧౫౬౦	ఉద్భటారాధ్యచరిత్ర	,,	
			పాండురంగమాహాత్మ్యము	,,	మాహాత్మ్యము
౮	నాదింద్లగోపన్న	౧౫౧౭-౧౫౨౬	కృష్ణార్జునసంవాదము	ద్విపదకావ్యము	
౯	సంకుసాల నృసింహకవి	౧౫౨౫—	కవికర్ణరసాయనము	ప్రబంధము	
౧౦	మాదయగారి మల్లన్న	౧౫౧౭-౧౫౨౬	రాజశేఖరచరిత్ర	,,	
౧౧	చింతలపూడి యెల్లకవి (రాధామాధవకవి)	౧౫౨౦-౧౫౪౦	రాధామాధవము	,,	
			తారకబ్రహ్మరాజీయము	వేదాంతము	
౧౨	కుమ్మర మొల్ల	౧౫౨౬—	రామాయణము	ఇతిహాసము	
౧౩	అయ్యలరాజు రామభద్రుడు	౧౫౩౦-౧౫౭౦	సకలకథాసారసంగ్రహము	పద్యకావ్యము	
			రామాభ్యుదయము	ప్రబంధము	
౧౪	దోనూరి కోనేరికవి	౧౫౪౭-౧౫౬౫	బాలభాగవతము	పురాణము	
౧౫	అద్దంకి గంగాధరకవి	౧౫౫౦-౧౫౮౦	తపతీసంవరణము	ప్రబంధము	
౧౬	పొన్నికంటి తెలగన్న	౧౫౫౦-౧౫౮౦	యయాతిచరిత్ర	,,	
౧౭	శంకరకవి	౧౫౫౦-౧౫౮౧	హరిశ్చంద్రోపాఖ్యానము	,,	
౧౮	తెనాలి అన్నయ్య	౧౫౬౫—	సుదక్షిణాపరిణయము	,,	
౧౯	పింగళి సూరన్న	౧౫౬౦—	కళాపూర్ణోదయము	,,	
			ప్రభావతీప్రద్యుమ్నము	,,	
			రాఘవపాండవీయము	,,	శ్లేషకావ్యము

౨౦	రామరాజభూషణుడు	౧౫౬౦-	వసుచరిత	ప్రబంధము	
			హరిశ్చంద్రనలోపాఖ్యానము		
౨౧	మల్లారెడ్డి	౧౫౫౦-౧౬౦౦	షట్చక్రవర్తిచరిత్ర	,,	
౨౨	మల్ల అనంతభూపాలుడు	౧౫౭౦-౧౬౧౦	కకుత్స్థవిజయము	,,	
౨౩	సారంగు తమ్మయ్య	౧౫౯౦-౧౬౨౦	వైజయంతీవిలాసము	,,	
౨౪	చేమకూర వేంకటకవి	౧౬౩౦-	విజయవిలాసము	,,	
			సారంగధరచరిత్రము	,,	
౨౫	వెలగపూడి కృష్ణకవి	౧౬౯౦-౧౭౧౩	వేదాంతసారసంగ్రహము	వచనము	వేదాంతము
			మాలినీమాధవీయము	ప్రబంధము	
౨౬	కుంధుర్తి వేంకటాచలకవి	౧౬౯౦-౧౭౧౩	మిత్రవిందాపరిణయము	,,	
౨౭	సముఖము వేంకటకృష్ణప్ప నాయకుడు	౧౬౯౦-౧౭౧౩	అహల్యాసంక్రందనము	,,	
			రాధికాసాంత్వనము	,,	
			సారంగధర	వచనము	చరిత్రము
			జైమినిభారతము	,,	
౨౮	వక్కలంక వీరభద్రకవి	౧౭౨౦-	వాసవదత్తాపరిణయము	ప్రబంధము	
౨౯	ఏనుగు లక్ష్మణకవి	౧౭౬౦-	రామవిలాసము	,,	
౩౦	అడిదము సూరకవి	౧౭౫౦-	కవిజనరంజనము	పద్యకావ్యము	లక్షణగ్రంథము
			ఆంధ్రచంద్రాలోకము	,,	,,
			ఆంధ్రనామశేషము	,,	నిఘంటు
			కవిసంశయవిచ్ఛేదము.	,,	
౩౧	కస్తూరి రంగకవి	౧౭౩౬-౧౭౬౧	ఆనందరంగరాట్ఛందస్సు	,,	లక్షణగ్రంథము
౩౨	అలూరి కుప్పకవి	౧౭౬౫-౧౭౮౮	ఆచార్యవిజయము	,,	
			పరమభాగవతచరిత్ర	,,	
			ఇందుమతీపరిణయము	,,	
			రామాయణభాగవతములు	ప్రబంధము	
౩౩	ముద్దుపళని	౧౭౯౦-	రాధికాసాంత్వనము	,,	

* ఈ పంక్తిలోని సంవత్సరములు కవియున్న కాలమును ఇంచుమించుగ దెలియజేయును. ఇవి ప్రధానముగ శ్రీ. శ్రీ. కందుకూరి వీరేశలింగము పంతులుగారి కవుల చరిత్రమునుండి గ్రహింపబడినవి.

తెలుఁగురీతులు, ఆంధ్రహృదయసౌహార్దము కావ్యమునందు విలసితములు. పెద్దనామాత్యుఁ డాంధ్రవాఙ్మయమునుండి సరసభావములను, లలితపదములను, తెలుఁగుసాహిత్యమును, తెలుఁగుఛందస్సులను క్రోడీకరించి మనోహరముగ మనుచరిత్రయం దమర్చి ఆంధ్రకవితాపితామహుఁడని పేరొందెను. ఆకవితామాధుర్యమును కావ్యాలంకారములైన భావములు, పద్యములు తెలుపుచున్నవి.

సీ. కలఁకుల నన్న తంగేటిజున్ను గృహమేధి యజమానుఁ డంకస్థితార్థపేటి
పండిన పెరటికల్పకము వాస్తవ్యుండు దొడ్డిఁ బెట్టిన వేల్పుగిడ్డికాఁపు
కడలేని యమృతంపు నడబావి సంసారి సవిధమేరునగంబు భవనభర్త
మరుదేశపథమధ్యమప్రప కులపతి యాఁకటి కొదవు సస్యము కుటుంబి
బధిరపంగ్వంధభిక్షుకబ్రహ్మచారి-జటిపరివ్రాజకాతిథిక్షపణకావ
ధూతకాపాలికాద్యనాథులకుఁ గాన-భూసురోత్తమ గార్హస్థ్యమునకు సరియె.

సీ. చిన్నివెన్నెలకందు వెన్నుదన్ని సుధాబ్ధిఁ బొడమిన చెలువ తోఁబుట్టు మాకు
రహిఁ బుట్ట జంత్రగాత్రముల రాల్గరఁగించు విమలగాంధర్వంబు విద్య మాకు
ననవిల్తుశాస్త్రంపు మినుకు లావర్తించు పని వెన్నతోఁడఁ బెట్టినది మాకు
హయమేధరాజసూయము లనఁ బేర్పడ్డ సవనతంత్రంబు లుంకువలు మాకుఁ
గనకనగసీమఁ గల్పవృక్షములనీడఁ-బచ్చరాచట్టుగమి రచ్చపట్టు మాకుఁ
బద్మసంభవవైకుంఠభర్గసభలు-సాముగరిడీలు మాకు గోత్రామరేంద్ర.

సీ. కొనసాగి కామినీగోష్ఠిఁ బ్రౌఢములైన యురుటుఁజూపుల యొప్పుఁదుదలఁ బాఁది
సంతసంబున ముఖాబ్జమునందుఁ జిఱునవ్వు కందళింపక యుండ డిందుపఱచి
పొంగారుమైఁ దోఁచు శృంగారచేష్టల తమిఁ దెచ్చికోలు మార్దవమునఁ దాఁచి
పాడను రసావేశమున వచ్చు నర్మోక్తు లాదవి నాలుకకు రాకుండఁ ద్రొక్కి
మస్తకము వాంచి యుసురని మౌనముద్ర-నేల బొటవ్రేల వ్రాయుచు నిలిచి కొంత
సేపు వెడవెడ చింతించి శిర సొకింత-యెత్తి సన్నంపుఁబెలుఁగుతో నిట్టు లనియె.

సీ. నను నిముసంబు గానకయున్న నూరెల్ల నరయు మజ్జనకుఁ డెంత దడలునొక్కొ
యెపుడు సంధ్యలయందు నిలు వెళ్లనీక నన్నరయు మెద్దుతల్లి యెంత తొఱలునొక్కొ
యనుకూలవతి నాదు మనసులో వర్తించు కులకాంత మది నెంత కుందునొక్కొ
గెడఁ గోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు లింతకు నెంత చింతింతురొక్కొ
యతిథిసంతర్పణంబు లే మయ్యెనొక్కొ-యగ్ను లేమయ్యెనొక్కొ నిత్యంబులైన
కృత్యములఁ బాపి దైవంబ కినుక నిట్లు-పాఱవైచితె మిన్నులు పడ్డచోట. (మను.)

వ సు చ రి త్ర

రామరాజభూషణుఁడు మనుచరిత్ర ననుకరించినవిధమును వసుచరిత్ర విశదముచేయుచున్నది. భావనాశక్తియందలి లోటును పదముల పొందిక కప్పుచున్నది. కావ్యము శ్లేషాలంకారమున కాలవాలమై శ్లేషప్రబంధరచనలకు మాతృకమైనది. వసుచరిత్ర హృద్యములైన పద్యములతో నిండియున్నను కావ్యప్రయోజనము సంకుచితమైనది. శబ్దాలంకారములు శ్రావ్యములై, మనోహరములై యానందదాయకములైనను కావ్యమునకుఁ బరమార్థమైన ఆత్మానందమును సంకుచితముచేయుచున్నవి. చిత్తప్రవృత్తి ప్రధానమైన భావమునందు లగ్నముగాక అప్రధానమైన భాషయందు లగ్నమై కావ్యప్రయోజనము పరిమితమగుచున్నది. రామరాజభూషణుని రచనయందు సరసముగను, సరళముగను వినిర్మితమైన శ్లేషకావ్యము కాలక్రమమున ప్రబంధకవుల హస్తములందు విరసమును, క్లిష్టమును నై, వాఙ్మయహృదయమును స్తంభింపఁజేసినది. మహాకవియైన రామరాజభూషణుఁడు శ్లేషాలంకారములను మనోహరముగ రచించినను సామాన్యకవుల రచనలందు శ్లేషకావ్యములు నీరసములైనవి. వసుచరిత్రశైలి శ్లేషాలంకారములతో నిండియున్నను, మనోహరమై, ఆంధ్రవాఙ్మయమునకు అమూల్యాలంకారముగ నున్నది.

సీ. మును సుమనోరాగమున వసంతము సూపెఁ గాననేందిర యశోకంపుఁగొమ్మ
కాకొమ్మ నగుచు నెయ్యమునఁ గ్రొన్ననతేనె మెలఁగెడు సరసాళిమీఁదఁ జల్లె
నాసరసాళి సోయగపుఁబాటలతోడఁ జని మాధవి ప్రవాళశాటిఁ దుడిచె
నామాధవిపరాగ మక్షిరాగము నించఁ బఱతెంచు కలకంఠిపై విదిల్చె
నిట్లు లతికలు హితకోటి కెనసి యపుడు-మదనదేవోత్సవక్రీడఁ బొదలు ననిన
వరులఁ దరుణులు విరులయోవరుల వఱలు-సిరుల వలరాచజాతరల్ సేయు టరుదె.

సీ. ఇషుస్త్రులై మరుహజారమ్ములై పొద లుండఁ బూఁజవికలు వేఱ పూనవలదు
తెప్పలై నెత్తావికుప్పలై పుష్పవల్లరుల గందవడి త్రోవఁ జిలుకవలదు
సారమై హిమజలాసారమై పూఁదేనె నెఱయఁ గేళాకూళి నింపవలదు
మొత్తమై మారుతాయత్తమై గఁబూర మెగయ వితానముల్ బిగియవలదు

స్వామియారామశుభవైభవములు చూడ-నెపుడు విచ్చేయుదురో యంచు నెదురుసూచు
సహజసౌభాగ్యములుగూర్చి చైత్రుఁ డతఁడు-కూర్మి భవదీయవనపాలకుండు కాఁడె?

సీ. అడుగు పెట్టదు నవ్యహరిచందనలతాంత సరణిపైఁ గాని యీయరుణచరణ
కేల నంటదు కోరకితపారిజాతవల్లరిఁ గాని యీయతిలలితబాహ
తనువుఁ జేర్పదు నవోదారమందారమంజులశయ్యఁ గాని యీసురభిళాంగి
పెదవిఁ జేర్పదు కల్పపృథివీజఫలసంతతియె కాని యీమోవితీపులాఁడి
గురుకులక్రమాయాత మీగిరిజచల్లఁ-దనము జన సైకరూఢ మీతటినిపట్టి
సరసగంభీరభావంబు సహజసిద్ధ-మీనలినసోదరీమణి మేనితావి.

సీ. తలయెత్తదయ్యెఁ గేవఁజపస్థితి రంభ జళుకుఁ జూపులఁ జూడసాగె హరిణి
కుందుకుందునఁ జెంది కొదఁ దెల్పె శశిరేఖ పలపలనై వెల్లపాఱెఁ దార
మఱవక పూనె మైమఱుపు వరూథిని చెయ్వు లన్నియుఁ దక్కెఁ జిత్రరేఖ
యుచితకార్యవివేక ముడిగె మదాలస మానె సద్ధతభావ మంజుఘోష
ఱాపడియె సానుమతి సాంద్రతాపమునఁ గ-రంగె హేమాభిధాన నిర్జరలతాంగు
లిట్లు దనుఁ జూచి సిగ్గుపాటెనయ వినయ-వినతయై యున్న నగరాజతనయఁ జేరి.

కళాపూర్ణోదయము

ఆంధ్రవాఙ్మయమునందు రమారమి ౮౦౦ ప్రబంధములు కలవు. ప్రబంధకవులందు పింగళి సూరన్న ప్రతిభావంతుఁడై వెలయుచున్నాఁడు. సూరనకృతములైన గ్రంథములందు కళాపూర్ణోదయము కథాకల్పనయందును, భావనాశక్తియందును, భాషాసౌష్ఠవమునందును, రసపోషణమునందును నిరుపమానముగ నున్నది. ఆంధ్రసాహిత్యమును పరిస్ఫుటముచేసిన కవులందు సూరనార్యుఁడు పరంజ్యోతివలె ప్రకాశించుచున్నాఁడు. కళాపూర్ణోదయము భాషయందును, భావములందును ప్రజాజీవనమునకుఁ బ్రతిబింబముగ నున్నది. సూరనార్యుఁడు కావ్యరచన కవసరమైన ప్రతిభను కళాపూర్ణోదయమునందును, ప్రభావతీప్రద్యుమ్నమునందును దెలిపియున్నాఁడు.

సీ. పొసఁగ ముత్తెపుసరు లొప్పహళించినలీలఁ దమలోన దొరయు శబ్దములు గూర్చి
యర్థంబు వాచ్య లక్ష్యవ్యంగ్యభేదంబు లెఱిఁగి నిర్దోషత నెసఁగఁజేసి
రసభావములకు నర్హంబుగ వైదర్భిమొదలైనరీతు లిమ్ముగ నమర్చి
రీతుల కుచితంబులై తనరారెడు ప్రాణంబు లింపుగాఁ బాదుకొల్పి

తే. యమర నుపమాదులును యమకాదులు నగు-నట్టియర్థశబ్దాలంక్రియలు ఘటించి
కవితఁ జెప్పంగ నేర్చు సత్కవివరునకు-వాంఛితార్థంబు లొసఁగనివారు గలరె.

లయవిభాతి—

చలువగల వెన్నెలల చెలువునకు సౌరభ్య
గలిగినను సౌరభముఁ జలువయుఁ బరిప్పం
బొలు పెసఁగు కప్పురపుఁ బలుకులకుఁ గోమలత
నెలకొనిన సౌరభముఁ జలువపసయుం గో
మలతయును గలిగి జనముల మిగుల బెంపెసఁగు
మలయపవనంపుఁగొదమలకు మధురత్వం
బలవడిన నీడు మఱి కల దనఁగవచ్చుఁ గడు
వెలయుఁ గల యీ సుకవిపలుకులకు నెంచన్.

సీ. విశ్రాంతి విరతి గావింపక సారవత్సాహిత్యసౌమనస్యంబు లెఱిఁగి
సమయంబు దప్పక శ్రవణకఠోరంబులైన శబ్దముల నత్యాకులాత్మఁ
జేయక సత్పరిచితసుకుమారవాక్సరళితాభిప్రాయఁ గా నొనర్చి
పదబంధశిథిలతఁ బాటిల్లఁగా నీక యేచందములయందు నేమరిలక

ఆ. పరఁగుకవియు దోషాకరుఁడును యశము దు-గ్ధము నబయునట్టు గానినాఁడు
కృతి దురాప మొదవు కీర్తియుఁ బాలు నీ-కుంట గాదు హాసమొాస్యఁజేయు.

సూరనార్యుఁడు "అపూర్వకథా సంవిధాన వైచిత్రీమహనీయంబును, శృంగారరసప్రాయంబును, బుణ్యవస్తు వర్ణనాకర్ణనీయంబును" నగు కళాపూర్ణోదయ మను మహాకావ్యము నిర్మింపఁ గడఁగినట్లు తెలిపియున్నాఁడు. (కళాపూర్ణోదయమునందలి కథ అపూర్వమై సంవిధానము మాత్రము క్లిష్టముగ నున్నను, రసానందమున కాలవాలముగ నున్నది. శృంగారరసప్రాయమై అపూర్వవిధానమున కావ్యప్రయోజనమును సమకూర్చుచున్నది. కళాపూర్ణోదయమునందు సంస్కృతాంధ్రసాహిత్యములు సమ్మేళనమును పొంది, ఆంధ్రసాహిత్య స్వరూపము సర్వత్ర ప్రత్యక్ష మగుచున్నది. వైదికకర్మమార్గము శిథిలమై వైష్ణవభక్తిమార్గము ప్రజాహృదయమునందు ప్రబలిన విధము నీకావ్యము తెలుపుచున్నది.

"స్త్రీప్రార్థనంబునం జేసి యిప్పుడొనర్చు విశేషంబు విను మట్లు లోకానుగ్రహార్థంబుగా నేను నిత్యసన్నిధిస్థానంబులుగా నంగీకరించిన శ్రీరంగకాంచీ వేంకటాచలాహోబళపురుషోత్తమాది దివ్యస్థలంబుల కరిగి సేవింపనోపకున్నను దమయున్నచోటనే యుండి తత్తద్దివ్యదేశ నివాసు నన్ను నిజేచ్ఛానుసారంబునం దలంచి కేలు మొగుచువారికి సంసారంబు నుద్ధరింపం జేయుదునని యానతిచ్చిన సంతసిల్లి యదియె చాలునని యమ్మహాదేవుని దీనవాత్సల్యంబు ననేకప్రకారంబుల సన్నుతించెనని చెప్పి మధురలాలస యా కళాపూర్ణ మహారాజుం గనుంగొని యది యిప్పుడు మీర లడిగిన భవదీయ పూర్వజన్మవిరచిత లక్ష్మీనారాయణసంవాద కథాప్రకారంబు దేవరప్రశ్ననిమిత్తంబున నిశ్శ్రేయససులభోపాయంబు దొరికె. నేఁడు సుదినంబయ్యె. మదీయజన్మంబు సఫలంబయ్యెనని పలికి శ్రీరంగాదిదివ్యదేశమాహాత్మ్యంబునకు వెఱఁగందుచు నింత భక్తవత్సలుండవే యని పరమపురుషు నఖిలలోకైకనాథు నారాయణుఁ దలంచి ప్రణమిల్లెఁ గళాపూర్ణుండును దదాదిగా నత్యాదరంబున విష్ణుసేవ గావింపుచు ధర్మమార్గంబున రాజ్యపరిపాలనంబు సేయుచుండెను."

మహాకవులు ప్రజల ప్రవృత్తిని దమ కావ్యములందుఁ బ్రతిబింబింపఁజేయుచు సాహిత్యమును బురుషార్థమునకు సాధనముఁ జేయుచున్నారు. ఈ ప్రయోజనమును సంకుచితముగనైనను సమకూర్పఁగలిగిన విధమును కావ్యమునందలి పుణ్యవస్తువర్ణనలు, కథానుసంధానములు విశదముచేయుచున్నవి.

పింగళి సూరనార్యుఁడు గారుడసంహితాది కృతులను, రాఘవపాండవీయమును, ప్రభావతీ ప్రద్యుమ్నమును, కళాపూర్ణోదయమును రచియించెను. రాఘవపాండవీయము శ్లేషప్రబంధము. ప్రభావతీప్రద్యుమ్నము పురాణప్రసిద్ధమైన శృంగారప్రబంధము. కళాపూర్ణోదయము అసామాన్యకల్పనావిలసితమైన మహాప్రబంధము. సూరనార్యుఁడు కళాపూర్ణోదయరచనయం దప్రతిమానమైన ప్రతి

భను విశదముచేసెను. కథ నిర్ణిద్రసారస్యలీలాచిత్రంబై నిగూఢ మైన శారదాచతుర్ముఖుల విలాసములతో నారంభమై కలభాషిణీ కళాపూర్ణుల పరిణయముతో పరిసమాప్తి నొందుచున్నది. ఉత్తర కథయందు విలసితములైన పాత్రలు భావాశ్రయములై పూర్వకథ యందు విలసితములైన పాత్రలకు రూపాశ్రయములై యున్నవి. కళా పూర్ణుఁడు, మధురలాలస, బ్రహ్మ, సరస్వతి, మదాశయుఁడు, రూపానుభూతి, స్వభావుఁడు, సత్వదాత్ముఁడు మొదలగు పాత్రలు పూర్వకథయందు మణికంధరుఁడు, కలభాషిణి, మృగేంద్రవాహన, మాయారంభ, మాయానలకూబరుఁడు, సుగాత్రి, శాలీనుఁడు మొద లగు రూపములను గళాపరిణామమును బ్రత్యక్షము చేయుచున్నవి.

జీవయాత్రయందు నివృత్తిమార్గమునకును బ్రవృత్తిమార్గము నకును, భావమునకును రూపమునకును, సిద్ధాంతములకును గార్య ములకును, తత్త్వములకును కళలకును గల సంబంధము, సాహ చర్యము పండితులకు సహితము సమ్మోహమును గలుగఁజేయుచు న్నవి. కళాపూర్ణోదయము సాహిత్యమునకు గుణరూపములను సమ కూర్చెడి గుణావగుణములను హృద్యముగ విశదము చేయు చున్నది.

కలభాషిణి వేశ్యబాలిక. శ్రీకృష్ణాంతఃపురమునందు సంగీత మునఁ బ్రావీణ్యమును గడించినది. నారదుని యనుగ్రహమును బడసి నది. సాహిత్యమునందును కొంతప్రవేశమును సంపాదించినది. మణి కంధరుఁడు సంగీతసాహిత్యములందుఁ బ్రజ్ఞావంతుఁడు. కలభాషిణీ మణికంధరుల యన్యోన్యానురాగమునకు రూపగుణ సాంగత్యములు దగియున్నను నలకూబర రంభల రూపలావణ్యములు సమ్మోహము నకుఁ గారణములైనవి. మాయారూపములనుదాల్చి కామభోగముల ననుభవించిరి. గుణభావానుభూతిరహితమైన రూపసాంగత్యము ప్రేమ రసాశ్రయమైన పురుషార్థసిద్ధికి సాధనము గాఁజాలదు. నిత్యమైన భావగుణాశ్రయము పురుషార్థమునకు సాధన మగుచున్నది. మధుర

లాలస మదాశయుని తండ్రిగను, రూపానుభూతిని తల్లిగను, కళాపూర్ణుని పతినిగను బడసి జీవయాత్రను సఫలము చేసికొనినది.

ఉ. శ్రీయుత మైన దివ్యమణి చేతికి నబ్బఁగఁ బాఱవైచి త
చ్ఛాయ యొకింత యున్కిఁ గని చాలఁ గ్రహించితి గాజుపూసక
న్నాయవివేక మే మనుకొనం దుదఁ దన్మణి యబ్బె నన్న న
త్యాయతతత్సమాగమసుఖాప్తికి నోఁచమి నెంచి కుందెదన్.

సంసారప్రవృత్తియందు సామాన్యజనులు కళాపూర్ణులు, మధుర లాలసలు గాకపోయినను ప్రేమాశ్రయమైన సంసారసౌఖ్యముల ననుభవింపఁగల విధమును సుగాత్రీశాలీనుల యుదంతము విశదము చేయుచున్నది. సుగాత్రి అరమర తెలియఁగని ముగ్ధాంగన. శాలీనుఁడు పల్లెటూరి బ్రాహ్మణుఁడు; రసికత్వము నెఱుఁగని సంసారి. ప్రేమాస్వాదిని యైన సుగాత్రి తన భర్తయైన శాలీనుని ప్రేమాభిముఖుని జేసినది. మనుచరిత్రయందు వరూథిని చూపిన కామోద్రేకమునకును, సుగాత్రి చూపిన ప్రేమోద్రేకమునకును గల భేదమును సూరనార్యుఁడు హృద్యముగ సుగాత్రిప్రవృత్తియందు వర్ణించెను. మొదటిది కామాసక్తమైన అప్సరఃస్త్రీమోహము. రెండవది సాంసారికమైన కులాంగనప్రేమ. అభినవకౌముదికి శల్యాసురుఁడు చూపిన కామోద్రేకము ప్రవరాఖ్యునకు వరూథిని చూపిన కామోద్రేకమువలెనే నిష్ఫల మైనది. కామాసక్తుఁడైన శల్యాసురుఁడు కామమున కాహుతి యగుట ప్రేమతత్త్వమునందు మనోహరమైన పరిపాకమును తెలుపుచున్నది.

కామకళాసూత్రపరిణామమును సూరనార్యుఁడు భిన్నములైన పాత్రలరూపమున భిన్నరీతుల మనోహరముగ కళాపూర్ణోదయమునందు వర్ణించి శృంగారరసపరిణామమును బరిస్ఫుటము చేసెను. జీవయాత్రయందు శృంగారరసము మనోహరమై సుఖదుఃఖములకుఁ గారణ మగుచున్నది. శృంగారరసము కామపరమై రూపాసక్తమైనపుడు దుఃఖము కలుగుచున్నది. శృంగారరసము ప్రేమపరమై భావా

సక్తమైనపుడు సుఖము కలుగుచున్నది. కలభాషిణీ మణికంధరులు, రంభా నలకూబరులు, సుగాత్రీశాలీనులు, అభినవకాముని మణికంధరులు పూర్వోత్తర కథలందు వ్యక్తముచేసిన శృంగారరసము రూప భావాశ్రయములయిన కామప్రేమల మూలమున సంసార ప్రవృత్తియందుఁ గలిగెడి సుఖదుఃఖములను విశదము చేయుచున్నది.

కలభాషిణి మధురలాలసజన్మము నెత్తుటకు మదాశయరూపానుభూతుల దాంపత్య మవసరమైనది. మణికంధరుఁడు కళాపూర్ణ జన్మమునొందుటకు సుముఖాసత్తిశాలీనులు తల్లిదండ్రులైరి. పూర్వ కథయందలి రూపానుభూతికిని, ఉత్తర కథయందలి భావానుభూతికిని సంయోగము గలిగినపుడు మాయారహితమైన శృంగార రసానందము గలుగుచున్నది. భావసౌందర్యమునకును, రూపసౌందర్యమునకును గావ్యరచనయందు సంయోగము గలుగునపుడు కావ్యరసానందము గలిగి కళాపూర్ణోదయము సాధ్యమగుచున్నది.

సీ. మెఱుఁగారుముంజియు మేనికోమలికంబుఁ గడుదిట్టతనము గుల్కెడు మొగంబు
పసపుగోఁచులయొప్పు బ్రహ్మతేజంబును జారుకృష్ణాజినధారణంబు
తళుకుజన్నిదము మేధావిబొట్టును జిన్నిపట్టవర్ధనమును జిట్టితెడుపు
మొలనంక యుంగరంబులసొంపు దండపుఁ గోలయు సన్నపు బ్రేలు సిగయు

ఆ. నొప్పు బ్రహ్మచారి యొకఁ డేగుదెంచెఁ బు-స్తకముఁ గొంచు మిగుల సంభ్రమమున
నొజ్జ యతనిఁ జూచి యోరి యేమిర, కడు-నాలసించి తనియె ననిన నతఁడు.

సీ. లీలఁ బొత్తులమీఁద లేచి కూర్చుండుచోఁ దద్దయు నొకక్రొత్త ముద్దుఁ జెలువు
క్షితిమీఁద లేఁతకెంగేలిడి తడవుచో వెనలిడి యొండొక ముద్దుఁ జెలువు
నల్లనల్లన తప్పటడుగులు వెట్టుచో నిద్దంపుబసపర ముద్దుచెలువు
కోదలుమాటలు తేనె గులుకుచుఁ బలుకుచో మోహనం బగు వింతముద్దుచెలువు

తే. కలిగి యాబాల నవచంద్రకళ యనంగఁ-దివుట నామనిఁ దనరు లేఁదీఁగ యనఁగ
నంతకంతకుఁ బ్రోదిచే నతిశయిలుచుఁ-బరఁగెఁ జూపఱకును గనుపండు వగుచు.

సీ. ఇట్లు సింగారించి యెదుట నద్దము వెట్టి చూచుకొమ్మన లజ్జఁ జూడఁ గొంకుఁ
జెలు లెడగాఁ జన్న నిలువుటద్దము చూచి కొనగోర నటు దిద్దు కురులు విరులు

నంత వా కేతేర సెంతసూక్ష్మగ్రాహి యిది యంచు ముకురపరీక్ష సేయు
నాయలంకారరమ్యత చెదరకమున్న యధిపుఁడు తనఁ జూడ నాత్మఁ గోరు
తే. సిగ్గుకతమున సకియల చేర్పు వాని - చనవుఁ బరికించు తొడవుల యునికి మట్టు
మచ్చుమరలేక యుండ నేమఱక యోము - మిగుల మేఁగరగరికె యా వెలుఁగుఁబోఁడి.

సీ. కలికికన్గొనలచూపుల పేరఁ బర్వు మవ్వపుఁ గల్లఁ గల్వలు పైచి పైఁగి
మందహాసము లను చందనోదకములు పలుమాఱు మోముల జిలికి చిలికి
హారంబు లిడుచు బాహారుచిచ్ఛలమున భుజములందు హరిద్రఁ బూసి పూసి
ప్రతిభూషణము లమర్చుచు హస్తకాంతికుంకుమములు చెక్కిళ్లఁ జమరి చమరి
ఆ. యలరఁ జేయు నచ్చరలపిండు ముత్తైక-న్యలను బెండ్లియాడి బలియు చున్న
క్రొత్త పెండ్లికొడుకుఁ గొమరులసయ్యాట-లాడు తద్విభావయాస్య లనఁగ.

అనంతములైన కథాతరంగములందుఁ గావ్యకళారూపమునఁ గావ్యరసానందమును గలుగఁ జేయుటకు పింగళి సూరనామాత్యుఁడు చేసిన మహాసంకల్పము కళాపూర్ణోదయరూపమునఁ బరిణమించినది.

సీ. కాంత మున్విన్న యా కథ యీకథయ నాఁగ నన్యమౌ వాచ్యత తోఁచినట్టి నామ
జాతిక్రియాదిక సకలపదార్థవాక్యార్థాంతరము లెవ్వి యవియ యంటఁ
గలయవి యిందుఁ దత్కథకంటె భేదంబు పరికింప నొనరించెఁ బశ్చి నిలిపె
ననునివి మొదలైన యట్టిభూతార్థంబు క్రియలపట్టున నొనరించుఁ బశ్చయు
తే. నిలుపు నను నివి యాదిగాఁ గల భవిష్య-దర్థవచనంబులైన క్రియాపదంబు
లును చకొనుటయె వానియందును దలంప-నో సుధాంశువిలాసప్రహాసివదన.

సీ. వివరింప సకలవస్తువుల ప్రసిద్ధి వాగ్జాలము లంబు వాగ్జాల పెల్లఁ
దన్మయంబి ట్లుండఁ దనరు నీమది కసమ్మత మైనయట్టిది మహి వెలయునె
యాకళాపూర్ణ మహారాజు కథ తావకీనశృంగారలీలానిమిత్త
మగుచు మన్ముఖజాత మగుచు నవశ్యంబు గరము ప్రసిద్ధంబు గాఁగలయది
తే. నీకుఁ బ్రియమని పేర వర్ణింపనేల - నీవిపుడు పల్కుపల్కు స్వాభావికంబ
పతుల యనురాగలీల లే పగిదినైన-వెలయఁ గోరియు దాఁచు టింతుల గుణంబు.

ప్రతిభాశాలియైన సూరనామాత్యునకును కాలప్రభావ మలంఘనీయమైనది. రాజాశ్రయమునకు సహజమైన శృంగారవిలాసములు

కళాపూర్ణోదయమునకు గుణదోషములను గల్పించినవి. ప్రతిభాశాలి యైన సూరనార్యుఁడు ఇమ్మహాకావ్యమును భావప్రబంధరూపమున రచియించి ప్రేమరసానందమును బ్రత్యక్షముచేసి యుత్తమమైన కావ్యప్రయోజనమును సార్థకము చేసెను.

ఉ. పూర్ణశమ స్తసద్గుణవిభూషితుఁడై పొలుపొందు నాకళా
పూర్ణు కథల్ వినం జదువఁ బొల్పుగ సంతతివైభవాదివి
స్తీర్ణశుభంబు కల్గు కజాదీవన మున్నది గల్గెఁ గాన నా
నిర్ణయ మార్యు లెల్ల మది నిల్పి వినుండు పఠింపుఁ డింపుతోన్.

ఆంధ్రసాహిత్య స్వరూపస్వభావములను నిర్మించిన కవులందు సూరనార్యుని ప్రతిభ యఖండమై వెలయుచున్నది. సరస్వతీ చతుర్ముఖుల భావగర్భితమైన శృంగారవిలాసములు ప్రేమమయమై వెలయుచున్నవి. భావగర్భితములైన శృంగారవిలాసములు ప్రపంచ ప్రవృత్తియందు శృంగారకళాస్వరూపమున వ్యక్తమైనపుడు కావ్యకల్పనకు సాధనము లగుచున్నవి.

వైదికవిజ్ఞానము కాలాంతరమునను, ఆగమ రూపములను నారాధ్యమై పురుషార్థసిద్ధికి సాధనమైనది. ఆగమముల మూలమున వేద ప్రతిపాదితమైన కర్మమార్గమునకును, జ్ఞానమార్గమునకును సంసారప్రవృత్తియందు సామరస్యమును గలుగఁజేయుటకు భారతీయ తత్త్వజ్ఞులు చేసిన సాధనలు నిగూఢమైన కళాస్వరూపమున వెలయుచున్నవి. చతుష్షష్టికళోపేతమైన విజ్ఞానము సంసారప్రవృత్తి యందు రసానందమును గలుగఁజేయుచు పురుషార్థప్రదముగ నున్నది. సకలకళలును, శృంగారములును, రసములును సృష్టికర్తలైన సనాతనదంపతుల శృంగారకళావిలాసములందు సుప్రతిష్ఠితములు. భారతీయతత్త్వజ్ఞులు నిత్యమైన కళాభినివేశమునకు శ్రీవిద్యోపాసనమును సాధనముగ నేర్పఱచిరి.

పూజాకల్పమునందలి నవావరణలును నవరసావరణములుగ నున్నవి. ప్రథమావరణమునందు త్రిపురసుందరి శృంగారరసాత్మకమై సర్వసంక్షోభణముద్రారూపమున వెలయుచున్నది. ధ్యానము:—

శ్లో. త్రిపురా స్ఫటికాభాసా ముక్తాదామవిభూషితా
పుస్తకం చాక్షమాలాం చ కపాలం పద్మముత్తమమ్
బిభ్రతీ సిద్ధయే చింత్యా మహాపాతకనాశినీ;
అభీష్టసిద్ధిం మే దేహి శరణాగతవత్సలే,
భక్త్యా సమర్పయే చాహం ప్రథమావరణార్చనమ్.

కళాపూర్ణోదయమునందు ప్రథమాశ్వాసము శృంగారరస ముతో నారంభమై గ్రంథము శాంతరసముతో నంతము నొందు చున్నది. త్రిపురసుందరి శాంతరసాత్మికయై సర్వయోనిముద్రారూ పమున నవమావరణమునందు వెలయుచున్న విధమును ధ్యాన శ్లోకము విశదము చేయుచున్నది.

శ్లో. యా విద్యా శివకేశవాదిజననీ యా వై జగన్మోహినీ
యా బ్రహ్మాది పిపీలికాది జగదానందైకసంధాయినీ
యా పంచప్రణవద్విరేఫనళినీ యాచిత్కళామాలినీ
సా మాయా పరదేవతా భగవతీ శ్రీరాజరాజేశ్వరీ.

ఈ సాధనములనే పింగళి సూరనార్యుఁడు కళాపూర్ణోదయము నందు హృద్యముగ ద్యోతకముచేసెను. కళానిర్వచనమునందుఁ బ్రాచీనార్యసంప్రదాయములకును, వర్తమాన సంప్రదాయములకును గల భేదమును కళోపాసకులును, కళావిమర్శకులును గ్రహించుట కావ్యహృదయమును గ్రహించుటకుఁ బ్రయోజనకరము. వాగర్థముల వలెనే వాణీహిరణ్యగర్భుల శృంగారకళాలీలలు సంసారప్రవృత్తి యందు సర్వవ్యాప్తిని గలిగియున్న విధమును కళాపూర్ణోద యము విశదము చేయుచున్నది. దివ్యమైన మణిహారము హృదయ స్పర్శనమువలన దివ్యజ్ఞానమును గలుగఁజేసిన విధమున దివ్యమైన కావ్యము హృదయమునకు రసానందమును గలుగఁజేయుచున్నది.

సూరనార్యుఁడు భావగర్భితమైన సరస్వతీ చతుర్ముఖుల శృంగార విలాసములతోఁ గథ నారంభించినను కావ్యప్రవృత్తియందుఁ గాలా నుగుణమైన కాముక శృంగారరసమునకు దాసుఁడై కావ్యప్రయో

జనమును సంకుచితముజేసెను. ప్రతిభావంతుఁడైన సూరనార్యుఁడే కాలప్రవాహమునందుఁ గొట్టుకొని పోయినపుడు సామాన్యులమాట చెప్పవలసిన యవసరములేదు. కాముక శృంగారానుకరణము సహజమైన ఆంధ్రసాహిత్యవికాసమును స్తంభింపఁజేసి చిరకాలమువఱకును సహజవికాసమును దుర్లభము చేసినది.

ప్రబంధకవులందు ఆముక్తమాల్యదను రచించిన శ్రీకృష్ణదేవరాయలు, పారిజాతాపహరణమును రచించిన ముక్కుతిమ్మన్న, విజయవిలాసమును రచించిన వేంకటకవి, రాజశేఖరచరిత్రమును రచించిన కూచిమంచితిమ్మకవి మొదలగుకవులు ఆంధ్రవాఙ్మయమునకు మనోహరాలంకారములను సమకూర్చిరి. ఈ కవుల ప్రతిభ మృదుమధురరచనలందు గోచరమైనట్లు భావసంశుద్ధియందు గోచరము కాకయున్నది.

సీ. పట్టంపుఁ జలినీటి తరఁగచాల్ గ్రోలి కొత్తి తేఁటపాలజగతిఁ దా నిలుచు టేమి
కోలఁకుఁ దామరగందములఁ గ్రిందఁ బఱపైచి కపురంపుఁదావిఁ దాఁ గవియు టేమి
చివురుజొంపపుగాలిజీబు మాయము సేసి పసిఁడియుప్పరిగఁ దాఁ బ్రబలు టేమి
నిద్దంపుటిసుము తిన్నియ పాన్పు దిగఁద్రావి యులరులపాన్పుఁ దా హత్తు టేమి
తే. మసమసక సంజ కెంజాయ మఱుఁగు వెట్టి-మిసిమి కెంపులకాంతిఁ దా మెఱయు టేమి
మొదలనే నింగతిటి నన్నె యడియు లేదొ-మాయయో కాకయిది యంచు మరలి చూచె.

ఉ. నా విని యానవీలకన నవ్వుమొగం బటు కొంత వంచి యెం
తే వెఱ నిర్వ్యళీక మునఁగి యాతనిఁ బాధ్యుఁ గాఁ నొకింత మఱ్
భావమునం దలంచియును నమ్మక యమ్మక నెల్ల యారకే
సేవ లొనర్చుచుంటి నని సిగ్గున దిగ్గున లేచి పోవఁగన్.

ఉ. గట్టిపచేఁతలుం బసలుఁ గల్లదనంబులు నీవు ఫట్టఁగాఁ
బుట్టిన, వంచు లేని పలు పోకల మాయలు నీకు వెన్నతోఁ
బెట్టిన విద్య, వెలింగియును వేలతనంబున నిన్ను నమ్మి నా
గుట్టును దేజమును నీమ్మకులఁ గోల్పడిపోయితి, నేమి సేయుదున్.

సీ. పరుసంబు గాఁగ చొప్పడని మామిడి తేనె లాన నానాస నట్టాడునవియుఁ,
దమకించి చిగురాకు గమిచి నోరెంగ కైనఁ గసుఁగి గొజ్జఁగనీటఁ గడుగునవియు

సంపంగిపాదరింటిచక్కి గోరటఁ గాంచి యాసు రంచు మగిడి నోరూరునవియుఁ
గలిగొట్టుపసరుమొగ్గలఁ గోర్కి పాలిపోయి మునుపటిమొల్లల మూఁగునవియు
ఆ. నగుచుఁ దేఁటికదుపు లాముదిఁ దలసూపెఁ-జూపుదనుక నెల్ల చోటఁ దోఁట
యంచుఁ దాను యనుచు నమ్మరునెలగోలు-పౌఁజు లనఁగఁ జూడ్కి పంపు వగుచు.

ఆంధ్రవాఙ్మయమునందుఁ బ్రబంధవాఙ్మయము ప్రతిభాయుత మైన సరసవాఙ్మయము. కాని యనుకరణవాఙ్మయమై ఆంధ్ర వాఙ్మయ ప్రవాహమును స్తంభింపఁజేసినది. విజయనగర సామ్రాజ్య విలయము ప్రజాప్రవృత్తిని స్తంభింపఁజేసినది. సాహిత్యవికాసము దుర్లభ మైనది. రాజులు, జమీందారులు, శ్రీమంతులు కృతిపతులై కావ్యములను బోషించినను బ్రతిభ లేని రాజ్యములవలెనే ప్రతిభ లేని సాహిత్యమును వెలసినది. సత్త్వాశ్రయము లేని కృతిపతులు, కృతికర్తలు బాహ్యాడంబరముల నాశ్రయించి ఆంతరంగికప్రయోజ నములను విస్మరించి కావ్యప్రయోజనమును నీరసముచేసిరి. భావనా శక్తి, పాత్రశీలము శుష్కించి, పదముల పటాటోపము ప్రబలినది. సుప్రసిద్ధమైన వసుచరిత్రయందే అనుకరణము ప్రారంభమై కాల క్రమమున సర్వవ్యాప్తిని గాంచినది.

౬
శతకవాఙ్మయము

ఆంధ్రవాఙ్మయాంగములందు శతక వాఙ్మయాంగము విశేష వ్యాప్తి గలిగి పండిత పామరహృదయరంజకముగ నున్నది. పురాణములు, శాస్త్రములు, కావ్యములు, ప్రబంధములు, నాటక ములు, నవలలు, కథలు వాఙ్మయాంగములందుఁ బ్రధానాంగములై నను శతకాంగమువలెఁ బండిత పామరహృదయముల నాకర్షింపఁ జాలవు. ఆంధ్రభాషయందు మహాకవులును, సామాన్య కవులును రసభరితములైన శతకములను రచియించి వాఙ్మయ వికాసమునకుఁ దోడ్పడిన విధమును శతకములు విశదము చేయుచున్నవి. లాక్షణి

కులు సామాన్యముగ శతకములను కావ్యగ్రంథములుగఁ బరిగణింపక పోయినను శతకవాఙ్మయము వ్యాప్తి గలిగి ప్రజాదరణమును బడసినది.

శతకార్థము :—శతపదజన్యమైన శతకపదము సంఖ్యాబాహుళ్యమును దెలుపుచున్నది. సంస్కృత ప్రాకృత వాఙ్మయములందుఁ గల శతపథబ్రాహ్మణము, అవదానశతకము మున్నగు నామము లధిక సంఖ్యార్థమును విశదము చేయుచున్నవి. జపమంత్రవిధానములందు సహస్రము, అష్టోత్తరశతము నియతసంఖ్యలుగ నేర్పడినవి. దైవ ప్రార్థనాపూజాదికములం దష్టోత్తరశతసంఖ్య బహుసంఖ్యార్థమును దెలుపుచున్నది. దేవీదేవతల యర్చనలందు సహస్రనామములను, అష్టోత్తర శతనామములను జెప్పుట సదాచారము. అక్షమాల లష్టోత్తర శతసంఖ్యగల పూసలను గలిగియున్నవి. శతకములందు సామాన్యముగను, నీ సంప్రదాయసిద్ధముగను ౧౦౮ పద్యము లుండును. శివతత్త్వసారము, వేమనశతకము మొదలగు శతకములు వందలకొలఁది పద్యములను గలిగియున్నవి. మఱికొన్ని శతకములందు ౧౦౦ పద్యములును గలవు. కాలాంతరమున నితరకవులు వారి సొంతపద్యములను మంచి శతకములందుఁ జేర్చుటయు శతకపద్యములందు సంఖ్యాభేదమునకుఁ గారణమై యుండును.

ఆంధ్రవాఙ్మయమునందు ౧౦౦౦ శతకములైనను నుండియుండును. శ్రీయుత వంగూరి సుబ్బారావుగారు ౬౦౦ శతకములను జూచినటులు శతకవాఙ్మయ చరిత్రమునందు వ్రాసియున్నారు. ఎన్నియో శతకములు నష్టమైనవియు, నజ్ఞాతములైనవియుఁ గలవు. కవిత్వధోరణిగల కవులు ప్రబంధాదికృతినిర్మాణములకుఁ బూర్వము శతకములను రచియించుట సామాన్యము. తిక్కన పోతనాది మహాకవులును శతకములను రచియించినటులు ప్రతీతి గలదు.

శతకములందు శృంగార హాస్యనీతిపరములైన శతకములు కొన్నియున్నను భక్తిశతకము లధికముగనున్నవి. కవులు తమయిష్ట

దేవతా స్తవపరములైన శతకములను రచియించి కవితాకన్యక నీశ్వరార్పణముచేయుట సంప్రదాయసిద్ధముగనున్నది. శ్రీరామశతకములు, కృష్ణశతకములు, శివపరములైన శతకములు, దేవీపరములైన శతకములు శతకవాఙ్మయమునందు విశేషముగఁ గలవు. వేమన శతకము, సుమతిశతకము, కుమారీశతకము మొదలగు నీతిశతకములు గలవు. వేణుగోపాల శతకము, మల్లికార్జునశతకము మొదలగు శృంగార భక్తి శతకములు గలవు. శృంగారశతకములు ప్రబంధ సంస్కారమునకు ఫలముగ నున్నవి. వీర శృంగార భక్తిరస సమ్మిళితములైన శతకములు గలవు. ఆంధ్రవాఙ్మయమునందు వేలకొలఁది శతకములు పుట్టినను శతకము లనేకములు నష్టమైనవి.

ఆంధ్రశతకముల వ్యక్తిత్వము:—ఆంధ్రశతక వాఙ్మయమునకు ప్రాకృత, సంస్కృత శతకవాఙ్మయములు మూలాధారమైనను నీ వాఙ్మయాంగవికాసము ప్రత్యేకవ్యక్తిత్వమును గలిగియున్నది. ఆంధ్ర శతకములకు మకుటము ప్రధానముగా నున్నది. సామాన్యముగ మకుటమే శతకనామమును దాల్చుచున్నది. దాశరథి, కాళహస్తీశ్వర, రంగశాయి, రామతారక, సుమతి, వేమనాది శతకముల మకుటము లాంధ్రశతకముల స్వరూపమును విశదము చేయుచున్నవి. భక్తిశతకములందు మకుటము లిష్టదేవతాపరములై యొప్పుచున్నవి. ధూర్జటి కాళహస్తీశ్వరుని, సోమనాథుఁడు వృషాధిపతిని, అన్నమయ్య సర్వేశ్వరుని, గోపన్న శ్రీ భద్రాద్రిరాముని, పోతరాజు శ్రీమన్నారాయణునిఁ దమశతకములందు సంబోధించి మకుటరూపమైన శతకనామకరణమును జేసిరి. వేమన, సుమతి, కుమారి మొదలగు నీతిశతకముల మకుటములు భావార్థపరములుగ నున్నవి. నారాయణాది శతకములందుఁగల ఆదిదశకాది శతకవిభాగములును నాంధ్ర శతకముల వ్యక్తిత్వమును దెలుపుచున్నవి. (ఆంధ్రవాఙ్మయమునందు శతకాంగము ప్రముఖాంగముగ నున్నను కావ్యాంగములయందు సందిగ్ధాంగముగ నున్నది.)

కావ్యాంగములు :—లాక్షణికులు కావ్యాంగములయందుఁ బురాణేతిహాస ప్రబంధ నాటకాదుల కొసఁగిన ప్రాముఖ్యమును శతకముల కొసఁగియుండలేదు. అప్పకవి శతకములనుండి కావ్యలక్షణముల కుదాహరణములను సంగ్రహించెను. అప్పకవి, విన్నకోట పెద్దన్నగారలు శతకములను క్షుద్రకావ్యములందుఁ జేర్చిరి. అనంతామాత్యుఁడు శతకములను చాటుప్రబంధములందుఁ జేర్చెను. కవిచరిత్రకారులు శ్రీ గురజాడ శ్రీరామమూర్తి, వీరేశలింగము పంతులుగార్లు కవుల చరిత్రములందు శతకముల ప్రశంసను జేసియుండలేదు. శతకములు లక్షణగ్రంథములందుఁ బ్రవేశమును గాంచక పోయినను ప్రజాహృదయమునందు స్థిరప్రవేశమును గాంచినవిధమును శతకముల సంఖ్య, శతకకర్తల నామములు, శతకముల ప్రచారము విశదముచేయుచున్నవి.

కావ్యాంగములను నిర్ణయించుటయందు శతకాంగమును నాంగ్ల కావ్యసంప్రదాయానుసారముగ నిర్ణయించుట యాంగ్లవిద్యాశిక్షితుల కాచారమైనది. శతకకవుల చరిత్రను రచియించిన కీ. శే. వంగూరి సుబ్బారావుగారును నీమార్గము నవలంబించి శతకములు భావగీతము (Lyrics) లను కావ్యాంగమునకుఁ జేరునటులు నిర్ణయించిరి. ఈ నిర్ణయ మాంధ్రకావ్యసంప్రదాయములకు సమన్వితము గాక సందిగ్ధముగనున్నది. శతకవాఙ్మయమును నాంధ్రవాఙ్మయమునకుఁ బరిచితమైన హ్రస్వకావ్య విభాగమునందుఁ జేర్చుటయే భావ్యముగ నుండును. నీతిశతకములందు విషయ సమన్వయము లేకపోయినను భక్తిశృంగార శతకములందు విషయ సమన్వయమును, భావసమన్వయమును గలవు. శతకవాఙ్మయము లాక్షణికుల యాదరణమును బడయక పోయినను, ప్రజాదరణమును బడసిన విధమును వాఙ్మయవ్యాపనము విశదము చేయుచున్నది. భక్తిశతకములు, నీతి శతకములు, శృంగారశతకములు ప్రజాజీవనమును రసవంతము చేయఁగల విధమును శతకముల యాదరణము చాటుచున్నది.

భక్తిశతకములు :—మానవులకు—సకలార్థములందును భక్తి తరణమునకు సాధనముగ నున్నది. పితృభక్తి, మాతృభక్తి, పతిభక్తి, గురుభక్తి, దేశభక్తి, దైవభక్తి మహత్తరమైన భక్తికి భిన్నరూపములు. భక్తులు తాము తరించి లోకమును తరింపఁజేయుచున్నారు. శ్రీరామచంద్రుని పితృభక్తి, సావిత్రి పతిభక్తి, ప్రహ్లాదుని దైవభక్తి భక్తిప్రభావమునకు నిదర్శనములు. అనన్యమైన భక్తి యిహపరలోక సౌఖ్యములకుఁ బరమసాధనము. దైవానుగ్రహమును బడయుటకు భక్తియోగము పరమసాధనముగ నున్నవిధమును భక్తుల చరిత్రలు తెలుపుచున్నవి. పండితులకు సాధ్యముగాని పరమపదము భక్తులకు సులభసాధ్యముగ నున్నది. వ్యాసులు జ్ఞానసాగరమైన భారతరచనానంతరము మోక్షప్రాప్తికి భక్తిసాగరమైన భాగవతరచనను జేసిన యితిహాసవృత్తము భక్తిప్రభావమును దెలుపుచున్నది. విశ్వరూపసందర్శనమున కనన్యమైన భక్తియే సాధనమని శ్రీకృష్ణభగవానుఁడు ప్రియభక్తుఁడైన యర్జునున కుపదేశించెను.

శ్లో. భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున!
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప!

శ్లో. మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః;
నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ!

భాగవతభక్తిభరితమైన ఆంధ్రహృదయ బృందావనమునకు శతకములు సహజఫలములుగ నున్నవి. భక్తిరసభరితములైన శతకముల నాంధ్రకవులు హృద్యముగఁ బాడి ప్రజాహృదయములందు భక్త్యుత్సాహములను ప్రజ్వలింపఁజేయఁగలిగిరి. రామదాసుగారి దాశరథిశతకము, ధూర్జటి కాళహస్తీశ్వరశతకము, పోతనామాత్యుని నారాయణశతకము, సుబ్బారాయఁడుగారి భక్తచింతామణిశతకము మొదలగు భక్తిభరితములైన వందలకొలఁది శతకము లాంధ్రభక్తహృదయమును వివశము చేయుచున్నవి. శతకములు పండితపామరహృదయములందును, బాలవృద్ధహృదయములందునుగలుగఁజేయఁగల

భక్తిరసావేశ మనుభవజ్ఞులకు విదితము. బ్రాహ్మీముహూర్తమున లేచి భక్తిరసపూరితమైన హృదయముతో దైవసంకీర్తనమును జేయుటకు శతకములు పరమప్రయోజనకరములుగ నున్నవి.

వైదికధర్మమును, కర్మమార్గమును నుద్ధరించుటకై రాజులు, బ్రాహ్మణులు సాహిత్యసాధనమునఁ జేసిన ప్రయత్నములు నిరర్థకములైన విధమును శతకవాఙ్మయము విశదము చేయుచున్నది. పండితాధీనమునందున్న సాహిత్యమును శతకములు ప్రజాధీనము చేసినవి. శతకకర్తలందు సామాన్యముగ వైదికకర్మమార్గమున కధికారములేని బ్రాహ్మణేతరులు కలరు. వారు శిథిలమైన కర్మమార్గమును నిరసించుచు భక్తిమార్గము నారాధించినవిధమును శతకములు తెలుపుచున్నవి. ఆ శతకములందు వేమనవిరచితమైన వేమనశతకము సకలవిధముల శ్లాఘ్యముగ నున్నది. వేమన మహాయోగి, మహాకవి, వేదాంతి, సత్యవాది. వేమనపద్యములు జడమయములైన వైదిక కర్మమార్గమును, దురాచారములను బరిహాసపాత్రముగ వర్ణించుచున్నవి. వర్తమానకాలమునందు గాంధి మహాత్మునివలెనే యాకాలమునందు మతమును, సంఘమును నావరించిన మహాజాడ్యములను బరిహాసమునకును, ఖండనమునకును బాలుచేసి ప్రజావికాసము చేయుటకు వేమన చేసిన ప్రయత్నము ప్రశంసనీయముగ నున్నది. ఆకాలమునందు పండితాదరణము లేకుండినను మనోహరమైన వేమనశతకమున కాంధ్రవాఙ్మయము నందు స్థిరమైనస్థానము గలిగినది.

ఆంధ్రసాహిత్యము సంస్కృత సాహిత్యావలంబనమును విడిచి స్వయంవ్యక్తిత్వము గలిగి వికసింపఁగలవిధమును శతకవాఙ్మయము విశదము చేయుచున్నది. శతకవాఙ్మయమునందలి భావములు, భాష, సాహిత్యము, శైలి ప్రాచీనమైన సంస్కృత సాహిత్యముమీఁద నాధారపడక నిత్యవ్యవహారములందు వ్యాప్తి యందున్న తెలుఁగు సాహిత్యముమీఁదను, శైలిమీఁదను, రీతులమీఁదను, గీతములమీఁదను నాధారపడి యథార్థమైన ప్రజాహృదయ

మును వెల్లడిచేయుచున్నది. వేమన, సుమతి, భాస్కర, రామ తారక, దాశరథి, భక్తచింతామణి మొదలగు శతకములు స్వతంత్ర కల్పనలతోను, తెలుఁగుసాహిత్యముతోను, జాతీయ వృత్తచ్ఛందస్సులతోను నిండియున్నవి. అనంతకృష్ణశర్మగారు తెలిపినటులు వేమన హస్తములం దాటవెలఁది ఆటబంతివలె మెలఁగినది. శతకవాఙ్మయము సహజమైన ఆంధ్రప్రజా హృదయమును సువ్యక్తము చేయుచున్నను, పండితాదరణము ను బడయకపోవుట ఆంధ్ర సాహిత్యోపాసకుల నావరించిన సంకుచిత భావమునకు లక్ష్యముగ నున్నది.

ఉర్వివారి కెల్ల నొక్కకంచముఁ బెట్టి - పొత్తు గుడిపి కులము పొలియఁ జేసి
తలను చేయిఁ బెట్టి తగనమ్మఁ జెప్పరా! - విశ్వదాభిరామ వినర వేమ.

బాపఁ డనఁగ నేమి? భక్తుఁ డనఁగ నేమి? - జోగి యనఁగ నేమి? సొంపు లేక
యెన్ని పేరు లైన నినజుఁడు పనిఁ దీర్చు - విశ్వదాభిరామ వినర వేమ.

ఎద్దు కైనఁ గాని యేఁడాది తెల్పిన - మాటఁ దెలిసి నడుచు మర్మ మెఱిఁగి
మొప్పె దెలియలేఁడు ముప్పదేండ్లకు నైన - విశ్వదాభిరామ వినర వేమ.

కూలినాలి చేసి గుల్లాముపని చేసి - తెచ్చి పెట్టెనేని మెచ్చు నాలు
చిక్కుపడ్డవేళఁ జీకొట్టుచుండురా - విశ్వదాభిరామ వినర వేమ.

ఉ. కంగొటిజున్ను మంగిటినిధానము పండినకల్పవల్లి ముం
గొంగునముత్తియం బనఁగఁ గూర్మి మన బుఁ దొంగలింపఁ గా
జంగమకోటి కర్చనలు సల్పుచు సన్నయగణ్యపుణ్య నీ
వంగడ మేఁజుమయ్య బసవా! బసవా! బసవా! వృషాధిపా.

శా. ఏ నిన్నే శరణంబు బాంధవులు గానీ యెల్లవారుం బగే
కానీ మృత్యువు తల్లక్రిందుపడనీ కాలుండు గీవెట్టనీ
నా నాకర్మచయంబు గింజుకొననీ నా కేమి నీరాజ సిం
తే నీచాటున దాఁగియున్నపుడు భీతే యింక సర్వేశ్వరా!

మ. చరణాబ్జంబులు పీక్వడ న్నిలిచి నోజన్ దట్టిగోఁ జల్లఁగ్రోల్
కర మొప్పారఁగ నుంచి యింపొదవఁ జంకన్ గోల నందిచ్చి ప
ల్వురు గోపాలురు చుట్టునుం గొలువ వేల్పుల్ గ్రుళ్ళిలన్ గ్రింగఁగా
నరయం జల్ది భుజింపవే యడవిఁ గృష్ణా! దేవకీనందనా! (దేవకీనందన శతకము)

మ. గడియల్ రెంటికొ మూటికో గడియకో కాదేని నేఁ డెల్లియో
కడ నేఁడాదికొ యెన్నఁడో యెఱుఁగ రీకాయంబు లీభూమిపైఁ
బడఁగా నున్నవి; ధర్మమార్గ మొకటిం బాటింప రీమానవుల్
చెడుగు ల్నీపదభక్తియుం దెలియ రో శ్రీకాళహస్తీశ్వరా.

సీ. ఎండుల కేగిన నేపనిఁ జేసిన చలమునకైనను చదువునైన
బంగారుపనికైన శృంగారములకైన సుద్దులకైనను ముద్దుకైన
యాత్రలకైనను రాత్రులకైనను నుపవాసములకైన నాసక్తికైన
జపములకైనను తపములకైనను గలుగదు మీ దివ్యఘనపదంబు
భక్తిచే నిన్నుఁ దలఁచిన భాగ్యవంతు-లిందు నందును వేడ్కతో నంది నిన్ను
ప్రబలుదురు గాన ననుఁ గావు పంకజాక్ష-రామతారక దశరథరాజతనయ.

౭
గేయ వాఙ్మయము

ఆంధ్రవాఙ్మయాంగములయందు గేయవాఙ్మయము సహజమైన ప్రజాసాహిత్యమునకు లక్ష్యముగనున్నది. పండితసాహిత్యమునకును, ప్రజాసాహిత్యమునకును వాఙ్మయ స్వరూప స్వభావములందు భేదము గనుపట్టుచున్నది. పండితులందుఁ ప్రతిభావంతులు వారికావ్యములను ప్రజాసాహిత్యమునకుఁ ప్రతిబింబములనుగ రచియించినను సామాన్యులు పాడినపాటనే పాడుచు వారి కావ్యములను ప్రజాసాహిత్యమునకుఁ ప్రతిబింబము చేయఁజాలరు. సంస్కృతసాహిత్యాధారమున నభివృద్ధి జెందిన ఆంధ్రవాఙ్మయ మీవిషయమును విశదము చేయుచున్నది. ఆంధ్రకావ్యములందు భాష, భావములు, వృత్తములు, సంప్రదాయములు, కథా సందర్భములు విశేషముగ సంస్కృతవాఙ్మయమునకు ప్రతిబింబములుగ నున్నవి. కవులకు లక్ష్యము తెలుఁగురచనలైనను లక్షణము సంస్కృతవాఙ్మయము. సామాన్యముగ అగ్రజాతులవారు కవులును, గ్రంథకర్తలును నై ఈ లక్ష్యమునే యారాధించుచుండిరి. పామరులు-ముఖ్యముగా నిమ్నజాతులవారు కావ్యరసానందము ననుభవించుటకు మనోహరములైన గేయములు సాధనములుగ నుండెను. జంగములు, దాసరులు, భట్రా

సుప్రసిద్ధ శతకకవులు, వారికాలము, వారిశతకములు. ౧౨ మొదలు ౧౮ శతాబ్దము వఱకు

కవి పేరు	కవి కాలము	శతక నామము	విషయము
పండితారాధ్యులు	౧౨౨౧	శివతత్త్వసారము	భక్తి (శైవము)
పాలకురికి సోమనాథుఁడు	౧౧౭౦	వృషాధిపశతకము	,,
బద్దెన	౧౧౭౫	సుమతిశతకము	నీతి
యథావాక్కుల అన్నమయ్య	౧౨౪౧	సర్వేశ్వరశతకము	భక్తి
శివదేవమంత్రి	౧౨౮౦	శివదేవశతకము	వైరాగ్యము
రావిపాటి త్రిపురాంతకుఁడు	౧౩౭౦	అంబికాశతకము	శృంగారము
వెన్నెలకంటి జన్నయ్యకవి	౧౪౫౦	దేవకీనందనశతకము	భక్తి
వేమన	౧౫-వ శతాబ్ది	వేమనశతకము	నీతి
బమ్మెరపోతనామాత్యుఁడు	౧౪౭౦	నారాయణశతకము	భక్తి
అయ్యలరాజు త్రిపురాంతకుఁడు	౧౪౬౦	రఘువీరశతకము	,,
ధూర్జటికవి	౧౫౩౦	శ్రీకాళహస్తీశ్వరశతకము	,,
తాళ్లపాక అన్నమయ్య	,,	వేంకటేశ్వరశతకము	శృంగారము
కంసాలి రుద్రకవి	౧౫౬౫	బలవదక్శతకము	భక్తి
పరమానందయతి	౧౫౮౦	సంపగిమన్న, పరమానంద, దత్తాత్రేయ శతకములు	,,
ఎలకుర్తి రామరాజు	౧౬౦౦	రామలింగశతకము	,,
వైదిపాటి వేంకటనృసింహకవి	౧౬౬౦	రామచంద్రమన్నారు కృష్ణశతకములు	,,
అయ్యలరాజు నారాయణకవి	౧౬౬౦	ఆంజనేయశతకము	,,

కంచర్ల గోపన్న	౧౬౭౪ ౧౬౯౪	దాశరథిశతకము	,,
కూచిమంచి తిమ్మకవి	౧౭౧౫	కుక్కుటేశ్వరశతకము	,,
గోగులపాటి కూర్మనాథకవి	౧౬౨౪	సింహాద్రినారసింహాశతకము	,,
అడిదము సూరకవి	౧౮-వ శతాబ్ది	రామలింగేశశతకము	నీతి
మఱింగంటి సింగరాచార్యులు	౧౭౫౦	సీతాపతిశతకము	భక్తి
ఆదివెల్ల సీతారాముడు	౧౭౫౦	జానకీపతిశతకము	,,
శేషప్పకవి	౧౮-వ శతాబ్ది	నృసింహాశతకము	నీతి
పావులూరి మల్లన	౧౭౫౦	భద్రాద్రిరామశతకము	భక్తి
నృసింహకవి	౧౭౬౦	కృష్ణశతకము	,,
కాందూరు వెంకటదాసు	౧౮౦౦	దీనచింతామణిశతకము	,,
కాసుల పురుషోత్తమకవి	౧౮౦౦	ఆంధ్రనాయక, హంసలదీవి, గోపాల, మానసబోధ, భక్తకల్పద్రుమ శతకములు	,,
సదానంద వరదరాజయోగి	౧౮౦౦	సదానందవరదరాజయోగశతకము	వేదాంతము
తరిగొండ వెంకమ్మ	౧౮౪౦	కృష్ణమంజరీద్విపద	భక్తి
బంకి బాపనమ్మ	౧౮-గ శతాబ్ది	మీనాక్షీశతకము	,,
అల్లమరాజు సుబ్రహ్మణ్యకవి	౧౭౩౫	సింహాద్రి, రమాధిప, కృష్ణ, భూపతిలలామాది శతకములు	,,
శిష్టు సర్వశాస్త్రి	౧౮౭౦	శిష్టు సర్వశాస్త్రి	,,
విజయనగరపు వెంగళాయకవి	,,	మదనగోపాలశతకము	,,
గుణంకొండ భక్తవత్సలుడు	౧౮౮౫	సుబుద్ధిశతకము	,,

జులు, బైరాగులు, భాగవతులు మొదలగువారు మాలపల్లెలందును, పల్లెలందును జంగమకథలను, సుద్దులను జెప్పుచుఁ, గీర్తనలను బాడుచుఁ బ్రజల కానందమును గలుగఁజేయుచుండిరి. ద్విపదలు, కీర్తనలు, వచనములు, తుమ్మెదపాటలు, ఏలపాటలు, యక్షగానములు గేయకావ్యముల రూపమునఁ గావ్యరసానందమును బామరులకుఁ గలుగఁజేయుచుండెడివి. ద్విపదకావ్యములు కావ్యరసానందమును, భక్తిని, వీరావేశమును గలుగఁజేయఁగల విధమును బసవపురాణము, పల్నాటి వీరచరిత్రము, నవచోళ చరిత్రము, రంగనాథ రామాయణము, హరిశ్చంద్రోపాఖ్యానము మొదలగు ద్విపదకావ్యములు విశదము చేయుచున్నవి. స్త్రీలు, జంగములు, దాసరులు పురాణేతిహాసములలోని విషయములను యక్షగానరూపమున మనోహరముగఁ బాడుచు బ్రహ్మానందము ననుభవించుచుండిరి. యాచకులు, బైరాగులు రామదాసుకీర్తనలను, తత్త్వములను బాడుచుఁ బ్రజాహృదయమునందు భక్తిజ్ఞానములను గలుగఁజేయుచుండిరి. పాటకజనము పనిచేయునపుడు శృంగార హాస్యరస భరితములైన ప్రేమగీతములను బాడుచు నానందమును గలుగఁజేయుచుండిరి. ప్రజాసామాన్యమునకుఁ బరిచితమైన సాహిత్యమునకుఁ బండితులు చూపిన నిరాదరణ, నిరసన భావము లాంధ్రవాఙ్మయవికాసమున కభ్యంతరములుగ నేర్పడినవిధము నాంధ్రసాహిత్యచరిత్రము విశదము చేయుచున్నది. శిష్టులకును, సామాన్యులకును సాంఘికజీవనమందు సామరస్యమును గలుగఁజేయుటకు రసానుభవబృందావనము సాధనముగ నున్నది. రసానుభవమునకు సాహిత్యాంగములైన కావ్యములు, గేయములు, కీర్తనలు, కృతులు, పాటలు సాధనములుగ నున్నవి. ప్రజాశక్తి విజృంభించునపుడు సాహిత్యాంగములు విజృంభించి యానందము గలుగుటయు, ప్రజాశక్తి కృశించునపుడు సాహిత్యాంగములు కృశించి యానందము లేకుండుటయు ప్రపంచేతిహాసములం దనుభవసిద్ధమైన విషయము. హృదయవికాసమే సాహిత్యవికాసమునకు సాధనము.

బుద్ధయుగమునందును, మౌర్య గుప్త సామ్రాజ్యకాలములందును, వీరశైవ వీరవైష్ణవ యుగములందును, కాకతీయ విజయనగర సామ్రాజ్యకాలములందును, వర్తమానగాంధియుగమునందును ప్రజా ప్రబోధము సాహిత్యాభ్యుదయమునకు వినియోగపడినవిధము నాయా కాలములందు ప్రయత్నముగ ప్రజాహృదయాంతరాళమునుండి వెడలిన కీర్తనలు, పాటలు, గీతములు, నాటకములు మొదలయిన సాహిత్య స్వరూపములు విశదముచేయుచున్నవి. సత్త్వాశ్రయము లేని సాహిత్యము మానవధర్మాభ్యుదయమునకు నిరాశ్రయముగ నున్నది. వర్తమానయుగమునందు విద్యావంతులకును, సామాన్యులకును సంఘజీవనమునందు రసానందము ననుభవించుటకు సంయోగసాహచర్యములు దుర్లభములుగనున్నవి. రసావేశపరాయణమైన యువజన హృదయము ప్రజాశక్తిని సకల రంగములందును వికసింపఁజేసి ఆంధ్ర సాహిత్యమహోదయమును జేయుటకు శ్రీ శారదాదేవి యనుగ్రహించుఁ గాత !

గేయవాఙ్మయమునందు శృంగారరసభరితములైన క్షేత్రయ్యగారి మువ్వగోపాల పదములు, తాళ్లపాకవారి తత్త్వవచనములు, త్యాగరాజస్వాములవారి కృతులును ఆంధ్రసాహిత్యమునకు సహజాలంకారములుగ నున్నవి. త్యాగరాజకృతు లాంధ్రసాహిత్య రసామృతమును దివ్యమార్గమునఁ బ్రసాదించుచు బ్రహ్మానందమును గలుగఁజేయుచున్నవి.

శ్రీ రా మ భ క్తి

త్యాగరాజస్వామి శ్రీరామభక్తిపరవశుఁడై పాడిన కృతులు శ్రీరామభక్తులకు భక్తిరసావేశమును గలుగఁజేయుచున్నవి. ఆంధ్ర హృదయేశ్వరుఁడైన శ్రీరామమూర్తి త్యాగరాజునకు ఇష్టదైవము. వాల్మీకిమునిపుంగవుఁడు కావ్యరూపమున మనోహరముగ రామాయణమునందుఁ బ్రత్యక్షముచేసిన శ్రీరామచరితమును త్యాగరాజస్వామి గానరూపమునఁ గృతులందుఁ బ్రత్యక్షముచేసి పండిత పామరులకు శ్రీరామభజనానందమును సులభసాధ్యము చేసెను.

తిక్కన కవిబ్రహ్మ; త్యాగరాజు గాయకబ్రహ్మ. ఆంధ్ర భక్తిహృదయము, ఆంధ్రభాషామాధుర్యము, ఆంధ్రకావ్యరసామృతము, ఆంధ్రగానానందమును త్యాగరాజకృతులం దేకస్థాయియందు సమ్మేళనముఁబొంది బ్రహ్మానందమును గలుగఁజేయుచున్నవి. త్యాగరాజకృతులు రసరాగభావభరితములై నాదబ్రహ్మానందమును గలుగఁజేయుచున్నవి.

నాదోపాసనము - బ్రహ్మానందము

బ్రహ్మానందానుభవమునకు రసరాగలయ బద్ధమైన నాదోపాసనము పరమసాధనముగ నున్నది.

విశ్వావ్యక్తమైన పంచవింశతితత్త్వములును శ్రుతిరాగలయ బద్ధములై విశ్వశ్రుతియందు సమ్మేళనమును బొందుచున్నవి. సృష్టిక్రమమునం దాకాశతత్త్వ మవ్యక్తస్థితిని దెలుపుచున్నది. నిర్గుణమైన ఆకాశతత్త్వము సగుణమైన స్వరరూపమున బోధ్య మగుచున్నది. అనంతమైన యాకాశతత్త్వము అనంతశయనుని మాహాత్మ్యమును నాదరూపమున వ్యక్తముచేయుచున్నది. నాదము బిందుకళారూప పరిణామమును బొందుచు స్వరరాగసాహిత్యస్వరూపముల వ్యక్తమగుచున్నది. అఖండమైన నాదము శబ్దస్పర్శరూప రసగంధావస్థలయందు నాదప్రభావమును కర్మేంద్రియములకును, జ్ఞానేంద్రియములకును వ్యక్తము చేయుచున్నది.

ఓంకారప్రభావ మనిర్వాచ్యము. నాదబ్రహ్మోపాసకు లఖండమైన నాదప్రభావమును స్వరరాగలయబద్ధ మైన గానరూపమున విశ్వమునకుఁ బ్రత్యక్షముచేసి బ్రహ్మానందమును గలుగఁజేయుచున్నారు. నారదుని తుంబురునాదము ముల్లోకములను బాలించుచున్నది. శ్రీకృష్ణుని మురళీగానము విశ్వశ్రుతిని మేళవించి విశ్వమునంతను బ్రహ్మానందపరవశము చేయుచున్నది. గానరసము విశ్వమును బ్రహ్మానందపరవశముచేయఁగల విధమును నిత్యానుభవము విశదము చేయుచున్నది. పశువులు, పక్షులు, మృగములు, పండితులు పామ

రులు, శిశువులు వృద్ధులు, స్త్రీలు పురుషులు గానరసాస్వాదనమును జేయుచు పరమానందము ననుభవించుచున్నారు. గాయకబ్రహ్మ రచించిన కృతు లాంధ్రహృదయరంజకములై భక్తిరసమును, గానామృతమును, కావ్యానందమును కురియుచుఁ బరమానందమును గలుగఁజేయుచున్నవి.

గానము - భక్తియోగము

మానవులు చతుర్విధపురుషార్థములను సాధించుటకు భక్తియోగము ప్రశస్తమైన సాధనముగ నున్నది. ధర్మార్థకామమోక్షములను బడయుటకు భక్తియోగ ముత్తమసాధనము. పితృభక్తి, దేశభక్తి, దైవభక్తి ధర్మార్థకామములకును, మోక్షమునకును సాధనములుగ నున్నవి. అనన్యమైనభక్తి విశ్వరూపసందర్శనమునకు సాధనమని భాగవతోత్తముల యనుభవము విశదము చేయుచున్నది.

చిత్తము ప్రవృత్తినుండి మరలి భక్తిరసానందము ననుభవించుటకు గానము హృద్యమైన సాధనముగ నున్నది. కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు, అంతఃకరణచతుష్టయము ఏకస్థాయియందాత్మానుసంధానమును బొంది బ్రహ్మానందానుభవము గలుగుటకు గానము సులభసాధనముగ నున్నది. వాక్కు, శ్రోత్రము, చిత్తము గానమునం దేకస్థాయిని బొందుచు భక్తియోగానుభవము సులభసాధ్యమగుచున్నది, సాహిత్యము, స్వరము, భావము గానమునందు సుశ్రుతిబద్ధములై భక్తియోగానందమును గలుగఁజేయుచున్నవి. గానయోగము భక్తియోగానందమునకును, విశ్వశ్రుతియందాత్మానుసంధానమునకును సాధనముగ నున్నది. విశ్వమునందు సుశ్రుతి నిరతిశయానందమునకును, అపశ్రుతి దుఃఖమునకును మూలములగుచున్నవి. త్యాగరాజు నాదోపాసన చేయుచు రామబ్రహ్మ భక్తియోగానందము ననుభవించినవిధమును కృతులు వెల్లడిచేయుచున్నవి. గాన మఖండమైన భక్తియోగపరమైనపుడు బ్రహ్మానందమును, కామయోగపరమైనపుడు దుఃఖమును గలుగఁజేసెడివిధమును త్యాగరాజకృతులు మనోహరముగ బోధించుచున్నవి.

త్యాగరాజు - గాయకబ్రహ్మ

త్యాగరాజురచియించినకృతులు సంగీతమునకును, కర్ణాటక గానమునకును, ఆంధ్రసాహిత్య సంగీతములకును ప్రతిభను సమకూర్చినవి. బీజరూపమున నపరిచితముగ నున్న రాగములకు స్వర సాహిత్యస్వరూపములను గల్పించి రాగములను సువ్యక్తముచేసిన గాయకబ్రహ్మ త్యాగరాజు. స్వల్పమైన భేదములు గల రాగములకును సాంకర్యదోషము గలుగకుండ శుద్ధరూపములను నిర్మించి గానకళ కపూర్వమైన ప్రతిభను గల్పించి త్యాగరాజు మహత్త్వమును బడయఁగలిగెను. పాటలయందును, కీర్తనలయందును సాంకర్యబీజరూపమున వాడుకయందున్న రాగములు త్యాగరాజకృతులయందు ప్రస్తారమును బొంది సాహిత్యస్వరూపమును దాల్చినవి. శృంగారకామకీర్తనలపరమై యధోగతిపాలైన సంగీతము త్యాగరాజకృతులయందు భగవద్భక్తిపరమై యున్నతస్థానము నధిష్ఠించినది. వేశ్యాంగనలపాలైన గానము భాగవతోత్తములవశమైనది. నీచాశ్రయమువలన నిందాపాత్రమైన సంగీతము మహదాశ్రయమును బొంది పూజాపాత్రమైనది. త్యాగరాజు సాహిత్యసంగీతమునకును, భక్తిగానమునకును, భావరాగమునకును తన కృతులయందు పరమార్థయోగమును గల్పించి సంసారప్రవృత్తియందుఁ బురుషార్థమును సుఖారాధ్యముచేసిన ధన్యాత్ముఁడు. ఆంధ్రహృదయమై భవమునకు లక్ష్యమైన త్యాగరాజగానామృతము నాంధ్రులు సేవించి ఆత్మసాక్షాత్కారమునుబొంది చరితార్థు లగుదురుగాత!

తేటతెలుఁగుమాటలు, మధురరాగములు, సరళభావములు త్యాగరాజకృతుల కనిర్వచనీయమైన మాహాత్మ్యమును గాయకభక్తబృందావనమునందును, నాంధ్రవాఙ్మయమునందును సమకూర్చుచున్న విధము నీకృతులు తెలుపుచున్నవి.

ప. నినువినా నామ దెందు - నిల్వదే శ్రీహరిహరి.
అ. కనులకు నీ సొగసెంతో - కమ్మియున్నది; గనుక

చ. నీదుకథలు వీనులంటు నిండియున్నవి రామ
శ్రీద నీనామము నోటఁ జెలగియున్నది గనుక
నేను ఎచటఁ జూచినను నీవైయున్నది రామ
భానువంశతిలక ! నీదు భక్తుఁ డనుచు పేరుగనుక
కపటమౌ మాట లెల్ల కమ్మనైనవి నాదు
తపముయొక్క ఫలము నీవే త్యాగరాజసన్నుత.

* * * *

ప. నాదోపాసనచేసే - శంకరనారాయణవిధులు వెలసిరి ; ఓమనసా !
అ. వేదోద్ధరులు, వేదాతీతులు, విశ్వమెల్ల నిండియుండెడి వారలు.
చ. మంత్రాత్ములు యంత్ర తంత్రాత్ములు మఱి-మంత్రము లన్ని గలవారలు,
తంత్రీ లయ స్వరరాగ విలోలులు - త్యాగరాజవంద్యులు స్వతంత్రులు.

* * * *

ప. నాదలోలుఁడై బ్రహ్మా-నంద మందవే ; మనస !
అ. స్వాదుఫలప్రద సప్త-స్వర రాగ నిచయ సహిత
చ. హరిహరాత్మభూసురపతి - శరజన్మగణేశాది
వర మహాను లుపాసించిన - ధర త్యాగరాజ వినుత !

* * * *

ప. నిధి చాలసుఖమా ? రాముని స - న్నిధిసేవ సుఖమా ?
నిజముగ బల్కు మనసా
అ. దధి నవనీత క్షీరములు రుచిమో? దాశ-రథి ధ్యాన భజన సుధారసము రుచియో ?
చ. దమశమమను గంగాస్నానము సుఖమా? క-ర్దమ దుర్విషయకూప స్నానము సుఖమా
మమత బంధనయుత నరస్తుతి సుఖమా?-సుమతి త్యాగరాజనుతుని కీర్తనసుఖమా?
(త్యాగరాయకృతులు)

ఓ వెఱ్ఱిగాఁడ ! నీయువిద మేల్ సాధ్వి,
దానిఁ జంపఁగ నాయితం బైతి వకట !
మనునవల్లనె కదా మగనికి ముక్తి,
మగు వెట్టిదైనఁ జంపఁగ రాదు మగఁడు,
నరజీవమును గొన నరుఁ డెంతవాఁడు ?

నరహంతకూలును నరకంబునందు ;
పుడమిపై నేకార్యమును నాదుమదల
లేక పాటిలదు ; చలింపదు చీమ ;
అటు బోయి చూడు మా యవనీసురుండు...... (సురాభాండేశ్వరము)

౮
వర్తమాన యుగము

వాఙ్మయవికాసమునకు నాటకాంగము పరిపక్వఫలముగ నున్నది. దృశ్యకావ్యములను రచియింపఁగల కవులు మహానుభావులు. సంస్కృతమునం దుత్తమమైన నాటకములు గలవు. మృచ్ఛకటి, శాకుంతలము, మాలతీమాధవము, రత్నావళి, మాలవికాగ్నిమిత్రము, ప్రియదర్శిక, విక్రమోర్వశీయము, ఉత్తరరామ చరిత్రము, ముద్రారాక్షసము, ప్రబోధచంద్రోదయము మొదలగు నుత్తమమైన నాటకములు గలవు. భారతభాగవత రామాయణాది మహాకావ్యములు, పురాణేతిహాసాదులు, మాహాత్మ్యములు, చంపువులు మొదలగు సంస్కృతగ్రంథముల నాంధ్రీకరించిన ప్రతిభావంతులైన యాంధ్రకవులు నాటకముల నేల యాంధ్రీకరింపలేదో దురూహ్యముగ నున్నది. శ్రవ్యకావ్యముల నాంధ్రీకరించిన పండితులకు దృశ్యకావ్యముల నాంధ్రీకరించుట దుర్లభముగాదు. ఆంధ్రకవుల నావహించిన భయభ్రాంతులే నాటకానువాదమునకును, నాటకరచనకును బూనుకొనకుండుటకును గారణమైయుండును. పూర్వకాలమున "నాటకాంతంహి సాహిత్యమ్" అని పెద్ద లభిప్రాయపడుచుండిరి. ఆ కారణముచేతనే ఆంధ్రకవులు నాటకముల నాంధ్రీకరించుటకును, వ్రాయుటకును బూనుకొనఁజాలకుండిరి. కారణమేమైనను వర్తమాన యుగమువఱకును ఆంధ్ర వాఙ్మయమునందు నాటకములు వెలువడలేదు. యక్షగానములు, కూచిపూడివారి భాగవతములు, నాటకములు మొదలగు వీథి నాటకములు కొంతకాలము ప్రజాహృదయమును నాకర్షించినవి. వర్త

మాన కాలమునందు ఆంగ్లవిద్య వ్యాపించినతరువాత నాంధ్ర వాఙ్మయమునందు నాటకరచన లేర్పడినవి. నాటకములందు సంస్కృత నాటకముల కనువాదములును, ఆంగ్లేయ నాటకముల కనువాదములును, స్వతంత్రనాటకములును గలవు. వర్తమాన యుగమునం దారంభమైన నాటకవాఙ్మయ విమర్శనమునకుఁ బూనుకొనుట ప్రస్తుతాంశమునకుఁ బ్రయోజనకరము కాదు.

ఆంధ్రవాఙ్మయమునందు ఇంతవఱకును రమారమి ౧౦౦౦ నాటకములు రచియింపఁబడి యుండును. నాటకరచయితలందు సంస్కృత మార్గమును బ్రశంసించెడివారు కొందఱును, ఆంగ్లమార్గమును బ్రశంసించెడివారు కొందఱును కలరు. రెండుమార్గముల నవలంబించెడివారును బరసాహిత్యారాధనమునకుఁ బూనుకొనుచున్నారే కాని ఆంధ్రసాహిత్యారాధనమునకుఁ బూనుకొనుటలేదు. నాటకములు దృశ్యకావ్యములు. ప్రజాజీవనమును ప్రేక్షకులకుఁ బ్రత్యక్షము చేయుట కేర్పడినవి. ప్రాచ్యసాహిత్యమునకును, పాశ్చాత్యసాహిత్యమునకును సంబంధించిన పురాణకథలను నాటకరూపమునఁ బ్రదర్శించుటవలన వర్తమానకాలమందలి ధర్మాభ్యుదయమునకుఁ బ్రయోజనము కలుగఁజాలదు. నాటకములు ప్రజల ధర్మాభ్యుదయములకుఁ బ్రయోజనకరము లగుటకు నాటక విషయములు ప్రజాభీష్టములకు ప్రతిబింబములై యుండవలయును. ఈ ప్రయోజనమును సమకూర్పఁగల నాటకము లాంధ్రభాషయందు సకృత్తుగ నున్నవి.

వర్తమాన యుగమునందు నాటకరచయితలందు బళ్లారి కృష్ణమాచార్యులుగారు, కోలాచలము శ్రీనివాసరావుగారు, కందుకూరి వీరేశలింగంగారు, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు, పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు, బలిజేపల్లి లక్ష్మీకాంతముగారు మొదలైనవారు ప్రజాదరణమునకుఁ బాత్రులయినవారు. గురజాడ అప్పారావుగారు రచించిన కన్యాశుల్కము సంఘజీవనమునకుఁ బ్రతిబింబమై ప్రజాచిత్తము నాకర్షించినది. వేదము వేంకటరాయశాస్త్రిగారి

ప్రతాపరుద్రీయమును ప్రజాదరణమును బడసినది. ఆంధ్రవాఙ్మయమునకు నాటకాంగము ప్రయోజనకరమైన సాహిత్యాంగముగఁ బరిణమించుటకు స్వతంత్రమైన నాటకరచనలు కావలసియున్నవి.

పూర్వకాలమునందు కాళిదాసాదిమహాకవులు రాజాస్థానములందుఁ బండితుల సమక్షమునందు నాటకములను ప్రదర్శించుచుండిరి. వారినాటకములును పండితులను రంజింపఁజేయుటకు ఏర్పడినవిగాని, ప్రజలను రంజింపఁజేయుట కేర్పడలేదు. వర్తమానకాలమునం దాస్థితియంతయు మాఱినది. రాజాస్థానములు లేవు. రాజపోషకులు లేరు. రంగములు మాఱినవి. భావములు మాఱినవి. నాటకప్రదర్శనమునకు ప్రజాపోషణ సాధనమైనది. ఈ నవీనపరిస్థితులందు నాటకములును నవీనరూపములను దాల్పవలసియున్నవి. వర్తమానయుగప్రయోజనములకు భరతాచార్యుని సిద్ధాంతములును, షేక్స్పియరు సిద్ధాంతములును- నవి యెంత ఉత్తమములైనను - సాధనములు కావు. నాటకకర్త లాంధ్రసాహిత్యహృదయమున కనురూపముగ నాటకములను రచియించి వాఙ్మయాభ్యుదయమునకును, విశ్వకల్యాణమునకును తోడ్పడవలసియుందురు. నాటకములందుఁ బాటలను, పద్యములను జేర్చుటయందుఁగల భేదాభిప్రాయములను నాటకకర్తలు గ్రహించి నాటకము నున్నతస్థానము నధిష్ఠింపఁజేయుదురు గాత !

గద్యవాఙ్మయము

సకలభాషలయందును మొదట పద్య వాఙ్మయమును, తదనంతరము గద్యవాఙ్మయమును బుట్టుట సహజస్థితిగ నున్నది. భాష వికసించి నియమము లేర్పడినతరువాతనే గద్య కావ్యములను వ్రాయుట సాధ్యమగును. రసప్రధానమైన పద్యకావ్యమునకును, విషయప్రధానమైన గద్యకావ్యమునకును భాషయును, భావములును మూలాధారములైనను భిన్నమైన రచనల కవసరమైన సాధనసామగ్రి భిన్నముగనున్నది. పద్యరచన రసానందమునకు సాధనమై ఉత్సాహోద్రేకములతోఁ గవులముఖమునుండి వెలువడుచున్నది. పద్యకావ్య

ములు పాడుటకు వీలై, శ్రావ్యములై కావ్యరసానందమును గలుగఁ జేయుచున్నవి. కవులు వీరగుణసంకీర్తనమును జేయుచు ప్రజలకు హృదయప్రమోదమును గలుగఁజేయుదురు. పద్య కావ్యములు నియమబద్ధములుగ రచింపఁబడినను పదముల పొందిక, నడక, కల్పనలు, భావనాశక్తి కవిత్వతత్త్వాశ్రయములుగ నుండును. గద్య కావ్యములు వ్యాకరణతత్త్వాశ్రయములై విషయ ప్రధానములుగ నుండును.

ఆంధ్రవాఙ్మయమునం దాదియుగమునుండియు గద్యరచన గోచరమగుచున్నను గద్యవాఙ్మయము చిరకాలమువఱకు నభివృద్ధిని బొందియుండలేదు. గద్యరచనలు శాసనములందుఁ గలవు; భారతరామాయణ భాగవతాది గ్రంథములందును, ప్రబంధములందును గలవు. నన్నయకృత భారతమునందలి గద్యములు సంస్కృత ప్రాయము లయినను ఆంధ్రభాషాహృదయమును విశదముచేయుచున్నవి. పదముల లాలిత్యము, శైలి, విషయావబోధము, రచనాకౌశల్యమును ఆంధ్రగద్య రచనలకుఁ బ్రమాణములుగ నున్నవి. నన్నయ గద్యరచనయందుఁ బద్యరచనయందువలెనే సంస్కృత వాహినీ ప్రాబల్యము ద్యోతకమగుచున్నది.

వ. అట దుర్యోధనుండు శకునిసహితం బా సభావిభవంబుఁ జూచువేడుక నందుఁ గొన్నిదినంబు లుండి యొక్కనాఁడు దాని యపూర్వరమణీయతకు విస్మయంబందుచు నయ్యైప్రదేశంబులం గ్రుమ్మరువాఁడు వివృతంబైన ద్వారదేశంబు సంవృతంబుగా వగచి చొరనొల్లక సంవృతంబైనదాని వివృతంబుగా వగచి చొరం బోయి లలాటఘట్టితగృహద్వారుండయి సముప్రదేశం బున్నతంబుగా వగచి యొక్కసముకట్టి నీలాశ్మరశ్మిస్థగితంబైన విమలమణిస్థలంబు జలాశయంబుగా వగచి పరిధానం బెగఁ ద్రోచికొని స్ఫటికదీప్తి జాలపరివృతంబైన జలాశయంబు స్థలంబుగా వగచి కట్టినపట్టంబు దడియం జొచ్చి క్రమ్మఱిన వానిం జూచి పాంచాలియుఁ బాండుకుమారులును నగిరంత..... (శ్రీమదాంధ్రమహాభారతము-సభాపర్వము.)

తిక్కనసోమయాజి పద్యరచనలయందుఁ జూపిన ఆంధ్ర సాహిత్య వాహినీ ప్రాబల్యమును గద్యరచనలందుఁ జూపియుండ

లేదు. ఆంధ్రహృదయమునకుఁ బ్రియమైన పద్యరచనానుభూతియే ఆంధ్రసాహిత్యవాహిని తిక్కనగద్యరచనలయందుఁ బద్యరచన లందు వలెఁ బరిస్ఫుటము గాకుండుటకుఁ గారణమై యుండును. నిర్వచనోత్తరరామాయణ రచనయే తిక్కనకుఁ బద్యరచనయందుఁ గల యాదరణమును విశదముచేయుచున్నది.

వ. మున్ను దనతోడం జనినవార లందఱు నచ్చోటన నిలువ నిట్లు వచ్చి సుయోధ నుండు నిజాసనాసీనుండై యున్నం జూచి తల్లి చిత్తంబున గర్హించుచు నతనికి ధర్మంబును నీతియును జుట్టఱికంబును బ్రదుకుందెరువును నిజశక్తియు సహాయంబు గాలందియుం గులజనచిత్తప్రకారంబును బాండుపుత్రుల బలపరాక్రమంబులుం దెలియునట్లుగాఁ దెలుంగుపడం జెప్పి బుజ్జగించియుం గినిసియు ననేకవిధంబుల నాడిన నమ్మాటల దెస ననాదరంబు సేసి యుద్ధతిం గ్రమ్మఱం జనియె నంతఁ గర్ణా దులం గలసి వారును దానును దుర్మంత్రంబునకుం జొచ్చి.........

(భారతము-ఉద్యోగపర్వము.)

పోతనామాత్యుని గద్యములకుఁ, బద్యములకుఁ గల ప్రతిభ గనుపట్టదు. గద్యములు పద్యములవలెఁ బదార్థప్రతిపత్తిని గలిగి యుండక పదముల పొందికకు లక్ష్యములుగ నున్నవి.

వ. అని పలికిన శుక్రకుమారకు వచనంబు లాకర్ణించి దానవేంద్రుండు దనకు దండ ప్రణామంబు చేసి నిలుచున్న కొడుకును దీవించి బాహుదండంబు సాఁచి డిగ్గన దగ్గఱం దిగిచి గాఢాలింగనంబు సేసి తనతొడలమీఁద నిడుకొని చుంచుముద్ది చిబుకంబుఁ బుడికి చెక్కులి ముద్దుగొని శిరంబు మూర్కొని ప్రేమాతిరేకసంజ నిత బాష్పసలిలబిందుసందోహంబుల నతని వదనారవిందంబు దడుపుచు మంద మధురాలాపంబుల నిట్లనియె...... (శ్రీమదాంధ్రభాగవతము, సప్తమస్కంధము)

మనుచరిత్ర వసుచరిత్రాది ప్రబంధములందలి గద్యములు వర్ణనప్రాయములై ఆంధ్ర గద్యవాఙ్మయమునందు సామాన్యస్థానము గలిగియున్నవి. పింగళిసూరనార్యుని గద్యములు మృదుమధుర శైలిని గలిగి రసవంతములై ఆంధ్రసాహిత్యమునందు వచనరచన లకుఁ బ్రమాణములుగ నున్నవి.

వ. అని లజ్జాశోకంబు లడర నవనతముఖి యైన కలభాషిణిం జూచి మణికంధరుం డిట్లని యె నోయుత్తమవిలాసిని, నిన్ను నితరవారవనితలయట్ల సత్యవాదినిగాc దలంప నంతవింతవాcడనే. నీపలికినట్ల నీకు మున్ను నాయందుc గోరిక గలుగుటకు గుఱు తొకటియున్నది యది యెద్ది యంటేని నారదుండు కడపట నిన్ను నింటికి నను పుచు నేను విన నీతోడ...... (కళాపూర్ణోదయము)

వ. ఇట్లు తలపడి యమ్మనుజదనుజులు బీరంబులు దోరంబులుగాc బోరుతఱి ఘూర మణుండు క్రుద్ధుండై సమిద్ధరణి బద్ధపరంపర యగు నంపటం బెంపటం జంపరాదు నిలింపారాతినని వితర్కించి కించిత్తును గొంచక కాంచనద్రవకంచుకితంబును ధరణి ఖరకిరణకాండ చండంబును నయి యాఖండలదోర్దండసముజ్జృంభితవజ్రాయుధచక్ర చకం బకపక నవ్వు వజ్రభేదియలుంగు వెలుంగ మత్తారులకు నుత్తంభిదు నత్తలం బున, బద్మరాగమణిమాడం బగు కేడెంబునుం గొని వేడెంబుగం దురంగంబుc బఱపి తెఱపి గని తఱటుచేసి... (మనుచరిత్రము)

ఆదియుగమునందును, మధ్యయుగమునందును ఆంధ్రగ్రంథములందు హృద్యములైన గద్యములు విలసిల్లినను గద్యకావ్యములు వెలువడలేదు. ఆధునికయుగమునందు పరవస్తు చిన్నయ్యసూరిగారు రచియించిన పంచతంత్రము గద్యకావ్యములకు మాతృక యైనది. కందుకూరి వీరేశలింగము పంతులుగారు, కొక్కొండ వేంకటరత్నము పంతులుగారును చిన్నయ్యసూరిగారి మార్గము నవలంబించుచు పంచతంత్రభాగములను రచియించిరి.

తొల్లి యొక జంబుకంబు వనమ్మునం గ్రుమ్మరుచు నెక్కడ నాహారంబు చేకూఱమిం గరం బుదరం బాcకట నకనకంబడ డిల్లపడి వికలాంగంబులయి నేలంగూలిన శతాంగంబులును ఖండితపుం డాదంతకాండంబు లయి కెడసి తొండలపిండు విడం బిందు చేదండతండంబులును ముంగాళ్లువిఱిగి డొక్కలు పెరిగి మూఱు మెడలు వైచి తాఱుమాఱుగం బడియున్న వారువంబులును నెఱమగంటిమి మెఱయ వాతెఱం గొఱుకుచుం జూపు జంకెనల పొంకంబు వదలని శిరంబులును వాలుదొఱంగని కరంబులును గరంబు మెఱయ వీరశయనంబు నొందిన యోధవారంబుం గలిగి ఘోరంబయి వివిక్తంబయిన యొక్క పాలికలనిం గని తఱియంజని యొక్క దారుణారావంబు విని గుండియ లవియ బెండుపడి మూర్ఛిల్లి కొంతవడికిం దెప్పిఱి తెప్పలువిచ్చి యప్పొలంబు నలుదలంకులు విలోకించి గాలింగదలుc బ్రేలుకొమ్మలతాcకున మ్రోcగు దుందుభిం

గని మనంబునం దలంచఁగు కొండెంబు మాని దాని డాయంబోయి యద్దానితోలు వ్రీలంగొట్టి చొరంబడి వెడలివచ్చి దీని కలరూపు తొలుతం దెలియంజాలనయితి. ఇప్పుడుగదా దీని చొప్పు నెఱింగితి............ (నీతిచంద్రిక-చి. సూరి)

అని మఱియు నాచిత్రవర్ణుని కొలువుడుకాండ్రు పెక్కండ్రు రోషదూషితులై నన్ను దిసంతులు గొట్టుచుఁ, బెక్కులు దురాలాపంబులు పలికిరి. అవియెల్ల నల్లంబునంబట్టి, ప్రత్యర్థి నంతకు నంతకుఁ బుచ్చునంతకు నెంతయు దేహదాహంబు సేయుచుండును. నే నశక్తుండఁ గావున, లాఘవాస్పదుండనై భంగంబు మ్రింగి, యెప్పటియొప్పున నందఱిలో నా నని తలయెత్తి తిరుగుచుంటిని. నే నొక పౌరుష శాలినే ? ఈయవమానంబు మానవంతుం డోర్చునట్టిది కాదు. అచేతనమయ్యును, సూర్యకాంతము తపనుపాదములు సోఁకినంతనె ప్రజ్వరిల్లు ననఁ, జేతనుం డగు నభిమానవంతుఁ డె ట్లహితకృతతిరస్కారంబుఁ జూచి సైఁచును ? అయిన, నాభంగపాటు స్వామికి నివేదింపవలె నను నభిలాష పాశంబు, ప్రాణంబుల వెడలనీక బొందితో బంధించి నన్నిక్కడ కీడ్చితెచ్చెను......... (నీతిచంద్రిక-కం. వీ.)

వీరేశలింగము పంతులుగా రాంధ్రవాఙ్మయమునందు గద్య కావ్యనిర్మాణమునకు జనకుఁడుగఁ బరిగణింపఁ బడుచున్నాఁడు. రావు బహద్దరు వీరేశలింగము పంతులుగారి హస్తములం దాంధ్ర గద్యకావ్యము లాంధ్రసాహిత్య స్వరూపమును పరిస్ఫుటము చేయుటకు వినియోగపడినవి. వీరేశలింగముగారి వచనరచనలు వాఙ్మయమునందు వచనకావ్యముల ప్రయోజనమును సువ్యక్తముచేసినవి. పండితాధీనమునందున్న సాహిత్యోపాసనమును ప్రజాధీనముచేయుటకు వీరేశలింగముగారి రచనలు వినియోగపడినవి. పండిత పామరులు, స్త్రీపురుషులు, బాలబాలికలు వీరేశలింగముగారి వచన కావ్యములను జదివి ఆధునిక యుగవాఙ్మయమునకు సాధకులయిరి. ఆంధ్రవాఙ్మయమునందుఁ బద్యకావ్యములకు వలెనే గద్యరచనలకును గల పరమప్రయోజనమును వీరేశలింగము పంతులుగారి రచనలు విశదము చేసినవి. పంతులుగారు సుమారు ౧౩౦ గ్రంథములను వివిధములైన వాఙ్మయాంగములందును రచియించిరి. నాటకములు, ప్రహసనములు, చరిత్రలు, శాస్త్రములు, కథలు, విమర్శనలు మొదలగు వాఙ్మయాంగములందు రచించిన ఆగ్రంథము లాంధ్ర

వాఙ్మయ పరిణామమునకు లక్ష్యములుగ నున్నవి. రాజశేఖరచరిత్ర మాంధ్రవాఙ్మయమునందు మొదటి నవలగ పరిగణింపఁబడుచున్నది. చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు వివిధాంగములందు రచించిన గ్రంథములును నీ లక్ష్యమునకు నిదర్శనములుగ నున్నవి.

నవలలు

వాఙ్మయాంగములందు నవలాంగము వర్తమానయుగమున విశేషమైన వ్యాప్తిని గలిగి ప్రజాదరణమును బడయుచున్నది. ఆంగ్లభాషయందు వెలువడుచున్న నవలలకు లెక్కలేదు. ఆంధ్రభాషయందు నవలల రచన యిటీవలనే యారంభమైనను సత్వరముగ నభివృద్ధిని బొందుచున్నది. ఇంతవఱకును అయిదారు వందల నవలలు ప్రచురింపఁబడినవి. (ఆంధ్రవాఙ్మయాంగమునందు నవలాంగ మితర వాఙ్మయాంగములవలె భాషాంతరీకరణముతో నారంభమైనది. వంగ మహారాష్ట్రాంగ్లాదిభాషలనుండియును నవల లాంధ్రీకరింపఁబడినవి. ఆంధ్రవాఙ్మయమునందుఁ గొన్ని స్వతంత్రరచన లేర్పడినను నవలాంగము బాల్యదశయందున్నది. సంస్కృత వాఙ్మయముమీఁద నాధారపడియుండుట కవకాశములేని నవలాంగమున కాంధ్రవాఙ్మయమునందు స్వాతంత్రముగ వికసించుట కవకాశములు గలవు. ప్రేమసూత్రమును, కల్పనాశక్తిని, పాత్రశీలమును, మృదుమధురశైలిని, నవరసములను, ధర్మప్రవృత్తిని జిత్రకథారూపమునఁ బోషించుట కవకాశములుగలిగి పండితపామరులకు సులభగ్రాహ్యమైన నవలలు గద్యకావ్య రూపమున మహావ్యాప్తిని బొందుచున్నవి. ఆంధ్రవాఙ్మయమునందుఁ గొన్ని స్వతంత్రములై గంభీరములైన నవలలు వెలువడినవి. వానివిమర్శన ఇక్కడ అప్రస్తుతము.

ఆంధ్రవాఙ్మయమునం దారంభదశయందున్న నవలారచన మహోపద్రవముతోఁ గూడియున్నది. ప్రపంచమంతయుఁ బరివర్తనమయమై యున్నది రాజ్యాంగములు మాఱుచున్నవి. సాంఘికవ్యవస్థలు నవీనాకృతినిదాల్చుచున్నవి. విద్యాప్రవృత్తి మాఱుచున్నది.

ఆర్థికవిధానములు తాఱుమాఱు అగుచున్నవి. దాంపత్య ధర్మము నూతన లక్ష్యమును నిరూపించుచున్నది. సంసారప్రవృత్తి నవభావోదయమును, నూతననిర్మాణమును గోరుచున్నది. స్వాతంత్ర్యము, సమానత్వము, సౌభ్రాతృత్వము సాంఘికరాజకీయ మతవ్యవస్థలయందు సత్యాశ్రయమును బడయుచున్నవి. ప్రపంచలక్ష్యము జీవయాత్రనుండి దేహయాత్రకు మఱలుచున్నది. విశ్వప్రవృత్తికిని, విశ్వకల్యాణమునకును మూలమైన స్త్రీపుంసయోగమునందు బ్రపంచలక్ష్యము లగ్న మగుచున్నది. కామ ప్రయోజనమున కభ్యస్తమైన స్త్రీపుంసయోగమును ధర్మపరము చేయుటకు విశ్వము పరితపించుచున్నది. ధర్మలక్ష్యము నిత్యమైన యాధ్యాత్మిక ధర్మమునందు లగ్నముగాక అనిత్యమైన ఆధిభౌతికధర్మమునందు లగ్నమగుచున్నది. సుందరాంగములు, సుందరాంబరములు, భాగ్యభోగములు ధర్మప్రవృత్తికి లక్ష్యములుగ నున్నవి. ఈ మహాసంధిసమయమునందు ధర్మప్రవృత్తిని నిర్ణయించుటకును, బోధించుటకును నాటకములు, నవలలు, కథలు మహాప్రతిపత్తిని గలిగియున్నవి. దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు, నవలలు, నాటకములు కామకళావిన్యాసమయములై విషయ వాసనల కాలవాల మగుచున్నవి. విషయవాసన లపారముగ నభివృద్ధిఁ జెందుచు నాత్మసంస్మరణము, సందర్శనము దుర్లభమగుచున్నవి. ఆంధ్రహృదయమునకు సహజమైన ప్రేమభక్తి రసములు పరిస్ఫుటమగుటకును, మానవధర్మాభ్యుదయము సాధ్యమగుటకును నవలారూపమైన గద్యకావ్యములను కృతికర్త లుత్తమమార్గమున రచించి ఆంధ్రవాఙ్మయ ప్రయోజనమును సార్థకము చేయుదురు గాత!

ఆంధ్రమహాభారతమునందు విశ్వశ్రేయస్సునకును, చతుర్విధ పురుషార్థ సిద్ధికిని సాధనభూతముగఁ బ్రతిపాదితమైన వైదిక కర్మమార్గమును, సంస్కృతసాహిత్య సంస్కారమును వర్తమాన యుగ రచనలయందు భక్తిమార్గముగను, తెలుఁగుసాహిత్య సంస్కారము

గను బరిణమించిన విధ మాంధ్రవాఙ్మయభ్యాదయవికాసము విశ దము చేయుచున్నది.

ఆంధ్రవాఙ్మయమునందలి గ్రంథములను రచియించిన గ్రంథ కర్తలు సామాన్యముగ నగ్రజాతుల పురుషులుగానున్నారు. రమా రమి ౨౦౦౦ గ్రంథకర్తలు గలరు. వారియందు సుమారు ౧౦౦ మంది స్త్రీలు గలరు. స్త్రీ విరచితమైన కృతులయందు కుమ్మర మొల్ల విర చితమైన రామాయణ మాంధ్రసాహిత్యస్వరూపమును సకలవిధ ములను మనోహరముగఁ బ్రత్యక్షము చేయుచున్నది.

వైదికవిజ్ఞానసాధనమున ధర్మప్రవృత్తిని ప్రజాజీవనమునందుఁ బ్రతిపాదించుటకు ఆంధ్రమహాభారతము వినియోగపడినది. ధర్మ రాజ దుర్యోధనేతిహాసములు ధర్మాధర్మముల ప్రభావమును బ్రత్య క్షము చేసినవి. వైదికవిజ్ఞానవిలసితమైన భాగవత భక్తిని ప్రజాజీవ నమునందుఁ బ్రత్యక్షముచేయుచు శృంగారభక్తిరసానందమును గలుగఁజేయుటకు ఆంధ్రభాగవతము వినియోగపడినది. వైదికేతిహాస ఫలదాయకమైన వీరరసానందము ననుభవించుటకు రామాయణ సం కీర్తనము వినియోగపడినది. ప్రజాప్రవృత్తియందుఁ గరుణారసానంద మును స్ఫురింపఁజేయుటకు జైనబౌద్ధగాథలు వినియోగపడినవి. వైదిక కర్మప్రవృత్తి, వైదిక విజ్ఞానము పురాణేతిహాస కావ్యనాటకాది సాహిత్య రూపములను వాఙ్మయాభ్యుదయమునకు వినియోగపడినవి.

ఆంధ్రవాఙ్మయమునందు సంస్కృతవాఙ్మయాధారమున విలాస వంతమైన వాఙ్మయము ప్రధానముగ నున్నది. భాష, భావములు, వృత్తములు, సంప్రదాయములు సంస్కృత మయములై ఆంధ్రవాఙ్మయ స్వరూపమును దాల్చినవి. ఆంధ్రవాఙ్మయ రచనలందు తిక్కన, పోతన, సూరన్న మొదలగు మహాకవులు సంస్కృత సాహిత్యమున కాంధ్ర సాహిత్యమును సంయోగముచేసినను సంస్కృత సాహిత్య ప్రాబ ల్యము సర్వత్ర గోచరమగుచున్నది. ఈ పండిత సాహిత్యము జన సామాన్యమునకు దురారాధ్యమై సాహిత్యప్రయోజనమును సమ

కూర్పఁ జాలకపోయినది. జైనులు, బౌద్ధులు, వీరశైవులు, వీరవైష్ణవులు, జంగములు, హరిదాసులు, వేదాంతులు, బైరాగులు, స్త్రీలు, వారి రచనలందు దేశీయ సాహిత్యము నుపయోగించినను ఆ వాఙ్మయము పండితాదరణములేక గౌరవము గాంచకున్నది. ఆంధ్ర వాఙ్మయమునందు బసవపురాణములు, విష్ణుచిత్తీయములు, పల్నాటి వీర చరితములు, బాలనాగమ్మకథలు, బొబ్బిలికథలు, వేమన శతకములు, కుచేలుని కథలు స్వల్పముగనున్నవి. స్వయంవ్యక్తిత్వము లేని వాఙ్మయము ప్రతిభారహితమై వాఙ్మయప్రయోజనములను సఫలము చేయఁజాలదు. ఆంధ్రవాఙ్మయము స్వయంవ్యక్తిత్వమును గలిగి సర్వతోముఖమైన యాంధ్రాభ్యుదయమునకు సాధనభూత మగుటకు స్వతంత్రమైన పద్యకావ్యములును, గద్యకావ్యములును, శాస్త్ర గ్రంథములును నిర్మింపఁబడవలసియున్నవి.

ఆంధ్రవాఙ్మయ వికాసమునకు ఆదియుగమునందు సంస్కృత వాఙ్మయమును, వైదికకర్మమార్గమును మూలాధారమైనవి. సంస్కృత భాషాసాహిత్యము లాంధ్రసంస్కారమును బొంది ఆంధ్ర వాఙ్మయము నిర్మింపఁబడినది. మధ్యయుగమునందు విజయనగర సామ్రాజ్యవిజయములు, భక్తిమార్గము పోషణమును గలుగఁజేసినవి; ఆంధ్రభాషాసాహిత్యములు సంస్కృతసంస్కారమును బొంది ఆంధ్ర వాఙ్మయము స్వతంత్ర రూపమును దాల్చినది. ఆధునికయుగమునందు పాశ్చాత్యవిజ్ఞానము, భౌతికసంపదలు వాఙ్మయాభ్యుదయమునకు సాధనములగుచున్నవి. ఆంధ్రభాషాసాహిత్యములు సహజమైన ఆంధ్రవాఙ్మయస్వరూపమును దాల్చుచున్నవి. ఆదియుగమునందుఁ బండితారాధ్యమైన వాఙ్మయము వర్తమానయుగమునందుఁ ప్రజారాధ్యమగుచున్నది; సంస్కృత ప్రాయమైన వాఙ్మయము తెలుఁగురూపమును దాల్చుచున్నది; వైదికకర్మపరమైన వాఙ్మయము భక్తిపరమైనది; పద్యాత్మకమైన వాఙ్మయము గద్యస్వరూపమును బొందుచున్నది. వాఙ్మయమునకు విజ్ఞానవ్యాపనము, రసానందమును

పరమార్థములుగఁ బరిగణింపఁబడుచున్నవి. ప్రజలయందు విజ్ఞాన వ్యాపనము చేయుటకు వివిధ శాస్త్రములు, చరిత్ర, కళలు, విమర్శనలు మొదలగు విషయములకు సంబంధించిన గ్రంథ సముదాయము వాఙ్మయమునందు వెలువడవలసియున్నది.

వాఙ్మయములయందు ఆదికాలమునందుఁ బద్యకావ్యములకుఁ గల గౌరవప్రతిష్ఠలు వర్తమాన కాలమునందు గద్యకావ్యములకుఁ గలుగుచున్నవి. వాఙ్మయరంగములందుఁ బూర్వము కవులస్వత్వము లైన గౌరవసన్మానములు వర్తమానకాలమునందు శాస్త్రజ్ఞులకును, గద్యకావ్యనిర్మాతలకును సాధ్యములగుచున్నవి. పద్యకావ్యములకుఁ గల గౌరవప్రతిష్ఠలు వర్తమానకాలమునందు గద్యకావ్యములకును గలుగుచున్నవి. గద్యకావ్యరూపమున వెలయుచుఁ బ్రజాదరమును బడయుచున్న నవలల వ్యాప్తి గద్యకావ్యములకుఁ బ్రజాహృదయమునఁ గల యాదరణమును విశదముచేయుచున్నది. కావ్యములకుఁ బరమార్థమైన విశ్వశ్రేయస్సు పద్యకావ్యముల మూలమునవలె గద్యకావ్య మూలమునను సాధ్యమగుచున్నది. ఆంగ్లవాఙ్మయమునందలి గ్రంథసముదాయమునందు సహస్రాంశమైనను ఆంధ్రవాఙ్మయమునందలి గ్రంథసముదాయము లేదని గ్రహించినపుడు ఆంధ్ర వాఙ్మయముయొక్క వికాసావసరము తెల్లమగుచున్నది.

విశ్వకల్యాణమునకు నివృత్తిప్రవృత్తి మార్గములు, జ్ఞానభక్తి మార్గములు, సాంఖ్యకర్మయోగములు, త్యాగభోగ యోగములు, కరుణ వీరరసములు, శాంతశృంగారకలాపములు, శాస్త్రములు, కళలు, సుఖదుఃఖములు సాధనభూతములుగనున్నవి. మహాకవులు విశ్వావృతములైన దివ్యసాధనములను గద్యపద్యాత్మకములైన కావ్యరూపములను బ్రత్యక్షముచేయుచుఁ గావ్యరసానుభవరూపమున ఆనందమును గలుగఁజేయుచున్నారు. విశ్వమునందు జీవయాత్రకు దుఃఖనివృత్తియు, నిరతిశయ సుఖప్రాప్తియుఁ బరమార్థములు. ఆ పర

మార్గము నాంధ్రవాఙ్మయము సమకూర్చిన విధము ఇందు వివరింపఁ బడినది.

ఇందుఁ గ్రొత్తవిషయములు లేవు. ఇంతవఱకును నితరపరిశోధకులు, వ్యాఖ్యాతలు తెలిపిన భావములే మరల తెలుపఁబడినవి. ఇంతవఱకును వాఙ్మయ విమర్శకులును, వ్యాఖ్యాతలును వ్రాసిన రచనలీ గ్రంథమును వ్రాయుట కుపకరించినవి. ఈ గ్రంథకర్తలకును, నితర గ్రంథకర్తలకును సహాయముచేసిన పండితులకును, సహచరులకును కృతజ్ఞుఁడను. ఆంధ్రమహాజను లిందలి గుణములను గ్రహించి ఆంధ్రవాఙ్మయాభ్యుదయమునకీ ప్రచురణమును సాదరభావముతో నాదరించి యుపయోగించెదరు గాత !